
ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



'విలుకాడు'

14-1-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు







వార్తాచిత్రాలు


(1) గత శనివారంనాడు గాంధీజీ కాందిశీకుల శిబిరంలో ప్రార్థన సమావేశం జరిపారు. ఆ సమావేశంలో గాంధీజీ ఉపన్యసిస్తున్న దృశ్యం.

(2) గాంధీజీ ఉపన్యాసానికై వేచియున్న కాందిశీక స్త్రీ బృందం.

(3) సింహళ ప్రధాని సేనానాయకేగారు మద్రాసు విచ్చేసినపుడు కుమారరాజా ముత్తయ్యచెట్టిగారు ఆయనకు తేనీటి విందొసగారు. ఆ సందర్భంలో ఈ ఛాయాచిత్రం తీయబడింది. మద్రాసు గవర్నరు నై, సింహళ ప్రధాని సేనానాయకేగారలు హారాలు ధరించి మధ్యని లభడివున్నారు. లండన్‌లో భారత హైకమీషనర్ కృష్ణమీనన్‌గారు, (గవర్నర్ ఎడమప్రక్క రెండవ వ్యక్తి) మద్రాసుమంత్రులు ఈ చిత్రంలో కనిపిస్తున్నారు.









(4) ఈమధ్య ఢిల్లీలో జరిగిన సింహళ-భారత ప్రధానుల సమావేశంలో పాల్గొనటానికి వచ్చిన సింహళంలోని భారతీయుల ప్రతినిధివర్గం. సింహళంలో భారత ప్రతినిధి వి. వి. గిరిగారు, సింహళ భారతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు తొండమాన్, పేరి సుందరం, అజీజ్, రామానుజంగారలు ఈ చిత్రంలో కనిపిస్తున్నారు.

(5) మద్రాసు మతసామరస్య సంఘసమావేశం ట్రిప్లికేన్‌లో జరిగింది. మంత్రి భక్తవత్సలంగారు ఈ సమావేశానికి ప్రారంభోత్సవం జరిపారు. మంత్రిగారి కుడిప్రక్కన యస్. యం. ఫాసిల్, అబ్దుల్ హమీద్‌ఖాన్‌గారలు, ఎడమప్రక్కన అధ్యక్షులు వెంకటేశయ్యంగారు కనిపిస్తున్నారు.

(6) న్యూఢిల్లీ ఆంధ్రసంఘంవారు సింహళంలో భారత ప్రతినిధి వి. వి. గిరిగారికి 31-12-47 వ తేదీన విందు చేసినప్పుడు తీసిన దీ చిత్రం. గిరిగారు పూలమాల పట్టుకొని వున్నారు. ఆయన కుడిప్రక్కన వున్నవారు ఆర్థికశాఖ కార్యదర్శి నరహరి రావుగారు.

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 40

సంచిక 18

Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర పుష్య శుద్ధ తృతీయ బుధవారము



రాదాకృష్ణులు

శ్రీ వెంపటిసత్యం, శ్రీమతి సౌదామినుల నృత్యభంగిమ.



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ జనవరి నెల 14-వ తేది బుధవారము

పాకిస్తాన్ - హైదరాబాదు సంబంధాలు

నైజాము ప్రభుత్వము పాకిస్థానుకు రు. 20/-కోట్ల విలువగల భారత ప్రభుత్వ సెక్యూరిటీల నిచ్చి, అంత మొత్తమునకు పాకిస్థాన ప్రభుత్వ సెక్యూరిటీలను తీసికొనెనని హైదరాబాద్ సంస్థాన ఆర్థికమంత్రి తెలిపెను. పాకిస్థానుకు వీరు అప్పుపెట్టిరను వార్త దీనితో ధ్రువపడినది. పాకిస్థాన భారత దేశ సంబంధములు చెడుటకు చాల రోజులమునుపే ఈ ఏర్పాటు జరిగినదని, హైదరాబాద్ ఆర్థికమంత్రి నవాబ్ మోయిన నవాజ్ జంగ్ గారు ఉద్ఘాటించిరి. వాస్తవమునకు ఈ ప్రతిపాదనగురించి గత నవంబరు మాసారంభమునుండి హైదరాబాద్ ప్రభుత్వము ఆలోచించుచున్నదనీ, పాకిస్థాన భారతదేశముల సంబంధములు సామరస్యముగ నడచుచున్నవనేగాక, భారతదేశము పాకిస్థానును, ఉదారభావముతో చూచి, విశేషముగా పైక మివ్వదలచినదని తెలిసినమీదటనే, ఈ సెక్యూరిటీలను మార్చుటకు నైజాము ప్రభుత్వ నిర్ణయమును త్వరితముచేసినదనెను. ఇది భారత ప్రభుత్వము యెడ స్నేహ విరుద్ధమైన చర్య కాదనిరి. అదీగాక, ప్రభుత్వము మరొక రాజ్య సెక్యూరిటీలను ఉంచుకొనుట సామాన్యముగ జరుగునదే ననిరి.

నవాబ్ మోయిన నవాజ్ జంగ్ గారి ప్రకటన భారత పాకిస్థాన ప్రభుత్వముల సంబంధములు చెడినతరువాత ఈ అప్పును ఇచ్చెడివారు కారని స్ఫురింపచేయుచున్నది. పైగా ఆర్థిక పంపకము విషయమున భారతప్రభుత్వము పాకిస్థానయెడల ఉదారభావముతో కూడనున్నదని తెలియుటకూడ అందుకు మూలమనిరి. ఆర్థిక పంపక ఒప్పందము, డిశంబరు మాసమున జరిగినది. దాని స్వభావము నైజాము ప్రభుత్వమునకు నవంబరు మాసారంభముననే తెలిసినదన్నమాట! అదీగాక పాకిస్థాన భారత సంబంధములు చెడకముందే ఏర్పాటు జరిగినదనుచున్నారు. ఈ సంబంధములు చెడిన దెపుడో వారు తెలిపిన బాగుండెడిది. అది తెలుపలేదు. అప్పు ఏ తేదీన ఇచ్చినదీ తెలుపలేదు. బహుశః కాశ్మీర్ సమస్యను పురస్కరించుకొని భారత ప్రభుత్వము ఆర్థిక ఒప్పందమును అమలుజరుప తిరస్కరించిన మీదటనే సంబంధములు చెడినవని వారి యభిప్రాయము కాబోలు! అనగా ఈ మధ్యనే వారు అప్పు ఇచ్చిరని తేలుచున్నది. అలా జరిగినప్పటికీ, లేక తాము నవంబరు ఆరంభములో భారతప్రభుత్వము పాకిస్థానుపట్ల ఉదారముగ నుండబోతున్నదని వినినపుడే జరిగినప్పటికీ, రెండు సందర్భములందుకూడ వారు 'పాకిస్థానతో' పరీకయిరని అనవలసి వచ్చుచున్నది. కాశ్మీర్ అక్టోబరు ఆఖరువారమున భారత యూనియనులో చేరినది. అప్పటికే ఆ సంస్థానమునైన దుండగీండ్ర దండయాత్ర ప్రారంభమైనది. అంతకు కొద్దిరోజుల ముందే భారత హైదరాబాద్ ప్రభుత్వముల ఒప్పంద మసాయిదా తయారయి, హైదరాబాద్ ప్రతినిధివర్గము నైజాము అంగీకారమునకు ఢిల్లీనుండి హైదరాబాదుకు వచ్చుట, ఇత్తెహాదుల్ ముస్లిమీనుల దౌర్జన్యములవల్ల అది భగ్నమగుట జరిగినది. కాశ్మీర్ సమస్యమూలమున భారత, పాకిస్థానుల సామరస్యము చెడదని అనుకొనుటగాని, లేక ఆ సమస్యకు, హైదరాబాద్ రాయబారములకు సంబంధము లేదనుటగాని వీలులేదు. ఒకవేళ నవాబ్ మోయిననవాబ్ జంగ్ గారి సమర్థన నంగీకరించినప్పటికీ, హైదరాబాద్ పాకిస్థానుకు అప్పిచ్చినది, నవంబరు ఆరంభమున మాత్రము కాదని తేలుతున్నది. ఆర్థిక విభజన ఒప్పందమునకు పూర్వము అయియుండవలెను. అంతేకాక నవంబరు 29 కి ముందుకూడ అయియుండవలెను. ఆ రోజునే భారత ప్రభుత్వమునకు, నైజామునకు యథాతథపు టొడంబడిక జరిగినది. దీని తదనంతరము జరిగినా, అంతకుముందు జరిగినా నైజాము ప్రభుత్వము భారతప్రభుత్వము పట్ల స్నేహవిరుద్ధచర్యను చేసినట్లే యెంచవలెను. ఆగస్టు 15 నాటికి బ్రిటిషు ఆధిపత్యము తొలగిపోయినందువల్ల ఉన్న ఏర్పాటు మరొక సంవత్సరకాలము సాగుటకు నవంబరు 29 యథాతథపు టొడంబడిక ధ్రువపరచినది. సార్వభౌమత్వము అనునది లేకపోవచ్చును గాని అన్ని విషయములందు ఆగస్టు 15 కు పూర్వము ఏ స్థితి యున్నదో ఇపుడుకూడ అదే స్థితి యని సర్దార్ పటేల్ అధినివేశ శాసనసభయందు విస్పష్టము చేసెను. "కొత్త ఒప్పందములు చేసికొనువరకు, ఆగస్టు 15 కు పూర్వము, విదేశ, సైనిక, రాకపోకల వ్యవహారములతో సహా ఉభయులకు సంబంధించిన సమష్టివ్యవహారములకు చెందిన యావత్తు ఒడంబడికలు, పరిపాలనా ఏర్పాట్లు భారత, హైదరాబాద్ ప్రభుత్వములకు యథాతథముగా నుండును," అని 29 నవంబరు యథాతథపుటొడంబడిక మొదటి నిబంధన తెలుపుచున్నది. దీనికి తోడుగ నైజాము ఆనాడే భారత గవర్నరు జనరలుకు వ్రాసిన ఉత్తరములో, "ఈ ఒడంబడిక అమలులో నున్నంతకాలము, నాకుగల సర్వాధిపత్య అధికారములను కొన్నిముఖ్య విషయములలో చలాయించుట విరమించుకొనుచున్నానని నాకు తెలియును" అని తెలియజేసెను. ఈ రెండిటివల్లకూడ, నైజామునకు సంవత్సరమువరకు విదేశములతో వ్యవహార స్వాతంత్ర్య మనునది లేదని స్పష్టమగుచున్నది. విదేశరాజ్యమైన పాకిస్థానుతో స్వతంత్రముగ ఆర్థికమైనదేగాక ఏవిధమైన వ్యవహారమును స్వతంత్రించి జరుపకూడదని తెలతెల్లమగుచున్నది. కాబట్టి పాకిస్థానుకు 20-కోట్ల భారత సెక్యూరిటీలను భారతప్రభుత్వ అనుమతిలేక ఆగస్టు 15 తర్వాత ఎప్పుడు ఇచ్చినప్పటికీ అది యథాతథపు టొడంబడికను ఉల్లంఘించినట్లే అయి, భారతప్రభుత్వముపట్ల స్నేహ విరుద్ధచర్యగనే పరిగణింపవలసియున్నది. మొన్నసీమధ్య భారత ప్రభుత్వ నాణెముల చలామణి నిషేధముకూడ అట్టి స్నేహావిరుద్ధచర్యగనే యెంచుటతప్ప అన్యథా భావింప వీలులేదు. నైజామునకు తన ద్రవ్య చలామణి విషయమున కొన్ని హక్కులు అదివరకే యున్నవి. వాటివలన భారత ప్రభుత్వ నాణెములు వారి సంస్థానములో చలామణి అగుటకు అభ్యంతరములేదు. మరియు ఆగస్టు 15 కు పూర్వమున్న అన్ని ఏర్పాటులు అమలుజరుగువనీ, సంవత్సరము వరకు తన స్వతంత్రాధిపత్యము కొంతవరకు వదలుకొనుచున్నానని అంగీకరించినపుడు ఈ నిషేధము, యథాతథపు టొడంబడికకు సంపూర్ణముగ విరుద్ధము. ఆగస్టు 15 కు పూర్వము సంస్థానములో భారతప్రభుత్వ నాణెములు చలామణి అగుచున్నట్లే ఇపుడుకూడ అనగా యథాతథపుటొడంబడిక అమలు నందున్నంతకాలము చలామణి కావలెను.

ఈ రెండు స్నేహావిరుద్ధ చర్యలే గాక, పాకిస్థానులో తన ఏజెంటు జనరలును నియమించదలచినట్లు కూడ తెలియుచున్నది. అట్టి ఏజెంటు జనరలును ఏ దేశములోనైనా నియమించదలచినపుడు ముందుగా, భారత ప్రభుత్వమునకు తెలియజేసి, దాదాపు వారి అనుమతి పొందవలసియున్నది. ఈ ఏజంటు జనరలు కేవలము, వర్తక వ్యాపార విషయ ప్రసక్తే కలిగియుండును. అదికూడ భారత ప్రభుత్వ ప్రతినిధితో సంప్రదించే తన బాధ్యతలను నిర్వహించవలసి యుండును. ఈ అంశము భారత గవర్నరు జనరలు మౌంట్‌బాటన ప్రభువు నవంబరు 29 న నైజామునకు వ్రాసిన ఉత్తరమునందు విస్పష్టముగ ఉద్ఘాటించెను. పాకిస్థాను ఏజంటు జనరలును నియమించుటకు ముందు భారతప్రభుత్వ అనుమతిని పొందెనో లేదో తెలియదు.

తామీవిధముగ విరుద్ధముగ వ్యవహరించుచుండ, యథాతథపు టొడంబడిక అమలు జరుగుటకు భారత ప్రభుత్వము సరియయిన సహకార మిచ్చుట లేదని హైదరాబాద్ ఆర్థిక మంత్రి నిందించుట విచిత్రముగ కనుపడక మానదు. ఆ ఒడంబడిక జయప్రదమగుటకు తమ వైఖరి ఏమాత్రము ఉపకరింప జాలదని గ్రహించుట మంచిది. భారత ప్రభుత్వ ఏజెంటు జనరలు 11 రోజులు పాటు రెసిడెన్సీ భవనములందు ఉండుటకు అభ్యంతరము తెలుపుట వారి అమిత్రవైఖరికి మరొక తార్కాణము. చివరకు భారత గవర్నరు జనరలు అదలింపుకు లొంగక తప్పినది కాదు. ఈ సంఘటనలన్నీ గమనించిన నైజాముప్రభుత్వము సావకాశము దొరికినపుడెల్ల యథాతథపుటొడంబడికను భగ్నమొనర్చి, స్వతంత్రాధిపత్యమును వహించదలచినదనీ, ఆ ఒడంబడికను కేవలము కాలవ్యవధికొరకు అంగీకరించినదనీ ధ్రువపడుచున్నది. పాకిస్తానులో చేరనని హామీ ఇచ్చినప్పటికీ అభిమానము వారిపట్లనే యున్నదని చెప్పవచ్చును. భారతప్రభుత్వమునకు తెలియజేయక రు. 20/- కోట్ల సెక్యూరిటీల నిచ్చుట అందుకు నిదర్శనము. భారత నాణెముల చలామణీని నైజాము రద్దుచేసినట్లే, వారు పాకిస్థానుకు ఇచ్చిన సెక్యూరిటీలను మననగదురూపమున మార్చుటకు వీలుకాదని భారత ప్రభుత్వము నిషేధించవలెను.

సంవత్సరము అగుసరికి భారత యూనియనులో చేరగలదనే భావముతోనే భారత ప్రభుత్వము నవంబరు 29 ఒడంబడికను భారతప్రభుత్వమంగీకరించినది. హైదరాబాద్ భారతదేశ అంతర్గత భాగముగ చేయుటే తన ఆశయమని ఏజంటు జనరలు కె. ఎమ్. మున్షీ తెలిపెను. యథాతథపుటొడంబడిక దీనికి అడ్డురాజాలదు. ఆయన కృషి జయప్రదమగుగాకయని కోరుచున్నాము. ఈ మధ్య అజ్మీరులో శాంతియుతముగ పరిష్కరింప దలచితిమిగాని, పోరాటమునకు భయపడుటలేదని, భారత ప్రధాని నెహ్రూజీ చేసిన హెచ్చరికను నైజాము ప్రభుత్వము గమనించియుండునని నమ్ముచున్నాము.

నేటి ప్రపంచం :

గ్రీస్ సమస్య మరొక ప్రపంచ యుద్ధానికి నాందిప్రస్తావనా?

"మేము సవ్యమైన, నిర్మాణాత్మకమైన, పద్ధతిలో శాంతి సాధనకు స్థిరసంకల్పంతో పనిచేస్తున్నాము. దారిద్ర్యాన్నీ, దౌర్భాగ్యాన్నీ, క్షుద్బాధనూ నిర్మూలించడానికి కృషిచేస్తున్నాము. ఈ పంథా శాంతికి దోహదం చేస్తుందిగాని, యుద్ధానికికాదు.

"చిన్న, పెద్ద అనే తారతమ్యంలేకుండా సకలదేశాలూ తమపై అన్యుల దురాక్రమణ జరుగుతుందనే భయంలేకుండా జీవయాత్ర చేసేందుకు వీలుగా ప్రపంచాన్ని నిర్మించడానికి పూనుకుంటున్నాము. ఇది శాంతికి దోహదం చేస్తుందిగాని యుద్ధానికి కాదు.

"మానవసౌభ్రాతృత్వాన్నీ, మానవ వ్యక్తిత్వ మర్యాదలనూ ప్రాతిపదికగా పెట్టుకొని ప్రపంచ ప్రజాబాహుళ్యంలో సామరస్య సౌజన్యాల స్థాపనకు పాటుపడుతున్నాము. ఇదికూడా శాంతికే దోహదం చేస్తుందికాని, యుద్ధానికి కాదు..."

ఇవి మొన్న జనవరి 7-న అమెరికా అధ్యక్షుడు ట్రూమన్, శాసనసభల సంయుక్త సమావేశంలో యూరప్‌ఖండ పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలుజరపడానికి తగిన అధికారమంతా తనకు ఇవ్వవలసిందని విజ్ఞప్తిచేస్తూ చెప్పిన మాటలు. మార్షల్ పథకాచరణకు సంబంధించినంతవరకూ,—త్వరలోనే అమెరికా అధ్యక్ష స్థానానికి ఎన్నికలు రాబోతున్నప్పటికీ,—పార్టీ రాజకీయాలకు అవకాశం ఇవ్వవద్దనికూడా ట్రూమన్ కోరాడు.

జాతీయాభ్యున్నతిని సాధించగలమనీ, వచ్చే పది సంవత్సరాలలో అమెరికన్ ప్రజల జీవన ప్రమాణాన్ని రెట్టింపుచేస్తామనీ, పేదవారిపై పన్నులభారం తగ్గించి, ఆవార వ్యాపారసంస్థలపై ఎక్కువ పన్నులద్వారా రాబట్టడమవుతుందనీకూడా చెప్పి ప్రెసిడెంట్ ట్రూమన్ డెమోక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం ప్రారంభించాడు.

వివిధదేశాల సహకారంతో ప్రపంచంలోని వివిధప్రాంతాలలో ఆర్థికపునర్నిర్మాణ కార్యక్రమాన్ని సాధించడానికి వీలున్నదని అమెరికన్ ప్రజలు విశ్వసిస్తున్నంతగా ఇతర దేశాల ప్రభుత్వాలన్నీ విశ్వసించడంలేదంటూ పరోక్షంగా మాత్రమే రష్యాతో తమకు ఏర్పడిన విభేదాల సమస్య ప్రసక్తిని ట్రూమన్ తెచ్చాడు.

1934 లో ఆర్థికమాంద్య పరిస్థితులను ఎదుర్కోడానికి ప్రెసిడెంట్ రూజ్వెల్టు అమలు పరిచిన నూతన ఆర్థికవిధానం లాంటి దాని ద్వారానే, ప్రెసిడెంట్ ట్రూమన్ ఈనాటి ప్రపంచ సమస్యలను పరిష్కరించవచ్చునని ఆశిస్తున్నాడు. కాని, అమెరికన్ ప్రభుత్వం యూరప్ ఖండ పునరుద్ధరణకై అనుసరించదలచిన విధానంపట్ల అమెరికాలోనే భేదాభిప్రాయం ఏర్పడింది.



మార్షల్

ఈసారి అధ్యక్షస్థానానికి స్వతంత్రపక్ష అభ్యర్థిగా పోటీచేయదలచిన హెన్రీవాలెస్ సుస్థిరమైన ప్రపంచ శాంతిస్థాపనకు ఆర్థికసహాయం అవసరమేగాని, దీన్ని అందజేయడానికి సవ్యమైనమార్గం మార్షల్ పథకంకాదని విమర్శిస్తున్నాడు. దానికి ప్రత్యేకించి మరొక పథకాన్ని సైతం వాలెస్ సూచిస్తున్నాడు. హెన్రీవాలెస్ ప్రతిపాదిస్తున్న పథకంలో ప్రధానాంశాలు: (1) ఐక్యరాజ్యసమితే పునర్నిర్మాణనిధి నొకదాన్ని స్థాపించడం అవసరమని అమెరికా సమితికి సలహా ఇవ్వాలి. (2) సమితి ఏర్పాటుచేసే సంఘంద్వారా ఈ నిధిని వినియోగించాలి. (3) పంచవర్ష ప్రణాళికకు కావలసిన ధనాన్ని అమెరికా, శక్తివున్న ఇతరదేశాలూ సమితికి విరాళాలుగా ఇవ్వాలి. (4) ఏ దేశం ఏ రాజకీయాలను, ఏ సామాజిక వ్యవస్థను అనుసరించినప్పటికీ అక్షరాజ్య దురాక్రమణ ఫలితంగా నష్టపడిన ప్రతిదేశానికీ దాని అవసరాన్నీ, యోగ్యతనూ బట్టి ఈ నిధి ముందు సహాయపడాలి. (5) నిధి చేసే ఋణసహాయానికి ఏవిధమైన



ట్రూమన్

రాజకీయ, ఆర్థిక సంబంధమైన షరతులను విధించడమంటూ జరుగకూడదు. (6) శాంతియుతమైన కార్యకలాపాల నిమిత్తమే ఈ ధనాన్ని ఏదేశమైనా వినియోగించాలిగాని, సైనిక పరికరాల సప్లయికోసమూ, ఆయుధ నిర్మాణంకోసమూ వాడకూడదనే ముఖ్యమైన షరతు మాత్రం వుంటుంది. (7) రూర్ ప్రాంతాన్ని నాల్గు అగ్రరాజ్యాల ఆధిపత్యంకింద వుంచి అక్కడ ఉత్పత్తి అయే సామగ్రిని యూరప్ ఖండ పునరుద్ధరణ కార్యకలాపాలకే వినియోగించాలి.

యుద్ధంలో దెబ్బతిన్న దేశాలకు ఏసహాయం జరిగినా, ప్రపంచశాంతి స్థాపననిమిత్తం ఏర్పడిన ఐక్యరాజ్యసమితిద్వారా జరగాలన్నదే వాలెస్ ప్రతిపాదించిన సప్తసూత్ర ప్రణాళికలో ముఖ్యంగా గమనించవలసిన అంశం. ఈవిధంగా చేస్తే, ఐక్యరాజ్యసమితి బలపడడమేగాకుండా, కావలసిన పనికూడా సానుకూలమవుతుందని వాలెస్ వాదన.

మార్షల్ పథకం ద్వారా ఆర్థికసహాయాన్ని అందజేయడానికి అమెరికా సంకల్పిస్తే, ఏదో స్వలాభాపేక్షతోనే ఈ విధంగా ఉద్యమిస్తున్నదనీ, ప్రపంచంలోని దుర్బల దేశాలలో డాలర్ సామ్రాజ్య వాదంద్వారా ఆధిపత్య స్థాపనకు ప్రయత్నిస్తున్నదనీ సందేహాలు, ఎదురు వాదనలు బయలుదేరినవి. వాలెస్ పథకం ఇట్టి సందేహాలనేవానికి తావు ఇవ్వని మాట వాస్తవం.

ఈ క్రొత్త ఆశయాలతో, స్వతంత్ర పక్షమనే ఒక క్రొత్తపార్టీలో హెన్రీ వాలెస్ ఈ సారి ఎన్నికలలో అధ్యక్షస్థానానికి పోటీ చేయడానికి సంకల్పించాడు. హెన్రీవాలెస్, కీర్తిశేషుడు ప్రెసిడెంట్ రూజ్‌వెల్టుకు ఒకప్పుడు కుడిభుజంలా పనిచేశాడు. డెమోక్రటిక్ పార్టీ తరఫునే ఉపాధ్యక్షుడుగా వున్నవాడు.

అమెరికాలో ఏర్పడిన నూతన పరిస్థితులకు అనుగుణంగా నూతనపక్షాన్ని లేవదీసి 1948 నవంబరునెలలో జరిగే అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేయదలిచాడు. ఇప్పటివరకూ అమెరికాలో వున్నవి రెండేరెండు ప్రముఖ రాజకీయ పక్షాలు: ఒకటి, డెమోక్రటిక్‌పార్టీ; రెండు: రిపబ్లికన్‌పార్టీ. కమ్యూనిస్టుపార్టీకూడా ఒకటి వున్నదికాని, దానికి అమెరికాలో ఎన్నదగిన ప్రాధాన్యం లేదనే చెప్పవచ్చు.

అమెరికా చరిత్రలో ఒక విశిష్ట సంఘటన ఫలితంగా రిపబ్లికన్‌పార్టీ ఉద్భవించింది. నీగ్రోలను బానిసలగా అమ్మేపద్ధతిని నిర్మూలించడం అవసరమనే సమస్యపై అమెరికా యూనియన్‌లోని ఉత్తరరాష్ట్రాలకు, దక్షిణరాష్ట్రాలకూమధ్య 1861-1865 సంవత్సరాలలో అంతర్యుద్ధం సంభవించింది. ఈ సమస్యే చివరకు దక్షిణ రాష్ట్రాలు యూనియన్‌నుంచి విడిపోవాలనే తీవ్రసమస్యగా కూడా పరిణమించింది. నీగ్రోలను బానిసలగా అమ్మేపద్ధతి యథాప్రకారం వుండాలని దక్షిణరాష్ట్రాల వాదన. అంతర్యుద్ధంలో చివరకు ఉత్తరరాష్ట్రాలే గెలవడం, యూనియన్ చెక్కుచెదరకుండా నిలవడం జరిగింది. నీగ్రో బానిసత్వం నిర్మూలం కావాలనే వారందరూచేరి అప్పుడు రిపబ్లికన్‌పార్టీని ఏర్పాటుచేసుకొన్నారు. ఈపార్టీవారే 1860లో అబ్రహాంలింకన్‌ను అమెరికా అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఒకప్పుడు డెమోక్రటిక్ పార్టీ కొంత మితవాద తత్వంతోనూ, రిపబ్లికన్‌పార్టీ అభ్యుదయ దృక్పథంతోను వుండేవి. ఈ నాడు ఉభయపక్షాల దృక్పథాలూపూర్తిగా తలక్రిందులైపోయినవి. రిపబ్లికన్‌పార్టీకంటే డెమోక్రటిక్ పార్టీ అతిపురాతనమైనది. అమెరికా స్వాతంత్ర్యపు స్థాపకులలో ఒకడైన ప్రెసిడెంట్ థామస్ జఫర్సన్ దీనిస్థాపకుడు. రిపబ్లికన్‌పార్టీది ఈనాడు సంపూర్తిగా మితవాదతత్వం. గుడ్డిలో మెల్లగా డెమోక్రటిక్ పార్టీయే నయం.

ప్రపంచ వ్యవహారాలలో అమెరికా దూరంగా వుండాలని రిపబ్లికన్ పార్టీ తత్వం. పరమాణుశక్తిరహస్యాన్ని పరిశోధించిన అమెరికా, ద్వితీయప్రపంచ సంగ్రామంలో తన ఆర్థిక పారిశ్రామిక వ్యవస్థ ఏమాత్రం చెక్కుచెదరని అమెరికా, ప్రపంచ వ్యవహారాలు తన కేవే పట్టనట్లు వూరుకోవడం కల్ల; అలా వూరుకోవడం భావ్యం కూడా కాదు.

ఈపరిస్థితులలో మాజీ ఉపాధ్యక్షుడు హెన్రీవాలెస్ క్రొత్తస్వతంత్ర పక్షాన్ని ఒకదాన్ని ప్రారంభించాడు. అమెరికన్ పారిశ్రామిక సంస్థ రాజకీయ కార్యాచరణసంఘం 1948 ఎన్నికలలో రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలలో ఏదో ఒకదానికే తాము వోటు చేస్తాముగాని, మూడోపార్టీని దేన్నీ బలపరచబోవడంలేదని ప్రకటిస్తున్నది. అందుచేత హెన్రీవాలెస్ అధ్యక్ష ఎన్నికలలో ఎంతవరకు కృతకృత్యుడవుతాడన్నది పూర్తిగా సందేహాస్పదమైన విషయమే. ఎన్నికలలో తమకేమీ అవకాశంలేదని గ్రహించిన కమ్యూనిస్టులు మాత్రం హెన్రీవాలెస్‌ను ముఖ్యంగా బలపరుస్తున్నారు. మార్షల్ పథకం కొనసాగకుండా చేయడమే అమెరికన్ కమ్యూనిస్టుల ఉద్దేశం.



వాలెస్

అందువల్ల వాలెస్ గెలుస్తాడనే నమ్మకం లేకపోయినా, అతడినే వారు బలపరచదలిచారు. డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థిగా నిలిచే ట్రూమన్‌కువచ్చే వోట్లలో కొన్ని వామపక్షీయుల వోట్లు వాలెస్‌కు పోవచ్చు. ఇది రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థిగా నిలవదలిచిన సెనెటర్ టాఫ్టుకు ఒక సదవకాశం కావచ్చు. రైటిస్టు, లెఫ్టిస్టు తత్వసంఘర్షణవల్లనే ప్రపంచ పరిస్థితి ఈనాడు ఇంత అధ్వాన్నంగా పరిణమించింది. యూరప్‌ఖండంలో అగ్రరాజ్య ప్రాబల్య ప్రాంతాలనే రెండు విభాగాలుగా చీలిపోవడానికి కారణం ఈ తత్వఘర్షణే. అమెరికాలో రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థేగనుక అధ్యక్ష స్థానానికి గెలిస్తే ప్రపంచ రాజకీయాలు మరీ అధోగతి పాలుగాక మానవు.

ప్రపంచయుద్ధం సమాప్తమై రెండు సంవత్సరాలు దాటి, మూడవ సంవత్సరం నడుస్తున్నది. పరస్పర సహకారంతో ప్రపంచ ఫాసిస్టు శక్తులను ధ్వంసంచేసి విజయాన్ని సాధించిన ప్రముఖ దేశాలు ఈనాడు శాంతిని స్థాపించడంలో విజయం సాధించలేకపోతున్నవి.

"ప్రపంచంలో ఈనాడు ఎక్కడచూసినా అస్థిరత్వమే విస్తారంగా కనుపిస్తున్నది. యూరప్‌ఖండ రూపురేఖలనే మార్చివేయడానికి ప్రబల ప్రయత్నాలు జరుగుతున్నవి. స్వతంత్రమానవజాతి ఆశయాలకు, స్వతంత్ర మానవనాగరికతకూ ఇది పూర్తిగా విరుద్ధంగ

(20 వ పేజీచూడుడు)

నవల

నారాయణభట్టు

✽

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౩౯

శ్రీ విద్యాశంకర జయంతి

శ్వేత వరాహకల్పమున వైవస్వత మన్వంతరమున ఇరువది యెనిమిదవదగు కలియుగమున నాలుగువేల నూట యేబది నాలుగు సంవత్సరములు (4,154) గడచిపోయినవి. శ్రీ విద్యాశంకరుడుదయించి పదునైదువందల యరువది యొక్క సంవత్సరములు (1561) గతించినవి. భారత ధర్మ నిష్ఠాగరిష్ఠులగు చాళుక్య ప్రభువులలో ధర్మమూర్తియగు శ్రీ రాజరాజనరేంద్రుని రాజ్యమున నీనాడు శ్రీ విద్యాశంకర జయంత్యుత్సవము దేవేంద్ర వైభవముతో జరుగుచున్నది.

రాజమహేంద్రవరమునకు సమీపమున ధవళగిరి యొద్ద నొక మునిపల్లె కలదు. అచ్చట శృంగగిరి పీఠాధిపతులెన్నడో యొక యీశ్వరాయతనము ప్రతిష్ఠించి ధవళేశ్వరుడని నామకరణము చేసిరి. ధవళగిరి పార్శ్వమున శృంగగిరి పీఠాధిపతుల యొద్ద సన్యాసాశ్రమము స్వీకరించిన భారతీస్వామి యొకరందు తపస్సు చేసికొనుచు నివాస మేర్పరచుకొనిరి. వేంగీ ప్రభువులా భారతీస్వామిని జగద్గురు ప్రతినిధిగా పూజించుచుండిరి. కాని దర్శనాదికముల కచ్చట నిత్యము భక్తులు వచ్చుట ఆ స్వామివారి కిష్టము లేదు. కాని శ్రీ విద్యాశంకర జయంతినాడు మాత్ర మట్లు కాదు.

రాజమహేంద్ర పురమందుగల యశేష బ్రాహ్మణ బృందమును ప్రాతఃకాలమున జేయవలసిన నిత్యకర్మలన్నియు శీఘ్రముగా ముగించుకొని సమిత్పాణులై ధవళేశ్వరునందలి భారతీస్వామి యాశ్రమము చేరిరి. అచ్చట నప్పటికే సర్వ సంపన్నముగా నలంకరించిన భద్రగజ మొండు నిలిచియుండెను. ఆ భద్రగజమునకు శంకరగజ మని నామము. అదియు రాజరాజనరేంద్రుని భద్రగజమును ఒకే తీరున నుండును. ఆ రెండును రాజరాజు గజశాలలో సర్వ గౌరవములతో పూజ నొందుచుండును.

శంకరగజము దంతములకు రత్నములతో పొదిగిన బంగారు తొడుగు వేసియుండెను. ముఖమున శంకరవిగ్రహాకారమున ముత్యములతో గ్రుచ్చిన చిత్రపట్టిక మెరయుచుండెను. వీపుపై కాషాయవర్ణముగల పట్టువస్త్రము కప్పియుండెను. దానిపై శ్రీచక్రాకృతి గల యమూల్యమగు నంబారీ కలదు. శంకరగజము కదలినప్పుడెల్ల మేన నలంకరించిన వెండిఘంటల మంజునాదములు శ్రవణపర్వము చేయును.

అచ్చట చేరిన బ్రాహ్మణ బృందములో నన్నయభట్టారకుడును, చీదమార్యుడును, పంపన భట్టోపాధ్యాయులును, భీమనభట్టును, చెట్టన భట్టును, ముట్టనభట్టును, వజ్జియ ప్రెగ్గడయు, నృపకామదండనాథుడును, ఘూర్జర బ్రాహ్మణాగ్రణియు, నతనివెంట ప్రబోధచంద్రోదయగ్రంథ కర్తయగు కృష్ణమిశ్రుడును, బిల్హణభట్టను కాశ్మీరాగతకవియు మరియు నెందరేని గలరు. వారందరును యథాశాస్త్రీయముగా నా భారతీ యతికి సాష్టాంగవందన మాచరించిరి.

అంతట నా శంకరసంయమీంద్రుని యనుజ్ఞవడసి యొక సువర్ణఘటము భద్రగజముపైనుంచి యేకాదశ సంఖ్యాకులగు వేదవిప్రులు రజతఘటములు గ్రహించిరి. మంగళవాద్య పురస్సరముగా వారందరు గోదావరికి బయలుదేరిరి. వేదవిదులు శంకరగజమును పరివేష్టించి స్వస్తివాచకము చేయుచు సాగిరి. వేదవిప్రులు పవిత్రమగు గోదావారి మంత్రపురస్సరముగా గజముపైనున్న సువర్ణఘటమును తమ చేతులనున్న వెండికుండలను పూరించిరి. మరల మంగళవాద్య పురస్సరముగా ప్రదక్షిణమార్గమున వేదఘోషతో నూరేగుచు ధవళేశ్వరాలయమునకు జనుదెంచిరి.

శంకరభారతీస్వామి ఏకాదశవిప్రుల సహాయముతో మహాన్యాస పూర్వకముగా ఈశ్వరుని కభిషేకము ప్రారంభించెను. పదునొకండుమారులందరు అభిషేకము చేయునప్పటికి మహారుద్రాభిషేక మయ్యెను. చుట్టు చేరిన శతాధికసంఖ్యాక విప్రుల నమకఘోషతో అతిరుద్రపారాయణ మయ్యెను. నిరంతరము నక్కడికి గోదావరినుండి చేర్చి యందిచ్చుచున్న గోదావరీవారితో సహస్రాధిక ఘటాభిషేక మయ్యెను.

శంకరసంయమీంద్రుడు శతరుద్రీయము శాంతముగ స్పష్టముగ స్వచ్ఛమగు మధురకంఠముతో చెప్పుచుండెను. బ్రాహ్మణబృందమంతయు నేకగ్రీవముగా నా యతీంద్రుని కంఠముతో కలిపి చెప్పుచుండెను. ఆ యభిషేకము శోభ ద్రవ్య విశేషములలోగాని పరికర వైభవములోగాని జనసమ్మర్దములోగాని, లేదు. ద్రవ్యలోపము లేదు. గోక్షీరము, గోఘృతము, గోదధి, ఇక్షురసము, మధువు, ఆమ్రఫలరసము, నారికేళోదకము—ఇత్యాదిగా నభిషేకార్హమగు సమస్త వస్తువులు పుష్కలముగా నుపయోగించిరి. గోగణములు నిరంతరముగా గిరి ప్రదక్షిణము చేయుచుండెను. జనసంఘములు తండోపతండములుగా వచ్చి దర్శించి పోవుచుండిరి. వారు తెచ్చు మామిడిపండ్ల రాశి పర్వతాకారమగుచుండెను. వీణా మురజాదివాద్యములు కర్ణపర్వము చేయుచుండెను. నర్తకజనముల నృత్యము లయ హృదయములలో తాళములు వేయుచుండెను. అచ్చట కనపడు శోభ యా బ్రాహ్మణ మహాజనము నిశ్చలబుద్ధులతో నిష్కంపములగు శిరస్సులతో నేకకంఠముతో మధ్యమ స్వరముతో—అటు తొందరగాని యిటు జాగుగాని చేయక—చేయు మంత్రోచ్చారణలో నున్నది. కృష్ణమిశ్రుడు అది చూచి పొందిన యానందమున కవధి లేకుండెను. అభిషేకానంతరమున భారతీస్వామియే సహస్ర కమలములతో పూజచేసి యథాసంభవమగు ఫలాదులు నైవేద్య మర్పించెను. పూజావసానమున వేద వేదాంగములు తత్తద్విదులు ధవళేశ్వరునికి వినిపించిరి. శంకరస్వామి తైత్తిరీయోపనిషత్తును, గీతాశ్లోకములు కొన్నియు మొదటి నాలుగు బ్రహ్మసూత్రములను శంకరకృత శారీరక మీమాంసలో అధ్యాసభాష్యమును ప్రవచనము చేసెను.

మూడు జాములైనపిమ్మట శంకరగజముపై శంకరసంయమీంద్రుడు పట్టణవీదుల నెల్లెడ మహా వైభవముతో నూరేగెను. కోటగుమ్మము నొద్దకు వచ్చినంతనే రాజరాజనరేంద్రుడు ఇరువురు రాణులు అమ్మంగమహాదేవిని రేవలదేవిని గూడి వినీతుడై వచ్చెను. వారు శంకరసంయమీంద్రుల పాదము లంటి వందన మాచరించి రేణువులు శిరముల భక్తితో ధరించిరి. ఆ ఉత్సవము ఆగు స్థలములు బహుస్వల్పసంఖ్యాకములు.

సంధ్యాకాల మగునప్పటికి పురసంచారము సమాప్తమయ్యెను. అప్పటికే సువాసినులసంఖ్యాకముగా నచ్చట చేరి ధవళగిరి యంతట మేరు ప్రస్తమగు శ్రీచక్రాకార మేర్పడునట్లు దీపాధారములు సిద్ధము చేసిరి. సంధ్యాసమయమయిన వెంటనే ఆ సువాసినులు ఆ దీపములు వెలిగించిరి. 'సుమేరుమధ్య శృంగస్థయై శ్రీమన్నగర నాయిక' యశేషపరివారముతో నా ధవళగిరి నప్పుడధిష్ఠించినట్లుగా ఆదీపావళి మధ్య సంచరించు సువాసినీజనముతో నా గిరి శోభిల్లెను.

సాయంకాలమున శంకర సంయమీంద్రులు శ్రీదేవ్యాలయమున శ్రీచక్రార్చన ప్రారంభించిరి. తదంగముగా నచ్చట సమావిష్టులైన సువాసినీ జనమును బారులు బారులుగా కూర్చుండజేసి పరదేవతాబుద్ధితో భక్తివినమ్రుడై యా శంకర స్వామియే స్వయముగా పూజచేసెను. ఆ సువాసినీ పూజా మహోత్సవమును ఆనాటి యుదయకాలమునందలి మహారుద్రాభిషేక మహోత్సవమును శోభలో మించి కనుపించెను. అచ్చట నట్లు పూజ నొందిన సువాసినులలో వజ్జియ సోమిదేవి పవిత్రమూర్తి యగ్రస్థాన మలంకరించెను. భరత భూమిలో కన్యాకుమారి మొదలు బదరీనారాయణమందలి నారాయణీమూర్తివరకుగల సమస్తదేవతా మూర్తులు నాయెడ ప్రత్యక్షమై కనిపించెను.

సువాసినుల కందరి కమృతపాత్ర లిచ్చిరి. శిష్టామృతమును శంకరసంయమీంద్రులు గ్రహించిరి. అమృతపాత్రలు యథాధికారముగా పంచి పెట్టుచుండిరి.

అంతలో రాజరాజనరేంద్రునికిని దేవేరులకును అమృతపాత్రలు పంపుటకు రాజపురోహితుని శంకరసంయమీంద్రులు పిలిచెను. ఆ పిలుపు వినబడినంతనే యకస్మాత్ నకస్మాత్తుగా రాజరాజనరేంద్రుడే పట్టమహిషి యమ్మంగదేవితో ప్రత్యక్షమయ్యెను. వా రుభయులు శంకర సంయమీంద్రుల స్వహస్తదత్తములగు నమృతపాత్రలు యథావిధి స్వీకరించిరి.

రాజరాజనరేంద్రునకు సుధాపాత్ర యిచ్చుచు శంకర సంయమీంద్రులు—

"వత్స, తుభ్యం మయాదత్తం
శిష్టజుష్టం సుధారసమ్,
తవ శత్రూన్ హరిష్యామి
సర్వాభీష్టాన్ దదామి తే"

అని పల్కిరి. రాజరాజును —

"ఆదాయ చ గురోస్సాక్షాత్
ఆదిశక్తే ర్ముఖాంబుజాత్
దత్తం శిష్టామృతం పుణ్యం
సంవిదగ్నౌ జుహోమ్యహమ్"

అనుచు స్వీకరించెను.

మహారాజు పూజా సమయమున వచ్చుట యరుదు. అట్లు వచ్చునప్పుడు కూడ ముందుగా తెలియజేసి వచ్చునాచారము. అట్టి యెడ మహారాజు కూర్చుండుటకు నియమిత మగు ప్రత్యేక స్థాన ముండెను. ముందు తెలుపకుండ వచ్చినను భేదమేమియు లేకపోయెను. మహారాజును మహారాణియు నెప్పుడు వచ్చిరో కూడ ఎవ్వరికి తెలియదు. పూజోత్సవసమయములలో మహారాణులకు భారత సంప్రదాయములో తెరచాటు లేదు.

పూజాంతమున శ్రీదేవికి బ్రాహ్మణులు వేద వేదాంగ శ్రవణము చేసిరి. శంకరస్వామి వేదాంతశ్రవణము చేసెను. అంతట చీదమార్యులు ఆచార్యుల కొక మనవిచేసెను:

"పూజాంగముగ నాటకపఠనము చేయు నాచారము లేదు. భారత రామాయణ పఠన మున్నది. కేవల ముపనిషదర్థమే దృశ్యకావ్యముగ ప్రబోధచంద్రోదయమును నాటకమును నిచ్చట సమాగతులైయున్న కృష్ణమిశ్రకవీంద్రులు చిత్రించుచున్నారు. అందులో నొక ఘట్టము దేవీసమక్షమున వినిపింప ననుజ్ఞ వేడుచున్నాను."

శంకరస్వామి చిరునవ్వు నవ్వెను.

"పూర్వమీమాంసకుడవు నీవే కావ్యశ్రవణ మర్థించినచో మా కట్టి యభ్యంతరము నుండదు. పరమానందము!"

కృష్ణమిశ్రుడు ఆచార్యులకును పరదేవికిని వందన మాచరించి ప్రబోధచంద్రోదయమున నారవకయంకమందలి ప్రస్తావభాగము వినిపించి, "తతః ప్రవిశతి ఉపనిషత్ శాంతిశ్చ", అని చదివి ముగించెను. సభాసదు లెంతయు నానందించిరి.

ఆ పిమ్మట శంకరసంయమీంద్రులు తమ గురువులు శృంగేరీపీఠాధిపతులు ఈ శ్రీముఖమీ సమయమున శ్రీ దేవీసన్నిధానమున నిచ్చటి చాతుర్వర్ణ్యజనములకును వినిపింప నాజ్ఞాపించిరని చెప్పుచు నా పత్రమును సభాపతి కీయ నాతడు కన్నుల కద్దుకొని యిట్లు చదివి వినిపించెను:

"శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య పదవాక్యప్రమాణ పారావారపారీణ యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధ్యష్టాంగ యోగానుష్ఠాన నిష్ఠాగరిష్ఠ తపశ్చక్రవర్త్యనాద్యవిచ్ఛిన్న గురుపరంపరా ప్రాప్తసాంప్రదాయక షడ్దర్శనస్థాపనాచార్య వ్యాఖ్యానసింహాసనాధీశ్వర సకలవేదార్థప్రకాశ సాంఖ్యత్రయీ ప్రతిపాలక సకలనిగమాగమ సారహృదయ వైదికమార్గప్రవర్తక సర్వతంత్ర స్వతంత్ర శ్రీ మద్రాజాధిరాజ మహారాజగురు భూమండలాచార్య ఋశ్యశృంగగిరి పురవరాధీశ్వర శ్రీమద్విద్యాశంకర పాదపద్మారాధక శ్రీ మత్సచ్చిదానంద భారతీస్వామి కరకమల సంజాత శ్రీ బోధానంద భారతీస్వామిభిః ప్రవర్తితా శ్రీముఖ పత్రికా.

"ఇప్పటికి ఇరువది సంవత్సరముల క్రిందట శ్రీ కృష్ణశర్మయను కర్ణాటదేశబ్రాహ్మణుడు తురీయాశ్రమము తీసికొని మాయొద్దకు ఉపదేశార్థము వచ్చి యర్థింపగా కరుణించి యుపదేశించితిమిగాని యనుష్ఠానికము తెలిసికొనకుండగానే యతడు సెలవు తీసికొని వెడలిపోయెను. పిమ్మట విచారింపగా నతడు బౌద్ధభిక్షువులతో సహవాసము చేయుచు హేయమగు నాచారము లవలంబించుచున్నాడని తెలియవచ్చి విచారించగా అది నిశ్చయమైనది. అంతట నాతని మేము చాతుర్వర్ణ్య శిష్యబృందమునుండి బహిష్కరించుచు నాతని హృదయమధ్యమున తప్తమగు మా ముద్రవేయించి శ్రీముఖపత్రికలు కల్యాణ కటకాది ప్రదేశముల ప్రచురించితిమి. కాని యాతడు చాలకాలము అదృశ్యుడైపోయెను.

"ఇప్పుడు విచారింపగా నాతడు రాజమహేంద్రపుర ప్రాంతముల కొంతకాలమునుండ మారువేషమున సంచరించుచు గౌరవము పొందుచున్నాడని తెలియవచ్చినది. అతని వక్షోభాగమున నంకితమగు మా ముద్రచే గుర్తించి యాతనిసర్వవిధముల బహిష్కృతునిగా భావింప వలసినదని రాజమహేంద్రపుర చాతుర్వర్ణ్య శిష్యబృందమునకు తెల్లము చేయుచున్నాము.

ఇతి నారాయణస్మృతిః.



జగద్గురు
శ్రీ బోధానంద
భారతీస్వాములు."

ఆ శ్రీముఖపత్రిక చదివించి పూజ పూర్తి కావించిరి. మహావైభవముగా నారాత్రి సంతర్పణము జరిగెను.

శ్రీకృష్ణశర్మ ఎవరు?—ఏ మారు వేషముతో నిక్కడ పూజ్యత నొందుచున్నాడు?— మారు వేషముతో రాజమహేంద్రవరములో తిరిగిన బ్రాహ్మణుడు తనపేరు నారాయణభట్టు అని చెప్పెనే! అతడేంతియో వైదికనిష్ఠ కలవాని వలె ప్రవర్తించుచున్నాడే. అతడు బహిష్కృతు డగునా?—అది మరుగుపరచుటకే అంత విశేషాభిమానము నటించుచున్నాడేమో! —ఈ విధముగా నాతని గుర్తించుటకు పలువురు వ్యగ్రులైరి.

అచ్చటికి వచ్చునప్పుడు రాజరాజనరేంద్రుడును అమ్మంగమహాదేవియు నజ్ఞాతముగా వచ్చిరి. మరల రాజమందిరమున కేగునప్పుడు రాజరాజు ఉత్తమాశ్వముపై నధిరోహించెను. అమ్మంగమహాదేవి యందల మెక్కెను. పంచ తూర్యములు మొరసెను. రాజమయ్య, జననాథుడు ముప్పరాజును ముగ్గురు దండనాథులు అనేకరాజభటులతో పరివేష్టించి వారి ననుసరించి కోటలోనికి చేర్చిరి. అప్పుడు వెలిగించిన కరదీపకల కాంతి రాజమార్గమున పగలే యను భ్రాంతి కలిగించెను.

౪౦

దండయాత్ర

యువరాజ రాజేంద్రదేవుడు చోళమిత్రుగూడి నారాయణభట్టును మంత్రిగా నుంచుకొని శీఘ్రప్రయాణములతో చంద్రాదిత్యుని యాధిపత్యమున చక్రకూట్యాభిముఖముగా నేగుచున్న సేనను కలసికొనెను. ఆ ప్రదేశమునను నియమిత విధమున మరికొన్ని సేనలును గలసెను. ఆ సర్వవాహినికి రాజేంద్రదేవుడాధిపత్యమూని ముందు ఆకస్మికముగా భ్రమరకోట్యముపైబడి ముట్టడించెను.

భ్రమరకోట్యము ఇంద్రావతీనది గోదావరిలో కలయుచోట నున్న స్థలజలదుర్గము. ఆ దుర్గము మిక్కిలి బలిష్ఠమైనది. అది పట్టుకొనుటకు బల

(22-వ పేజీ చూడుడు)

భారతీయ వర్ణలేప పరిశ్రమ

శ్రీ బ్రహ్మాండం అంజనేయులు

మన భారతదేశము ఉష్ణదేశము. దేశమున అతి ఉష్ణత, అతిశీతలత, ఆయా కాలములందు చేలరేగుచుండును. ఇంతియకాక దేశమున వాతావరణ పరిస్థితులలో చాలా మార్పులు గలుగుచుండును. సూర్యరశ్మి, వేడి, గాలిలోని తేమ, మొదలగునవి కట్టడములను శిథిలమొనర్చును మనము తరుచుగా చూచుచుండెడు తుప్పుపట్టి పన్నగిలిన యినుపకిటికీ చువ్వలు, పగిలి బీటలుబారిన కిటికీ కమ్ములు, బుగిలి గాళ్ళుపడిన ద్వారబంధములు, తుప్పుతో తూట్లు గుంటలు, పడిన వంతెనలమీది యినుపమూలములు యీ వాతావరణము యొక్క శిథిలకార్యమును నిరూపించుచున్నవి. కాలసీమముగా లేపనము (పెయింటింగు) చేయుట వలన కట్టడములను శిథిలతనుండి సంరక్షించవచ్చునని మన పూర్వీకులు గుర్తించిరి.

పూర్వకాలపు వర్ణలేప పరిశ్రమ

మన పురాతన భారతములో వర్ణలేప పరిశ్రమ (పెయింటు)గూడ ఒక కులవృత్తిగా నడచుచుండెడిది. ఈవృత్తి నవలంబించి జీవించెడివారలను "ముచ్చి"లని పిలుచుచుండెడివారు. వర్ణలేపముల తయారీ, ఈ వర్ణములతో లేపనము చేసి గృహములను కట్టడములను శృంగారించుట, అను ఈ రెండు పరిశ్రమలను ఒకే ఒక కుటుంబ జీవనోపాధివృత్తిగా మన పూర్వీకులు అభివృద్ధి చేసియుండిరి. తరతరాలనుండి ఈ వృత్తిమీదనే జీవించుచూ వచ్చుచున్న ప్రతి కుటుంబము యొక్క తీవ్రప్రయత్నమువలన ఈవర్ణలేప పరిశ్రమయొక్క పనితనము, కళ, మన దేశమున అభివృద్ధి గాంచినది. ఉత్పత్తి వారు కేంద్రీకరించి ఉండలేదు. భారీయెత్తున ఉత్పత్తి, వ్యాపారము వారికి లక్ష్యము అయివుండలేదు. దీనికిబదులుగా సరకుయొక్క నాణ్యమును అభివృద్ధి చేయుటయే వారు పరమావధిగా చేసుకొనిరి. ఈ కుటుంబములలో తరతరాలుగా జరుగుచున్న కృషి ఫలితముగా ఈవర్ణలేప పరిశ్రమ ఇతరులకు కన్నెర్ర కావగినంత ముఖ్యస్థానమును దేశమున ఆక్రమించెను. దేశములోని అజంతాచిత్రలేపనములు, తదితర ముఖ్యమైన కళానిధులు, ఈ పరిశ్రమ యొక్క బహుముఖాభివృద్ధికి తార్కాణములు.

ముడిసరకుల ఇరువులు

మన భారతదేశములో ఈ వర్ణలేపములకు కావలసిన ముడిపదార్థము లన్నియు పుష్కలముగా దొరుకుచున్నవి. అవిసె విత్తులు ఉత్తర దేశములోని ముఖ్యమగు పైర్లలో నొకటి. ఈ అవిశెనూనె లేపములలో ముఖ్యమగు వర్ణవాహక తైలము (పెయింటు ఆయిల్) గా వాడబడుచున్నది. పొగవిత్తులనూనె గూడ యిప్పుడిప్పుడు వర్ణవాహక తైలముగా వర్ణలేప పరిశ్రమలో ప్రాముఖ్యత వహించుచున్నది ఈ పొగవిత్తులు చెన్న రాజధానిలో విరివిగా లభించుచున్నవి. శాంతిదేశములో ఆముదము చాల విరివిగా లభించును. ఈ ఆముదమును రసాయనికముగా మార్పు చేసినచో (డిహైడ్రేషన్) చైనాదేశము నుండి లభించుచున్న "టంగు" నూనెతో తులతూగు లేపవర్ణ వాహక తైలముగా వాడవచ్చును. ఈ మాదిరి వర్ణలేపతైలములుగా వాడతగిన ఇతర నూనెలు యింకను మనదేశమున దొరకును

ఇంతేగాక వర్ణచూర్ణముల నమర్చుగల ఖనిజ ధాతువుల నిల్వలు గూడ దేశములో చాల కలవు. సీసము, (నాగము) తుత్తునాగము, (పాదరసము) అంటిమొని, టైటేనియము, క్రోమియము, ఇనుము, (లోహము) మొదలగు లేపవర్ణచూర్ణ ధాతువులు మన దేశపు వివిధ ప్రాంతములలో దొరకుచున్నవి. రాయలసీమ జిల్లాలలో గెరీనా (నాగగంధకిదము), క్రోమైటు, ఖనిజములు; నెల్లూరు జిల్లాలో మైకా (అభ్రకము) ముగ్గురాళ్ళు, (బెరైటీస్); విశాఖజిల్లాలో మాంగనీసు ఖనిజము; తూర్పు, పశ్చిమ, గోదావరి జిల్లాలలో గ్రాఫైటు; తిరువాన్కూర్ సంస్థానంలో ఇమినైటు అను నల్లని నిగనిగలాడు ఇసుక (టైటేనియం); యెర్రని కావిరాతిజేగురు; పచ్చమట్టి, తెల్లసుద్ద, నల్లసిలోహభస్మములు, టాల్కు (రాచిప్పపొడి), సీమసున్నము, ముగ్గురాళ్ళు మొదలగు లేపవర్ణచూర్ణములు రాయలసీమ జిల్లాలలోను, సాంగూరు సంస్థానములోను విరివిగా గనులలో దొరుకుచున్నవి.

కర్పూరతైలము, ఆరిపూస (రోజిన్ గుగ్గిలము) హిమాలయప్రాంతపు "పైను" అడవుల నుండి తీయబడుచున్నవి. అవసరములకు వలయు పెట్రోలు, గనికర్పూరతైలము, బొగ్గు, దేశమున గలవు. పలురకములైన లక్కలు, జిగుర్లు అరణ్యములలో పుష్కలముగా లభించుచున్నవి ఈ విధముగా పలురకపు స్వాభావిక సంపదలతో తులదూగుచు భారతీయవర్ణలేప పరిశ్రమ, గృహపరిశ్రమగా ముందుకు సాగిపోవుచుండెడిది.

గృహపరిశ్రమలకు దెబ్బ

ఈ స్థితిలో పాశ్చాత్యులు భారతదేశమునకు వ్యాపారమునకై వచ్చుట; తమ పరిశ్రమలను పెద్దఎత్తున భారీపరిశ్రమలుగా కేంద్రీకరించుట; యంత్రసాహాయ్యమువలన అధికోత్పత్తి విధానమును సాగించుట జరిగెను. తలవనితలంపుగా పాశ్చాత్యుల వ్యాపారపెత్తనము ప్రారంభమయ్యెను. ఈ విధముగా పాశ్చాత్యుల భారీపరిశ్రమల వ్యాపారయుగము వెలుగుట ప్రారంభించెను. గృహపరిశ్రమల యుగము దేశములో క్రుంగెను. ఈ పారిశ్రామిక పాశ్చాత్యధనిక కేంద్రీకరణతాకిడికి తట్టుకొనగల సమర్థగాని, కలిసికట్టగాని, మన గృహపారిశ్రామికులలో లేకపోయెను. ఎక్కడి పరిశ్రమ అక్కడే క్రుంగి, కృశించి, నశించెను ఈ పేదగృహపారిశ్రామికుని ఎడల అప్పటి ప్రభుత్వమూ, ప్రజలూ నిరాదరణ చూపిరి. ఇందుమూలమున ఈతడు పొట్ట చేత బట్టుకొని తనపల్లెనుండి పట్టణములకు చేరవలసి వచ్చెను. ఈ పురాతనభారతవర్ణలేప గృహ పరిశ్రమను కొన ఊపిరితో, గుటగుటలాడు స్థితిలో కొలది కుగ్రామములలో మన మిప్పటికిని చూచుచున్నాము.

పాశ్చాత్యవర్ణలేప పరిశ్రమ

వర్ణలేపపరిశ్రమ పాశ్చాత్య దేశములో కేంద్రీకరణవిధానమును అనుసరించి అభివృద్ధి చెందుచూ వచ్చినది. వర్ణలేపనము, (పెయింటింగు), వర్ణలేపముల తయారీ, ఈ రెండును విడివిడి పరిశ్రమలుగా పాశ్చాత్యదేశములలో అభివృద్ధి చెందినది. యంత్రసాహాయ్యమువలన వస్తు అధికోత్పత్తి ప్రోత్సహింపబడెను. ఒక్కొక్క తయారీవిధానమున ప్రత్యేకపాండిత్యము (స్పెషలైజేషన్)కూడ ప్రోత్సహించి అమలులోనికి తీసుకురాబడెను. ఈ విధముగా కొలదికాలము ననే మేధావుల పనితనముచేతను, రసాయన పరిశోధకుని పరిజ్ఞానముచేతను పాశ్చాత్యదేశపు వర్ణలేపపరిశ్రమ పలుతెరగుల అభివృద్ధి చెందెను, భారత వర్షపు వర్ణలేప గృహ పరిశ్రమ ప్రాశ్చాత్య భారీ పరిశ్రమల తాకిడికి తట్టుకొనలేక వంటరితనములో మురిగిచచ్చెను.

పరాయిదేశముల దోపిడి

బ్రిటిషు వారి హయాములో పాత గృహ పరిశ్రమల వికేంద్రీకరణ విధానము దేశమున అదృశ్యమయ్యెను. దేశ ప్రజలలో పారిశ్రామిక జ్ఞానము నశించెను. నూతన కల్పనాశక్తి ప్రజలలో అంతమయ్యెను. దీనికి బదులు అనుకరణ ప్రబలెను. తమ దేశకట్టడ సంరక్షణకు ముఖ్యావసరమైన ఈ వర్ణలేపముల కొరకు భారతీయులు అశక్తులై పరాయి దేశ ఉత్పత్తిదారుల మీద ఆధారపడవలసిన దుర్గతి పట్టెను. ఈ పరాయి దేశ ఉత్పత్తిదారులకు మన దేశ వాతావరణ పరిస్థితులు, వాటి అవసర పరిజ్ఞానము శూన్యము. పరాయి దేశముల వారు మన అవసరములను భిన్న దృక్పథమున చూచుట తటస్థించెను. నిర్దాక్షిణ్యమైన "దోపిడీ" విధానమును వారు అవలంబించిరి. సేవాదృష్టి వీరిలో మటుమాయమయ్యెను. పూర్వకాలపు భారత దేశములోని ఉత్పత్తి వాడుకదార్లమధ్య తరతరాలుగా వచ్చుచున్న అన్యోన్యత ఈ పాశ్చాత్య పారిశ్రామికుల హయాములో అంతరించెను. వాడుక దార్లకు భారజనకమగు దళారీవ్యాపారము దేశములో పెచ్చుపెరిగెను. ఈ దళారీలను పాశ్చాత్యకేంద్రీకృత పారిశ్రామికులు తమ అవసరార్థము సృష్టించుకొనిరి. ఈ పాశ్చాత్య పరిశ్రమల వ్యాపారమును వృద్ధిచేయుటకు సృష్టింపబడిన ఈ దళారీ వ్యాపారస్తులు భారతదేశపు వర్తకబజారులలో పాతుకుపోయి ప్రాముఖ్యతను పరాయి దేశపు పలుకుబడితో సంపాదించగలిగిరి. ఈ దళారీల హయాములో వస్తునాణ్యము అడుగంటెను. చవుకగా వస్తువులను తయారుచేయించుట ప్రాముఖ్యత వహించెను. పనికిమాలిన వస్తువులను వీరు ప్రజలకు "చవుక"అను పేరుతో అంటగట్ట మొదలిడిరి. ఈ విధముగా కేంద్రీకృత పారిశ్రామికులు, వర్తక దళారీలు, కలసి ప్రజలమూర్ఖతను ఊతగాగొని వారి ధనమును కొల్లగొట్టజొచ్చిరి.

విషమించిన పరిస్థితులు

భారతదేశపు వర్తక సుంకములను తప్పించుకొను ఉద్దేశముతో పాశ్చాత్యదేశపు పారిశ్రామికులు మనదేశములోనే వారివారి భారీ యంత్రాలయములను వస్తుఅధికోత్పత్తి నిమిత్తము నిర్మించ మొదలిడిరి. వీరు ఉత్పత్తి చేయు సరుకులుగూడ "స్వదేశీ" అను నామకరణముక్రింద దేశమున చలామణి అగుచుండెను. మన దేశములోని ధనికులు కూడ కొందరుచేరి పాశ్చాత్యదేశపరిశ్రమల కేంద్రీకరణ విధానమును అనుసరించి కొన్ని వర్ణలేప తయారీ యంత్రాగారములను, కలకత్తా, బొంబాయి, మొదలగు ముఖ్యపట్టణములలో నిర్మించిరి. ఈ యంత్రాలయము లన్నియు భారతీయ పెట్టుబడితోగాని లేక పాశ్చాత్య పెట్టుబడితోగాని నిర్మింపబడినవి. భారీయెత్తున వస్తువులను అధికోత్పత్తిచేయుచూవచ్చినవి. కట్టడముల సంరక్షణగురించి ప్రజలలో నిలచియున్న అజ్ఞానమును తొలగించుటకు ఈ భారీయంత్రాగారపు వుత్పత్తిదారులు ఏ విధమగు ప్రయత్నమును చేసియుండలేదు. వస్తువు చవుకధరచూచి మోసపోవు ప్రజల మూర్ఖతను వీరు చక్కగా స్వలాభము కొరకు ఉపయోగించుచూ వచ్చిరి. కట్టడములు, సంరక్షణయందు ప్రజలకు ఏర్పడిన ఉదాసీనభావమును ఈ కేంద్రీకరణ పారిశ్రామికులు, వారు సృష్టించిన దళారులు, తమ స్వలాభాభివృద్ధికొరకు ఉపయోగించుకొనిరి. మూర్ఖప్రజలను అవమానించి వారి ద్రవ్యమును కొల్లగొట్టిరి. ఈ 'దోపిడీ'విధానములో భారతదేశ పెట్టుబడిదారుకూడ పరాయి దేశపు పెట్టుబడిదారునితో చేయికలిపి స్వలాభాపేక్షతో వారి ఆటకు ప్రక్కతాళము వేయుచూ వచ్చెను. ఉత్పత్తి వృద్ధిచేసే వ్యాపారములో అమ్మకములను పెంచుటకు మార్గముల అన్వేషింప మొదలిడిరి పనికిమాలిన చవుకవస్తు తయారీమార్గమును అనుసరించిరి. బజారులో మనకు లభించుచున్న లేపయంత్రాగారముల "బాయిల్డు"అవిశెనూనెలు, ఇందుకు తార్కాణము. బజారులోని "బాయిల్డు ఆయిల్"అనుపేర చలామణి అగుచున్న నూనె యే మాత్రము మరగకాచిన నూనె కాదనియు పచ్చి అవిశెనూనెకు ఆరుడుదార్లను చేర్చి కొద్ది వేడిలో ఈనూనె కాచి తయారుచేయబడినదనియు స్పష్టీకరించబడియున్నది ఈనూనె బజారులో చాల చవుకగానే లభించును. కాని పచ్చి అవిశెనూనెకు గల దుర్గుణములన్నియు ఈ "బాయిల్డు"నూనెల వర్ణలేప పటములలో మనము చూచుచున్నాము. అనగా ఈ లేపపటములు కొలదికాలమునకే పచ్చగా మారుట నిగనిగరహితమై యుండుట, కుంచెగుర్తులను కలిగియుండుట, వాతావరణకు, నీటికి తాళగలిగిన శక్తి లేకుండుట మొదలగు దుర్గుణములు కలిగియున్నవి.

జాతీయసంపద—దుబార!

ఈ వర్ణలేప యంత్రాలయములు సరఫరా చేయుచున్న "బాయిల్డు" నూనెలతో తయారైన లేపపటలముల రంగు కొలది కాలమునకే పసుపుపచ్చగా మారును. ఈ లేప పటలములకు కుంచెగుర్తులను సర్దుకొనగల శక్తి శూన్యము. అనగా ఈ లేప పటలముల మీద కుంచె గుర్తులు ఆరిన మీదట కూడ కానుపించును. ఈ పటలములకు సాగుడు శక్తి (స్థితిస్థాపక) శక్తి చాల తరుగుగా ఉండుటచేత మన్నిక సరిగా లేని లోపము ఈ పటలములలో హెచ్చుగా కలదు. ఇంతేగాక ఈ పటలములు నీటికి, వాతావరణ పరిస్థితులకు సరిగా తాళుకొనలేక పోవుచున్నవి. పటలములు నిగనిగ రహితమై కూడ కానుపించును.

పచ్చి అవిశెనూనెను హెచ్చు ఉష్ణతలో అనగా 300 డిగ్రీల ఉష్ణతలో మరగకాచి చిక్కపరచినచో కట్టడములను చక్కగా సంరక్షించవలసిన లేప పటలములకు తగిన లక్షణములన్నియు ఈ చిక్కని నూనె (స్టాండాయిల్) పొందగలుగుచున్నది. కావలసిన చిక్కదనమును బట్టి నాలుగు, ఆరు, లేక యెనిమిది, గంటల వరకు పచ్చి అవిశెనూనెను రాగి కాగులో 300 డిగ్రీల ఉష్ణతలో మరగకాచినచో పలచగా నుండు పచ్చి అవిశెనూనెను వివిధ చిక్క తనములలో బడయవచ్చును. ఈ పద్ధతిలో శ్రమ హెచ్చగుట చేత ఈ చిక్కని నూనె ఖరీదు కూడ కొంచెము హెచ్చుగాక తప్పదు. అయినప్పటికి ఈచిక్కని అవిశెనూనెలతో తయారైన లేప పటలములు "బాయిల్డు ఆయిల్" లేప పటలముల జీవితకాలం కంటె మూడు రెట్లు హెచ్చు జీవిత కాలమును పొందియున్నవి. కనుక చిక్కన చేయబడిన అవిశెనూనెలనే వర్ణలేప తయారీలలో వాడినచో ఆర్థికముగా లాభించును. వర్ణలేపముల లోని "బాయిల్డు ఆయిల్" వాడకము జాతి సంపద దుబారా క్రింద పరిణమించును.

భారీయంత్రాలయములు— గృహపరిశ్రమలు

ఆయా పనుల ప్రత్యేక పరిస్థితులను, అవసరములను, ఈ కేంద్రీకరణ విధానపు ఉత్పత్తిదారులు సులభముగా తెలిసికొన జాలరు. వారు మామూలుగా మార్కెట్లద్వారా యివ్వగలిగినది మామూలు ఉపయోగములకు పనికివచ్చు వర్ణలేపములు మాత్రమే! గృహపరిశ్రమ దారుడు ఆయా ప్రాంతములలో తన చిన్న ఉత్పత్తి కేంద్రమును నిర్మించుకొని ఆ ప్రాంతములోనే నివసించి జీవించగలిగి యుండుటచేత తాను స్వయముగా ఆయా ప్రాంతీయ పరిస్థితులు అర్థము చేసుకొనగలిగి ఆయా ప్రత్యేక అవసరములకు తగినట్లుగా తన ఉత్పత్తులను తయారీచేయించగల పరిజ్ఞానమును పొందగలుగుచున్నాడు. ఈతడు ప్రాంతీయుడగుటచేత తాను తయారుచేయు వర్ణలేపముల వాడుకమీద సత్ఫలితమునకు తాను బాధ్యత వహించవలసి వచ్చును. అందుచేతనే యాతడు చవుకరకపు వర్ణలేపముల తయారీ గురించి ఆలోచించుటకే వీలుండదు. కేంద్రీకరణ విధానపు ఉత్పత్తిదారుని భుజములపై పెద్దపెద్ద జీతగాళ్ళను పోషింపవలసిన బాధ్యత పడుటచే అతడు అధికోత్పత్తికొరకు తహతహలాడుచుండును. గృహపరిశ్రమదారుడు అర్ధరుడు మామకొనియే ఉత్పత్తిదారుడు యంత్రపరిశ్రమదారునికి "కూలీల సమ్మె" ఒక బాధాకరమైన సమస్యగా పరిణమించుచున్నది. గృహపరిశ్రమల వికేంద్రీకరణ విధానము ఈ కూలి సమ్మెలను జయప్రదముగా తొలగించగలవు. గృహపరిశ్రమదారుడే పరిశ్రమలో మామూలు కూలీచేయు పనినుండీ మేధావులు చేయు పని వరకూ తాను స్వయముగా చేసుకొనుచుండును. కనుక కేంద్రీకృత యంత్రాలయపు పద్ధతిలో సంపద, ధనము, కొద్దిమంది ధనవంతుల గుప్పెట్లలోనికి మాత్రమే చేరుచుండును. వికేంద్రీకరణ గృహపరిశ్రమల పద్ధతిలో జాతియొక్క సంపద సమానముగా ప్రజాబాహుళ్యపు ఉపయోగార్థము అందరికద్దు నివసించును. ఈ గృహపరిశ్రమల విధానములో జాతికంతటికి వ్యక్తిగతమైనచో నవ, ప్రజ్ఞాప్రదర్శనమునకు వీల్లు లభించును. లోకశాంతి నిచ్చునవి ఈగృహపరిశ్రమలే!

భారత రాజకీయాలు :

ఇండియా - పాకిస్థానాల సంబంధాలలో

నరేంద్రమండలిని పునరుద్ధరిం

కాశ్మీర్‌పై దండెత్తి వస్తున్న దుండగులకు పాకిస్థాన్ ప్రభుత్వం చేస్తున్న సహాయమును ఆపివేయించి, కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పుటకు తోడ్పడ వలసిందని భారత ప్రభుత్వం భద్రతామండలిని కోరినది. ఈవిషయమై చర్చించుటకు భద్రతామండలి గత మంగళవారంనాడు సమావేశమైనది. కాని పాకిస్థాన్ ప్రతినిధి సర్ జఫ్రుల్లాఖాన్ సభకు హాజరు కాకపోయినందు వలనసభ వాయిదావేసి, తిరిగి 15 వ తేదీన సమావేశ మగునట్లు నిర్ణయింపబడినది.

గత్యంతరము లేని పరిస్థితులలో, ఆత్మరక్షణ కొరకై కాశ్మీర్ భారతయూనియన్‌లో జేరినది. ఆనాటికే కాశ్మీర్‌పై దుండగుల దండయాత్ర ప్రారంభమైనది. దురాక్రమణదారులు ముఖ్యపట్టణమగు శ్రీనగర్ సమీపమువరకు చొచ్చుకొనివచ్చినారు. ఆట్టిక్లిష్టసమయములో కాశ్మీర్ రక్షణభారము వహించి భారత ప్రభుత్వం విమానాలపై తన సైనికులను, ఆయుధసామగ్రిని పంపి, కాశ్మీర్‌ను రక్షించినది. దుండగులు దాదాపు 50 మైళ్ళు వెనకకు తరుమబడిరి. కాశ్మీర్‌లోయనుండి శత్రువులు నిశ్శేషముగా తరిమివేయబడినారు. ఇంకొక 20 మైళ్ళదూరం తరుమబడినచో కాశ్మీర్ సరిహద్దులలో దుండగులు వుండనే వుండరు. కాని ఇదంతయు కొండప్రాంత మగుటవలన ఇచ్చట యుద్ధము కష్టతర మగుచున్నది. భారతదేశమునుండి కాశ్మీర్‌కు రోడ్డుమార్గ మేమియు లేదు. అందువలన అదనపుసేనలను, సామగ్రిని పంపుట కష్ట మగుచున్నది. కాశ్మీర పాకిస్థాన్‌ల మధ్య రాకపోకలు సులభము. దుండగులు పాకిస్థాన్ భూభాగమునుండి కాశ్మీర్‌లో ఏ ప్రాంతములోనికైనా తేలికగా జొరబడ వచ్చును. అందువలన దుండగులు ఇంతకాలము కాశ్మీర్‌లో నిలబడగలిగినారు. దుండగులు ఏ సమయములోనైనా కాశ్మీర్‌లో ప్రవేశించి బీభత్సము చేయకుండా కాశ్మీర్‌ను రక్షించుటకు పెద్దసేన ఎల్లప్పుడూ అచ్చట వుంచవలసి వస్తుంది. పైగా దుండగులకు పాకిస్థాన్ సర్వసహాయములు చేస్తున్నది. దండెత్తివచ్చిన వారిలో సరిహద్దు జాతులు, పాకిస్థాన్ ప్రజలేగాక పాకిస్థాన్ సైనికులుకూడా చాలమంది వున్నారు. వీరిని పాకిస్థాన్ సైనికోద్యోగులే నడుపుతున్నారు. ఇప్పుడు కాశ్మీర్‌లో 50 వేలమంది దుండగులున్నారు. మరొక లక్షమంది పాకిస్థాన్‌లో శిక్షణ నొందుచున్నారు. దుండగులకు కావలసిన ఆయుధసామగ్రి, శకటములు పాకిస్థాన్ ప్రభుత్వమే సరఫరా చేస్తున్నది. అందువలన కాశ్మీర్ సంఘటన ఇండియా-పాకిస్థాన్‌లమధ్య అప్రకటితయుద్ధముగా పరిణమించి, భద్రతామండలికి ఫిర్యాదుచేయక తప్పలేదు.

ఒక్క కాశ్మీర్ సమస్యపైననే భారత ప్రభుత్వం ఫిర్యాదు చేసినప్పటికీ జునాఘడ్ మొదలగు అన్ని వివాదగ్రస్తవిషయములు విచారించవలె నని పాకిస్థాన్ కోరవచ్చు నని తెలుస్తున్నది. ఇది సమంజసమైనా, కాకపోయినా, ఇందువలన పాకిస్థాన్ పొందే లాభంగాని, భారతదేశంపొందే నష్టంగాని ఏమీలేదు. ఒక్క జునాఘడ్‌లోనే గాదు, కాశ్మీర్‌లో కూడా ప్రశాంతత నెలకొల్పిన తరువాత, అంతర్జాతీయ పరిశీలకసంఘయాజమాన్యాన ప్లెబిసైట్ జరిపించవలె నని భారతప్రభుత్వం ముందుగానే స్పష్టపరచి వున్నది. భద్రతామండలి ఇంతకన్న సమంజసమైన ఇతర పరిష్కారము ఏమి ఆలోచించగలదు!

భద్రతామండలి ఈ పర్యాయము సమావేశమైనప్పుడు, ఉభయపక్షముల వాదములను పరిశీలించిన తరువాత యుద్ధమును విరమించవలసిందని ఉభయపక్షములను ఆదేశించి, ప్రశాంతత నెలకొల్పి, రిఫరెండం జరిపించుటకు ఒక సామరస్య సంఘమును నియమించవచ్చును. ఆజాద్ కాశ్మీర్ ప్రభుత్వ మను పేరుతో తాము నడుపుచున్న ప్రభుత్వమును కూడ విచారింపవలసిందనీ, షేక్ అబ్దుల్లా ప్రజాప్రభుత్వమును రద్దు పరచి తరువాతనే రిఫరెండం జరిపించవలసిందని పాకిస్థాన్ కోరవచ్చును. కాని భారత ప్రభుత్వం ఈరెండుషరతులలో దేనికీ అంగీకరించ కూడదు. కాశ్మీర్ ప్రజానాయకుడు షేక్ అబ్దుల్లా భద్రతామండలికి స్వయంగా వెళ్ళుచున్నాడు. కాబట్టి ఈవిషయమై ఆయన ప్రత్యేక శ్రద్ధవహించు నని భావించవచ్చును. కాశ్మీర్‌ను విభజించవలెనని కొందరు సూచింపవచ్చునుగాని భారత ప్రభుత్వం ఇందుకు సమ్మతించదు. భద్రతామండలి కాశ్మీర్ సమస్యను సమంజసముగ పరిష్కరించి, త్వరలో దుండగులు పాకిస్థాన్ నుండి తొలగిపోవునట్లు ఏర్పాటు చేయగలుగు నని ఆశించుచున్నాము.

ఇండియా, పాకిస్థానాల సంబంధాలు...

భద్రతామండలికి నివేదించబడిన కాశ్మీర్ సమస్య విషయంలోనేగాక, ఇతరవిషయములలోగూడ ఇండియా పాకిస్థాన్‌ల సంబంధములు సంతృప్తికరముగలేవు. రెండు అధినివేశములు ఏర్పడగానే ప్రారంభమైన మతకలహములకు బాధ్యత భారత యూనియన్ పైనను, సిక్కులపైనను పెట్టవలెనని పాకిస్థాన్ నాయకులు ఇప్పటికి కూడ ప్రయత్నించుచునే వున్నారు. మతకలహములు ఆగస్టు 15 వ తేదీ తరువాత ఏప్రాంతములో ముందుగా ప్రారంభమైనదో చెప్పుట కష్టము. సంక్షోభము ముందే ప్రాంతములో ప్రారంభమైనను, తరువాత జరిగిన అకృత్యములు కన్నింటికి రెండు అధినివేశములు సమానముగా బాధ్యత వహించవలసినదే. తమదేశములో ఒక్క ముస్లిమేతరుడైనను లేకుండ తరిమి వేయుచున్న పాకిస్థాన్ అధికారులు, కొద్దిప్రాంతములో జరిగిన కల్లోలమునకు భారతనాయకులను ఆక్షేపించుచుండుట ఆశ్చర్యకరముగానున్నది. ఇంతేగాక, తూర్పు పంజాబ్ సంస్థానాధీశ్వరులపై ముస్లిం నాయకులు జూపుచున్న దురాగ్రహము కేవలము అనవసరము. తూర్పు, పశ్చిమ పంజాబ్‌లలో మతకలహ మహామారి విచ్చలవిడి విహరించుచుండగా, ఆరాష్ట్రములమధ్యలో నున్న సంస్థానములకు ఆ గాలి సోకుటలో ఆశ్చర్యమేమున్నది! పాకిస్థాన్‌లో చేరిన భావల్‌పూర్ సంస్థానము నుండి ముస్లిమేతరులందరు వెళ్ళగొట్టబడలేదా!

జునాగఢ్ రెండు అధినివేశముల వివాదములకు మరొక అవకాశ మేర్పరచినది. జునాగఢ్ సంస్థానమును, జునాగఢ్‌నవాబ్, దివానుల ఆహ్వానముపై భారతసేనలు ఆక్రమించినవి. సంస్థానము ఏ అధినివేశములో జేరవలెనో నిర్ణయించుటకు ఎట్టి నిష్పాక్షిక సంఘయాజమాన్యమునసైనసరే, ప్లెబిసైట్ జరుపుటకు భారతప్రభుత్వము సిద్ధముగనున్నది. జునాగఢ్ విషయమై భద్రతామండలికి పాకిస్థాన్ ఫిర్యాదుచేసినను పాకిస్థాన్ సాధించగలిగినది శూన్యమే. కారణముగాని కారణములు కల్పించుకొని వివాదములు పెంచుకొనుట పాకిస్థాన్‌కే నష్టము.

ఈమధ్యనే కుదుర్చుకొనబడిన ఆర్థికఒడంబడిక అమలుజరుపుటకు భారతప్రభుత్వం నిరాకరించుటతో రెండుదేశాల సంబంధాలు మరింత క్లిష్ట మౌతున్నవి. భారతదేశ ఆస్తి, అప్పులు పంచుకొనటం ఆగస్టు 15-వ తేదీకి ముందు పూర్తికాలేదు. అందువలన కొంత మొత్తము డబ్బు పాకిస్థానుకు వెంటనే యిచ్చి, మిగిలినసొమ్ము అంత్యపరిష్కారము జరిగినతరువాత యిచ్చునట్లు నిర్ణయింపబడినది. ఈ నిర్ణయంప్రకారం ఆగస్టు 15-వ తేదీముందు 20 కోట్ల రూ.లు. పాకిస్థాన్‌కు యివ్వబడినది. ఈమధ్య జరిగిన ఆర్థిక ఒడంబడిక ప్రకారం పాకిస్థాన్‌కు యివ్వవలసిన మొత్తం 75 కోట్లని నిర్ణయింపబడినది. ఇదివరకే ఇచ్చినసొమ్ము పోగా మిగిలిన 55 కోట్ల రూ.లు భారతప్రభుత్వం పాకిస్థాన్‌కు చెల్లించవలసియున్నది. కాని పాకిస్థాన్ ఆ సొమ్మునంతను కాశ్మీరుపై దండయాత్రకు వినియోగించునట్లు సూచనలు కనిపిస్తున్నవి. అందువలన కాశ్మీర్‌సమస్య పరిష్కారమైన తరువాతనే ఈ మొత్తమును పాకిస్థాన్‌కు యివ్వవలె నని భారత ప్రభుత్వం నిర్ణయించినది. న్యాయశాస్త్రరీత్యా, భారతప్రభుత్వచర్య సమర్థనీయమా అనునది వివాదగ్రస్తమైన విషయము. కాని ఈ చర్య ప్రస్తుత పరిస్థితులలో సమంజస మనుట నిస్సంశయము.

ఆర్థికఒడంబడిక ప్రకారం తనకు రావలసిన 55 కోట్ల రూ.లు వెంటనే యిచ్చుటకు భారత ప్రభుత్వం నిరాకరించినందువలన, స్టర్లింగు నిలువల సమస్యవిషయమై బ్రిటిష్‌ప్రతినిధివర్గంతో ఇప్పుడు జరుగుచున్న సంప్రదింపులలో పాల్గొనుటకు పాకిస్థాన్ నిరాకరించినది. ఇందువలన వాస్తవముగ పాకిస్థాన్ సాధించగలిగిన దేమీలేదు. సంప్రదింపులు పాకిస్థాన్ ప్రతినిధులు లేకుండగనే సాగుచున్నవి. ఈ సంప్రదింపులలో పాకిస్థాన్ ప్రతినిధులు పాల్గొనకపోయినను నష్టము లేదు. స్టర్లింగునిలువల విషయమై ఇప్పుడు జరుగుచున్న సంప్రదింపులు శాశ్వతపరిష్కారముకొరకుగాక మరొక 6 నెలలపాటు అమలులోనుండు తాత్కాలిక ఒడంబడిక కుదుర్చుకొనుటకే ఉద్దేశింపబడినవి. ఇట్టి తాత్కాలిక ఒడంబడిక ఇదివర కొకమారు, భారతదేశం అవిభక్తంగా వున్నప్పుడు జరిగినది. ఇప్పుడు ఒడంబడికకూడ అదేప్రకారము జరుగును. భారతదేశమునకు డాలర్‌ప్రాంతపు సరకులు ఇప్పుడు ఎక్కువగా అవసరమైయుండుటవలన, డాలర్లలోనికి మార్చుకొనుటకు వీలగు స్టర్లింగు మొత్తము కొంతవరకు హెచ్చింపవలెను. ఈ ఒడంబడిక అమలులోనుండు ఆరునెలల కాలములో విడుదల చేయబడు స్టర్లింగు మొత్తములో, ఆర్థిక ఒడంబడిక ననుసరించి, పాకిస్థాన్‌వంతు పాకిస్థానుకు యివ్వబడును. కాబట్టి ఈ సంప్రదింపులలో పాల్గొనకుండ పాకిస్థాన్ సాధించగలిగిన దేమీ లేదు.

దేశవిభజన సమయములో పాకిస్థాన్‌కు యివ్వబడిన 20 కోట్ల రూ.ల రొఖ్ఖము ఖర్చయిపోయినది. ఆర్థిక ఒడంబడిక ప్రకారం యివ్వవలసిన 55 కోట్ల రూ.లు యిచ్చుటకు భారత ప్రభుత్వం నిరాకరిస్తున్నది. అందువలన పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పుడు డబ్బుకొరకు చాల యిబ్బందిపడుతున్నది. కాశ్మీర్‌పై దండయాత్రను ప్రోత్సహించినందు కిది ప్రథమ ఫలితము పాకిస్థాన్ కేంద్రప్రభుత్వముకద్ద డబ్బు లేకపోయిన రాష్ట్రములవద్ద అప్పు పుచ్చుకొనవచ్చును. కాని అందుకు అవకాశములు తక్కువ. సరిహద్దురాష్ట్రము ఎప్పుడు కొరతరాష్ట్రమే. పశ్చిమ పంజాబ్ కల్లోలములవలన నష్టపడి, తనకే చాలినంతసొమ్ము లేకుండా వున్నది. తూర్పుబెంగాల్ కొత్త రాష్ట్రము. సింధురాష్ట్రము కూడ మామూలుగా కొరత రాష్ట్రమే. అందువలన పాకిస్థాన్ అధికారులు నిజాంను, రిజర్వు బ్యాంకును దుయ్యబట్టుచున్నారు. రిజర్వు బ్యాంకు రెండు అధినివేశములకు కేంద్ర బ్యాంకు అయినప్పటికీ, భారత ప్రభుత్వ చట్టము వలన ఏర్పరుచబడినదగుటచే పాకిస్థాన్‌కు అప్పు యిచ్చుటకు అవకాశములేదు. పాకిస్థాన్ ప్రభుత్వ ఋణపత్రముల తాకట్టు పెట్టుకొని అప్పుయిచ్చుటకు కూడ రిజర్వు బ్యాంకుకు అవకాశములేదు. పాకిస్థాన్‌కు నిజాం 25 కోట్ల రూ.లు అప్పు యిచ్చినట్లు వార్తలు వస్తున్నవి. నిజాం తన సంస్థానములో భారతదేశనాణెముల చలామణి నిషేధిస్తూ శాసనం జారీచెయ్యటము, పాకిస్థాన్ ఖజానామంత్రి రెండు పర్యాయములు హైదరాబాద్ రావటము. ఈ వార్తను సమర్థిస్తున్నవి. ఈ వార్త వాస్తవమైనచో భారత ప్రభుత్వం నిజాంపై కఠినచర్యలు తీసుకొనక తప్పదు.

ఇండియా, పాకిస్థానాల సంబంధాలు ఇంత క్లిష్టముగానున్నా కొన్ని ఆశాకిరణములు కనిపించకపోవడం లేదు. తనతో ప్రత్యేక సామ



బ్రిటన్‌లో స్విట్జర్లండు రాయబారి రూగర్ ఈ మధ్య మద్రాసు వచ్చినప్పుడు మన గవర్నరు, మంత్రులు ఆయనకు విందొసంగినారు. చిత్రంలో గవర్నర్ పక్కన రూగర్ సతి, ప్రధాని పక్కన రూగర్ గారలు కనిపిస్తున్నారు.

విపరీత పరిణామాలు

చుటకు నరేంద్రుల ప్రయత్నాలు


రక్షణ ఒడంబడిక చేసికొనవలసిందని రష్యా చేసిన సూచనను పాకిస్థాన్ తిరస్కరించినట్లు తెలుస్తున్నది. హిందూమహాసముద్రప్రాంతంలో కూడా తన పలుకుబడిని వ్యాపింపజేసుకొనవలెనని రష్యా చేస్తున్న ప్రయత్నములు ఫలిస్తే, భారత దేశమునకు ప్రమాదమేర్పడగలదు. పాకిస్థాన్‌లో పంచదారకు చాల కరువుగా నున్నది. అందువలన తమ ఆహారధాన్యములను భారతదేశమునకు యిచ్చి, వానికి బదులుగా పంచదార కొనుక్కొనవలెనని పాకిస్థాన్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇట్టి ప్రత్యేక ఆర్థిక ఒడంబడిక చేసుకొనటం ఉభయ అధినివేశములకు శ్రేయస్కరం. ఇట్టి ఆర్థిక కారణములు ఏనాటికైనా భారత దేశపు ఐక్యతా ఆవశ్యకతను పాకిస్థాన్‌కు నిరూపించక పోవు.

నరేంద్రమండలి పునరుద్ధరణ ప్రయత్నాలు......

భారతదేశ సత్వరపురోభివృద్ధికి సంస్థానాలొక పెద్ద ఆటంకముగా నున్నవి. చిన్న చిన్న సంస్థానాలు తమ పక్కనున్న రాష్ట్రాలతో కలసిపోవాలనీ, పెద్ద సంస్థానాలన్నింటిలోను ప్రజాప్రభుత్వము లేర్పరచవలెననీ ఆయా సంస్థానాల ప్రజలు ఆందోళన తీవ్రముగా జరుపుచున్నారు. ఒరిస్సా, సి. పి. సంస్థానాధీశ్వరులు ప్రజాభిప్రాయమును మన్నించి, తాము వైదొలగుటకు అంగీకరించారు. ఈ విధముగా స్వచ్ఛందముగా తమ రాజ్యమును దేశశ్రేయోభిలాషులై త్యజించినవారు, వారి పూర్వచరిత్ర ఎట్టిదైనను, అభినందనార్హులే. డక్కన్ సంస్థాన సమితిలో జేరిన నరేంద్రులందరుకూడ తమ సంస్థానముల పరిపాలనాధికారమును బొంబయిరాష్ట్రమునకు దఖలుపరచుటకు సుముఖముగ నున్నారు. హిమాలయప్రాంత సంస్థానాల ప్రజలు తమ సంస్థానాలు తూర్పుపంజాబ్‌తో చేరవలెనని ఆందోళన చేస్తున్నారు. చిన్న చిన్న సంస్థానాలన్నీ ఈ విధంగా త్వరలోనే ప్రక్కనున్న రాష్ట్రాలలో జేరిపోగలవు. ఇవి పోగా 35,40 పెద్ద సంస్థానాలు మిగులుతవి. చిన్న చిన్న సంస్థానాలు రాష్ట్రాలతో కలసిపోవటం ఈ పెద్ద సంస్థానాధీశ్వరులకు తమ మనుగడను గురించి ఆందోళనను కలిగిస్తున్నది. తమ సంస్థానాల ప్రజలుకూడా భారతరాష్ట్రాలతో కలసిపోవలెనని అభిలషిస్తున్నారని వీ రెరుగుదురు. ఏనాటికైనా తాము ప్రజాభిప్రాయమునకు లొంగిపోకతప్పదని కూడా వీ రెరుగుదురు. అందువలననే, సంస్థానములలో త్వరత్వరగా బాధ్యతాయుత ప్రజాప్రభుత్వము లేర్పరచి, తమ ప్రజలు భారతరాష్ట్రాలలో చేరిపోవలెనని అభిలషించకుండునట్లు వారిని వశపరచుకొనవలెనని సంస్థానాధీశ్వరులందరు ప్రయత్నించుచున్నారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనము కొల్హాపూర్ సంస్థానము. ఆ సంస్థానములో బాధ్యతాయుత ప్రభుత్వము నేర్పరచుటకు మహారాజా అంగీకరించి ఎంతోకాలము కాలేదు. కాని ఈమధ్య ప్రజాపరిషత్ నాయకుడు లోకరు మాట్లాడుతూ, డక్కన్ సంస్థానాలన్నీ బొంబాయిరాష్ట్రంలో చేరిపోవ నిర్ణయించటం అభినందనీయమనీ, తమ సంస్థానంమాత్రం, సంస్థానాధీశ్వరుడు శివాజీ మహారాజ్ వంశస్థుడగుటవలన, ప్రత్యేకంగా వుండిపోవలసిందే నని అన్నాడు. తిరువాన్కూర్, మైసూర్, జయపూర్ వంటి పెద్ద సంస్థానాల ప్రజానాయకులు, ఇప్పుడే తమకు లభించిన స్వపరిపాలనాధికారముమజాచి మురుసుకుంటూ ఇదేవిధంగా మాట్లాడవచ్చును. కాని కొంతకాలమైన తరువాతనైనా వారు తమ తప్పును గ్రహించుకొనకపోరు.

బ్రిటిష్ ప్రభుత్వం మన దేశమును పాలిస్తున్న రోజులలో సంస్థానాధీశ్వరుల ప్రత్యేక కోర్కెలను ప్రభుత్వమునకు నివేదించుటకు నరేంద్ర మండలి ఒకటి ఏర్పరచబడినది. భారతదేశం స్వాతంత్ర్యం పొందగానే ఈ నరేంద్రమండలి మూసి వేయబడినది. భారతప్రభుత్వ సంస్థానాల శాఖకు తమకు మధ్య సంధానకర్తగా వుంటూ, తమ వ్యక్తిగతహోదాలను, ఆస్తులను రక్షించుటకు ఇటువంటి మండలి వేరొకటి ఇప్పుడు స్థాపించవలెనని పెద్ద సంస్థానాల ప్రభువులు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయములో వీరికి గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ కూడ మద్దతు చేస్తున్నాడు. కాని వీరి ఈ ప్రయత్నాలు విఫలంగాక తప్పదు. భారతరాష్ట్రాలలో చేరిపోవుండ వుండగలందులకై ఒకవంక ప్రజానాయకులను దువ్వబట్టుచు, తమ ప్రత్యేకాధికారములను నిలుపుకొనుటకు వేరొకవంక ఇతర సంస్థానాధీశ్వరులతో మంతనములు జరుపుచున్నవారు ఉభయత్రాకూడా నష్టపడటంకన్న వేరేమీ జరగబోదు.

బాధ్యతాయుత ప్రజాప్రభుత్వ మేర్పరచబడిన సంస్థానాలలో నరేంద్రులు తమ ప్రజలనే నమ్ముకొని వుండటం మంచిది. మంత్రివర్గమునకు వప్పజెప్పకుండా కొన్ని ప్రత్యేకాధికారములు సంస్థానాధీశ్వరులు తమ చేతులలో నుంచుకొనటం కూడ మంచిదికాదు. తమ కుటుంబమునకు, రాజవంశమునకు ప్రజామంత్రులు ముప్పు తెచ్చెదరని సంస్థానాధీశ్వరులు భయపడ నవసరం లేదు. సంస్థానాధీశ్వరుని యెడ ప్రజలకు నిక్కముగ అసంతృప్తియే కలిగినచో ప్రత్యేకాధికారములతనికి రక్షణ నివ్వలేవు. తమ ప్రజలే తమ పట్ల అసంతృప్తి జెందియున్నారని గుర్తించిన సంస్థానాధీశ్వరుడు, తన పదవిని పట్టుకు ప్రాకులాడటం కన్న, తన సంస్థానమును భారత రాష్ట్రముతో కలిపి వేసి, హాయిగా జీవించుట మంచిది కాదా ?



హైదరాబాదులో భారత ప్రతినిధి శ్రీ కె. యం. మున్షీ గారు హైదరాబాద్ నరగంలో బోలారం రెసిడెన్సీ భవనం ఆవరణలో భారతపతాకను ఎగురవేస్తున్న దృశ్యం

సంస్థానాలలో ప్రధాన మంత్రులను నియమించు విధానమును గూర్చి కూడ చర్చలు జరుగుచున్నవి. సంస్థానాధీశ్వరుడు సూచించిన వ్యక్తి గాక, ప్రజానాయకుడే ప్రధాన మంత్రి యగుట సంస్థానాధీశ్వరునకే క్షేమప్రదము. ఇంత వరకు తమ సంస్థానములలో సంపూర్ణబాధ్యతాయుత ప్రభుత్వము నేర్పరచని సంస్థానాధీశ్వరులు త్వరలో అట్లు చేయగలరని ఆశించుచున్నాము.

రాష్ట్ర ఆహార పరిస్థితి

భారత ప్రభుత్వ ఆహారవిధానాన్ననుసరించి చెన్నరాష్ట్ర ప్రభుత్వం ఆహారపదార్థాలపై కంట్రోలు, రేషనింగ్ తొలగించవలెనని నిర్ణయించినది. రాయలసీమ జిల్లాలలోను, సర్కార్ జిల్లాలలోను గ్రామాలలో రేషనింగ్ పూర్తిగా తొలగించబడినది. సర్కార్ జిల్లాలలో పట్టణాలలోకూడా రేషనింగ్ తొలగించారు. ఒకజిల్లానుండి ఇంకొకజిల్లాకు ఆహార ధాన్యాలు రవాణా చేయుటపై గల నిషేధం తొలగించలేదు. ప్రభుత్వ సేకరణ విధానంలోకూడా మార్పేమీ వుండబోదు. ఈ విధానం లోపభూయిష్టమైనది, ప్రమాదభరితమైనదీ నని చెప్పక తప్పదు. కంట్రోల్ తొలగింపు విధానం జయప్రదంగా అమలుజరుగకపోతే, ఇప్పటికన్న కఠినంగా కంట్రోల్స్ అమలు జరుపబడునని ప్రభుత్వం ప్రకటించింది. కంట్రోల్ తొలగించగానే దాదాపు అన్నిప్రదేశాలలోను, అన్ని వస్తువుల, ధాన్యాల ధరలు పెరిగినవి. పైగా రాష్ట్ర ఆహారపరిస్థితి నానాటికి విషమిస్తున్నది. చాల జిల్లాలలో కొన్ని వారాలకు కూడా సరిపోని సరకు మాత్రమే నిలువవున్నది. సేకరణ రెండు మూడు నెలల క్రితం జరిగినంత సంతృప్తికరంగా ఈ మధ్య జరుగలేదు. కాని గతవారపు సేకరణకూడా సంతృప్తికరంగా జరిగింది. జనవరి 1 వ తేదీతో అంతమైన వారంలో రాష్ట్రంలో, 15,516 టన్నుల ఆహారధాన్యం సేకరించబడెను; ఆ క్రితంవారం 9,778 టన్నులుమాత్రమే సేకరింపబడెను. కాని ఆహార ధాన్యాల నిలువలమొత్తం గతవారం 1,14,958 టన్నులనుండి 1,02,240 టన్నులకు తగ్గిపోయింది. ఈ సంవత్సరం పంటలు, అనేక కారణాలవలన, గత సంవత్సరం పంటలకన్న ఏమీ బాగా పండలేదు. గత సంవత్సరం మన రాష్ట్రంలో 41,90,000 టన్నులు బియ్యమునకు సరిపోవు వరి పంట పండినదనీ, ఈ సంవత్సరం 41,25,000 టన్నులు బియ్యముమాత్రమే లభ్యమగుననీ అంచనావేశారు. మనరాష్ట్రంలో సామాన్యంగా $5\frac{1}{2}$ లక్షల టన్నులు ఆహారధాన్యం కొరతపడుతుంది; కాని ఆహారసలహాసంఘం వారు మనకు $1\frac{1}{2}$ లక్షల టన్నులు మాత్రమే కేటాయించారు. మిగిలిన మొత్తం అధికోత్పత్తి, అధికసేకరణలద్వారా సంపాదించుకోవలసి వుంటుందని వారి అభిప్రాయం. కాని మన రాష్ట్రానికి 25 లక్షల టన్నుల ఆహారధాన్యాలు కేటాయించవలసిందని రాష్ట్ర ప్రభుత్వం కోరినదట. ఈ మొత్తము సరఫరా చేయలేనని కేంద్ర ప్రభుత్వం చెపుతుంది. కాబట్టి మనరాష్ట్ర ప్రభుత్వం అధికోత్పత్తి, అధికసేకరణలపైననే ఆధారపడివుండాలి. అధికోత్పత్తికి మన ప్రభుత్వంచేస్తున్న కృషి ఏమిటో తెలియదు.

ఆహారధాన్యాల ఉత్పత్తి, సేకరణలు యిట్లుండగా, కంట్రోల్ తొలగించిన తరవాత ధరలు పెరగకుండా వుండటానికి ప్రభుత్వం ఏవీ ఏర్పాట్లూ చెయ్యలేదు. వర్తకులు ధరలు పెంచితే, కంట్రోల్ ధరలకే ఆహారధాన్యాలు అమ్మటానికి ప్రభుత్వం నేరుగా గాని, సహకారసంఘాల ద్వారాగాని అంగళ్ళు తెరవడానికి సిద్ధంగా వుండవలసినది. కాని కాగితంపైన తప్ప ఈ విషయంలో మరేమీ జరగలేదు. అందువలన, కంట్రోల్స్ తొలగించగానే ధరలు పెరిగి, ప్రజలలో ఈ విధానంపట్ల అసంతృప్తి ప్రబలుతున్నది. ఇప్పటికైనా అన్ని జిల్లాలలోను చౌక ధాన్యం డిపోలు ప్రభుత్వం స్థాపించి, వర్తకులు అనవసరంగా ధరలు పెంచినచో సరకు వశపరచుకుని వర్తకం సహకార సంఘాల పరం చేయటం సమంజసమైన విధానం. కొరత ప్రాంతాలకు ఇదివరకువలెనే సరకు సకాలంలో అందేటట్లున్నూ, ఆ సరకు సక్రమంగా పంపిణీ జరిగేటట్లున్నూ ఏర్పాటు చేయకపోతే ప్రజలలో అలజడి పుట్టక మానదు.



మనరాష్ట్ర సామాజిక అభివృద్ధి కార్యకర్తల సమావేశం మద్రాసులో జరిగింది. అధ్యక్షత వహించిన గవర్నరు నైగారు, ప్రారంభోపన్యాసం చేసిన ప్రధాని రెడ్డిగారు, బీగం అమీరుద్దీన్, మాధవమీనన్ సతి చిత్రంలో కనిపిస్తున్నారు.

ఆ, యా, కి బుర్లు:

కాలేజీప్రొఫెసర్ల జీతాలు

అన్ని వృత్తులలో ఆదాయాలు అంతంతగా పెరిగిన 1945-46 లో కూడా, ప్రొఫెసర్లకోసం పత్రికల్లో విద్యాశాఖల ఎడ్వర్టయిజు మెంట్లిల్లా ఉండేవి: కావలెను.

"—సౌత్ వెస్టర్న్ టెక్నికలు కాలేజీలో ఫిజిక్సు అధ్యాపకుడు. యం. యస్‌సి. అయి ఉండాలి. జీతం సాలీనా 2000 డాలర్లు—

"గృహ ఆర్థికశాస్త్రంలో స్త్రీ అధ్యాపకురాలు కావలెను. సాలుకు 2000-2400 డాలర్లు.

"సాదర్న్ విమెన్స కాలేజీలో రాజకీయ ఆర్థిక శాస్త్రాలలోను, చరిత్ర శాఖలోను ఉపాధ్యాపకుడు కావలెను. 28-40 ఏళ్ళ వయస్సు. డాక్టరేటు డిగ్రీ అధ్యాపకత్వంలో అనుభవం ఉండవలెను. జీతం సాలీనా 1200-1800 డాలర్లు—

"మానసికతత్వ శాస్త్రోపాధ్యాయుడు కావలెను. డాక్టరేటున్న అవకాశ మెక్కువ. జీతం సాలీనా, 2000-2500 డాలర్లు"— ఇత్యాది...

ఇక వీరికి కావలసిన ఇతర అర్హతలు చూస్తే, న్యూటన్, ఎయిన్‌స్టీన్లు కూడా చాలరు.

"విద్యాబోధ తత్వంలో మహాపరిపూర్ణమైన జ్ఞానముండి, తరగతులను సుశిక్షితంగా ఉంచగలిగి, లాటిన్, గ్రీక్, జర్మన్, ఇంకా వీలయితే రష్యన్, చైనీయభాషల్లో విద్యాబోధన కుపాధ్యాయులను తయారుచేయగలిగి ఉండి, ఉండాలి. సాలీనా 2,500-3,600 డాలర్లదాకా జీతమిస్తాము. వేసవికాలంలో కూడా పనిచేస్తే ఆరు వారాలకు అదనంగా మరో 600 డాలర్లు" అని సుభ్రంగా ప్రకటిస్తారు.

ఆర్థికశాస్త్రంలో ఎం. ఎ. పాసయినవారి కొకరికి సాలీనా 2,000 డాలర్ల జీతం ఇస్తాం వస్తావా అని అడిగారట. నాకు ఏడాదికి 4,800 డాలర్లు, ఓ. పి. ఓ. వారు, నిత్యం ఆఫీసుపని స్వల్పంగా చూసేందుకే ఇస్తున్నారు. కాస్త దీప మున్నప్పుడే చక్కబెట్టుకొందామనుకొంటున్నాను; పోనీ నేను తర్వాత ఎప్పుడైనా మరీ దారిద్ర్యంలో ఉన్నప్పుడు వస్తే కాస్త ఉద్యోగం ఉంచగలరా?" అని ఆయన ప్రత్యుత్తరం ఇచ్చాడు.

అసలు అమెరికా కాలేజీ అధికార్లకు కూడా, ప్రొఫెసర్ల కింత జీతం చాలునా, తక్కువ జీతాలిస్తే ఆశేషాన్ని ఏయే తియ్యటి నీతులతో పూరించాలి అన్న విషయం మన కాలేజీ అధికారులకు లాగే తెలిసినట్లు కనబడుతుంది. హైస్కూలులో సాలీనా 2700 డాలర్లు తెచ్చుకొంటూన్న ఉపాధ్యాయుణ్ణి, కాలేజీలోకి రమ్మని ఆహ్వానిస్తూ "మే మిచ్చే జీతం కన్నా మీ కక్కడే ఎక్కువిస్తున్నారని, మాకు తెలుసనుకోండి. అయినా అక్కడిలాగా హైస్కూల్లో పసిపిల్లలకు పాఠం చెప్పడం కంటే, కాలేజీ క్లాసుల్లో లెక్చర్లియ్యటం ఎంత ఘనమైనదో వేరే చెప్పనక్కర లేదు" అని పంచదారపూత పూసి చూపించారు. ఆ చెల్లింపుకు కూడా లొంగిపోయి, చివరికి 1800 డాలర్లకు తనకు అప్పటికి హైస్కూలులో వస్తున్న జీతం కన్నా చాల తక్కువకు, మరో అమాయకురాలు ఒప్పుకుంది.

ఇంక కాలేజీ పెన్షన్ల విషయం: ఒకసారి ఒక కాలేజీ ప్రొఫెసరు రిటైరవబోతున్నాడు. పాపం వృద్ధాప్యానికి మిగుల్చుకో గలిగిందేమీ లేదు: అదే సమయంలో, ఆ కాలేజీ గుమ్మంగ్గిర బటాణీ లమ్ముకొనే తాత కూడా విశ్రాంతికోసం చూస్తూ, ఈ ప్రొఫెసరుకు తన బటాణీకొట్టు అమ్మేశాడు. ప్రొఫెసరుకు జేబు నిండా డబ్బులు రావటం మొదలెట్టాయిటగాని, తను కాలేజీకి చాలా తలవంపులుగా ఉందని, కాలేజీ అధికారులు, కాస్త పెన్షనియ్యటం సాగించారట.

అసలు తమ చదువు జీతాలు పెంచినందుకు వాట్లలో భాగం అధ్యాపకుల కెందు కియ్యాలని, అక్కడి కాలేజీ విద్యార్థులే చాలా మాట్లు గట్టిగా అడగటం మొదలుపెట్టేరట.

అసలే డాలర్లు వేల అంకెల్లో కనబడుతూంటే, ఒక ఫ్రెంచి సాహిత్యవేత్త అమెరికన్ కాలేజీలో ఉద్యోగానికి ఒప్పుకొని వచ్చాడట. కాని అక్కడి జీవనపు ఖర్చులు చూసి, ఒక టర్ము అయ్యేటప్పటికి, రాజీనామా ఇచ్చి వెనక్కి తిరిగాడట. తక్కినవాళ్లు కొంద రిల్లాగే వచ్చి, విద్యాశాఖను వదిలేసి, తక్కిన శాఖల్లోకి తప్పుకొంటూవచ్చారట.

వాచకపుస్తకాలు వ్రాసి సంపాదిద్దా మనుకొనే అధ్యాపకులు కొందరున్నా, వాచక పుస్తకాలకు చాలా తక్కువ ప్రతిఫలం రచయితకు ముట్టేటట్లు చేయటం, ప్రచురణకర్తలు, విద్యగా అభ్యసించే ఉన్నవారాయెను.

ఈవిధిగా అధోగతిలో ఇంక కొన్నాళ్లు గడిస్తే, కాలేజీలలో, ఉత్తేజకములు, ఆశయాలు, ఆదర్శాలు, శక్తివంతంగా బోధనలో మిళితంచేయగలవారు అయిన అధ్యాపకులు కరవైపోయేటట్టున్నారని అమెరికన్ విజ్ఞులే విలపిస్తున్నారు.

మన కాలేజీ అధికారులు కూడా, నవీన అమెరికాకన్నా ఈ విషయంలో పై మెట్టుమీద ఉన్నామని సంతోషించేందుకు ఎంతైనా ఆస్కారముంది.

(నోయెల్ లూయీ వ్యాసం ఆధారంగా)

వ్యవసాయ కళాశాలా సంస్థలవారు కాలేజీ లెక్చరర్లకు, తక్కిన వృత్తులన్నింటిలోకీ తక్కువజీతా లిస్తున్నారంటే, మన మేం ఆశ్చర్యపడ నక్కరలేదు. మహోన్నతమని చెప్పుకొంటూన్న అమెరికాతోపాటే మేమూ చేస్తున్నామని సగర్వంగా చెప్పుకొని ఏమాత్రం పరితాపచిహ్నమైనా అవసరంలేకుండా నిద్రపోవచ్చును.

అమెరికాలో హైస్కూళ్లు, ఎలిమెంటరీ స్కూళ్ళమాస్టర్ల జీతాలకై ఈ మధ్యకాలంలో చేసినంత ఆందోళన, కాలేజీ ప్రొఫెసర్ల జీతాల విషయమై ఏమాత్రం జరుగలేదు.

"కాలేజీ ప్రొఫెసరంటే, బ్రహ్మచారిగా ఉంటూ, తపోవనంలో గడిపే జీవితం గడిపే సంప్రదాయం అనుసరిస్తేనే మాకిచ్చే జీతాలు చాలుతవి" అని ఒక అమెరికన్ కాలేజీ ప్రొఫెసరు అన్నాడు. "భార్యాభర్తలం బిడ్డలు లేకుండా జాగ్రత్తపడట మొకటే, మా జీవిత ఆదాయవ్యయాలపట్టిక సర్దుకోటానికి మా అంతట మేము చెయ్యగల పని" అని ఇంకో ప్రొఫెసరన్నారు. "ఏడాదికి 3,000 డాలర్లమీద, ఇద్దరు పిల్లలూ, మేమూ బ్రతికి, పాతచివికిపోయిన ఇంటికి నెలకు 60 డాలర్లు అద్దె ఇచ్చుకొంటూ, బట్టలుదుకుకోవటం, బజారువస్తువులు తెచ్చుకోటం, చిల్లరమల్లర గృహకృత్యాలు మొదలు అన్ని యింటిపనులూ నేనే చూసుకొంటూ, ప్రొఫెసరుగారి పెళ్లామన్న పెద్ద హోదాతో మాత్రం, స్వంత ఆస్తులు ఆర్జన గలిగి తక్కిన నలుగురిముందు ప్రతిష్ఠకు కావలసిన ఖర్చులు అవసరంగా చేసుకోకతప్పక, కాలేజీ ప్రొఫెసరు భార్యగా అతని జీతంతో కాలం ఎల్లా గడపాలో నాకు తెలియటంలేదు. మా ఆయన సాలుసరి జీతం, ఆ కాలేజీ ప్రెసిడెంటు ఒట్టి రెండు విందులకు ఖర్చుపెట్టేంతకు, కాలేజీ అధికారులు ప్రెసిడెంటుకి ఇచ్చే ప్రత్యేక అలవెన్సు అంత ఉండదు" అంటూ ఒక కాలేజీ ప్రొఫెసరు భార్య తన బాధలు చెప్పుకొంది.

"తాపీమేస్త్రీ పనుల్లో ఉన్న ఎవడైనా, చివరికి టాక్సీడ్రైవరు అయినా, ప్రొఫెసరుగా వాడు వచ్చే జీతంకంటే ఎక్కువే సంపాదిస్తున్నాడు." అని ఇంకో ప్రొఫెసరు. "అసలు సంపద విష్యత్తుకు ప్రొఫెసరుల కిచ్చే జీతాలకు ఏదూరస్థమైన సంబంధమైనా ఉంటుందేమో అనైనా, వీళ్ళెవరికీ ఎందు కనిపించదో" అని ఇంకో ఆచార్యుడు విస్తుపోయాడు.

"అమెరికాలో—"

జాన్ గంథరు ప్రపంచ దేశాలన్నీ పర్యటన చేసి, "ఆసియాలో" (Inside Asia) మొదలైన ఉద్గ్రంథాలు రచించి చివరకు స్వదేశాన్ని గురించి, "అమెరికాలో—" (Inside-America) అనే గ్రంథం వ్రాశాడు. ఆ గ్రంథములో అమెరికాను గురించి అమెరికన్లకు తెలియ చేసిన కొన్ని విషయా లిల్లా ఉన్నాయి:

"వియోమింగ్ రాష్ట్రంలో మనిషి ఒక్కంటికి ఉన్నన్ని మోటారు కార్లు, మరే అమెరికన్ సంయుక్త రాష్ట్రంలోనూ లేవు.

మనుష్యులకన్న గొర్ల సంఖ్య ఎక్కువవున్నది సంయుక్త రాష్ట్రాల్లోకల్లా ఒక్క వెర్మాంటు రాష్ట్రమే.

న్యూయార్కు పట్నంలో రోజుకు 18,200,000 టెలిఫోన్ పిలుపు లుంటాయి. ఇందులో 125,000, తప్పుడు నెంబరు ఇచ్చిన పిలుపులే.

1940 నాటికి ఇడాహోలో 595 మంది మాత్రమే నీగ్రో లుండిరి.

కన్సాస్ రాష్ట్రంలో రష్యన్ జండా ఎగరవేస్తే, రాజద్రోహ మని చట్ట ముంది. అయితే అమలులో పెట్టటం లేదు.

జాతి మొత్తంమీద సుఖజాడ్య ప్రసారంలో ఒరిగన్‌లోని పోర్టులాండుకు ద్వితీయస్థానముంది. మాంటానా, నెబ్రాస్కా, డకోటా, టెక్సాస్ రాష్ట్రాలలో జనసంఖ్య తగ్గిపోతోంది.

ప్రపంచంలోకల్లా, కాలెండర్లు అచ్చువేసే వ్యాపారములో అగ్రస్థానము మిన్నాసోటా కియ్యాలి.

అమెరికాలో తయారయే విస్కీలో నూటిలో నలభైయ్యో వంతు కెంటుకీ రాష్ట్రంలో తయారవుతుంది. కాని ఆరాష్ట్రంలో 120 జిల్లాలలోనూ 88 జిల్లాలలో మద్యనిషేధము అమలులో ఉంది.


చేపలగాలాలు తయారు, ప్రపంచంలో ఎక్కడికన్నా కూడా డెన్వరులో ఎక్కువ.

అమెరికా మొత్తంమీద విద్యావిహీనతకు మిసిసిపీరాష్ట్రందే ప్రథమస్థానం.

అమెరికా, ఏడాదికే, 250 శతకోట్లకు అధికంగా సిగరెట్లను తయారుచేస్తుంది.

1940 దాకా అమెరికాలోని ఆధునిక రాష్ట్రమని ఎన్నబడే కెంటుకీరాష్ట్రంలోనే, 42,000 వేల ఫారంలలో (ఇల్లు, పొలం కలిసి ఉన్నవి) టాయిలెట్ గదులుగాని, పాయఖానా గదులుగాని ఉండేవికావు.

టెన్నిసీరాష్ట్రంలో లెబ్బింగ్టన్ అనేచోట, ఎవరూ ఎప్పుడూ ఎక్కడా చూడనంత పెద్ద పంది ఉంది; దాని బరువు 2,400 పౌనులు."




చక్రాలపై బొగ్గుగని

ఇంగ్లండులో బొగ్గుగనులలో పనులను ప్రదర్శనంలో అమర్చిన విధానము.

కథానిక:

ఎవరిది తప్పు?

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యరావు



భారత అధినివేశ ప్రభుత్వ ఆరోగ్యశాఖా కార్యదర్శి డా॥ జీవరాజమెహతాగారు గత గురువారం బొంబైలో ద్వితీయ రేడియో లాజికల్ సభ ప్రారంభోత్సవంజరిపారు.

పిల్లడికి ఒంట్లో బాగులేదని ఆస్పత్రికి తీసికెళ్లినప్పుడు అప్రయత్నంగా కమల కనుపించింది. అతని కెంతో ఆశ్చర్యం వేసింది. తనతో చిన్నప్పుడు చదువుకుంది. ఎంత అందంగా ఉండేది! బాగా మారిపోయింది.

"ఇక్కడి కెలా వచ్చావు. ఇంతదూరం?"

"ఇక్కడే ఉంటున్నాను కొంతకాలమై— మీ రిక్కడేం చేస్తున్నారు?"

"ఏదో ఉద్యోగం—కడుపుకోసం—"

పక్కున నవ్వింది. ఎందు కలా నవ్వుతుంది. తెలీదు.

"మీ ఇల్లెక్కడ?"—ఫలానా చోట అని చెప్పేడు.

"సాయంత్రంవొస్తానండీ—"వెళ్లి పోయింది.

ఆ బట్టలూ, తలా, అదీ ముష్టిదానిలా తయారయిందేం? చిత్రంగా ఉంది—సాయంత్రం కనుక్కోవచ్చు అనుకున్నాడు. డాక్టరు పిల్లవాడిని ఆస్పత్రిలో జాయిన్ చెయ్యాలన్నాడు. ఏదో ఆపరేషన్ కూడా చెయ్యాలట—పాపం, సుబ్బారావు గుండెల్లో రాయి పడింది!—

రెండురోజు లయింది. కమల రాలేదు. దూరాన్న మైదానంమీద పిల్లలు ఆడుకుంటున్నారు తనూ కమలా ఇలాంటివెన్నో ఆటలు ఆడుకున్నారు చిన్నప్పుడు. అప్పు డెంతో చక్కగా ఉండేది—ఆ నల్లటి కళ్లు, పెద్ద జుత్తు, సన్నని శరీరం ఎన్నోసార్లు జ్ఞాపకానికి వొచ్చాయి. ఆ రోడ్డుమీద కాని, ఆ విశాలమైన మైదానం మీద కాని ఎప్పుడేనా వొంటరిగానడిచి పోతుండేమో అనుకునేవాడు. రహస్యంగా తనలో దాగిఉన్న తీరని కోరికల్నీ, హృదయదౌర్బల్యాన్నీ తలచుకొని సిగ్గుపడ్డాడు.

చిన్నప్పుడు తను నీలి ఆకాశంమీద, మైదానపు నీడలమీద, కమల చక్కదనం మీద ఎన్నో పద్యాలు రాశాడు. ఆ రోజుల్లో తన జీవితమొక్క అవ్యక్త మధురస్వప్నం—ఫలపుచురుకులతో, వలపు కులుకులతో, వొళ్లు తెలియని వూహల్లో ప్రపంచాన్ని మరచిన రోజులవి. అవి అల్లసానివారి అల్లిక జిగిబిగి ప్రబంధకావ్యం. ఒక కాళిదాసు రసైక నాటకం.

కాని కాలం మారింది. కడుపుకోసం దేశాలంట పోయి, ఉద్యోగం, సంపాదన—పిల్లలూ-సంసారం. తన కిప్పుడా మైదానపు నీడల్లో నీలి ఆకాశంలో మాధుర్య మేం కనిపిస్తుంది. చిత్రమైన పరిస్థితులలో మొరటువారిన హృదయాలకి ఆ నల్లని మబ్బుల వెనకనుంచి వచ్చే నిర్మల తేజస్సు నిర్జీవమై వ్యర్థమైనదిగా కనుపిస్తుంది కాబోలు. కమల వచ్చి "సుబ్బారావుగారూ" అని పిలిచింది. ఉలిక్కిపడి లేచాడు.

"రా, కూర్చో—" ఆమె కూర్చుంది.

"ఎంతకాలానికి మళ్లీ...బాగా నల్లబడిపోయావేం—"

అందమయిన మనిషి పాడయిపోయింది. చిరిగిన చీరలోంచి నలిగిన శరీరం కనిపిస్తోంది—నీరసంగా కృశించిన ఆముఖంలో, ఆ పెద్ద కళ్లల్లో స్పష్టమైన ఆవేదనా, బాధా కనుపిస్తున్నాయి. నిశ్శబ్దంగా ఆమె ముఖంలోకి చూశాడు.

"మరచిపోయావా — ఆ రోజులు — ఆ కథలూ, ఆ గాథలూ—"

"కాలం మరిపిస్తుంది—" అతను నిట్టూర్పు తీశాడు.

"మీ రింకా కవిత్వం రాస్తున్నారా?—"

"పోయింది, అంతా—ఈ Struggle for Existance నాలో ఉండేరసజ్ఞతని, ఉద్రేకాన్ని బలి తీసుకుంది."

ఆమె నవ్వింది. "పాపం. మీకు పరిస్థితులలోంచి ఉద్రేకాన్ని తీసుకోడం చేతకాదు-"

"సరిలే—నీ సంగ తేమిటి?"

"మా నాన్న చనిపోయాక నా చదువు ఆగిపోయింది—మే మసలే బీదవాళ్లం. చాలాకాలం వరకూ పెళ్లి కాలేదు. నా కోసం మా అమ్మ బెంగపెట్టుకుని చనిపోయింది. నేను అసహాయంగా సామాజిక దౌర్జన్యాలలో నలిగి ఇలా తయారయాను—" ఆమె నిశ్శబ్దంగా నేలకు చూస్తోంది "ఛీ" సుబ్బారావుకి అసహ్యమేసింది—

"కూలి చేసుకోవలసింది—" అంటూ ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె ముఖం పక్కకు తిప్పి ఏడుస్తోంది. మంచుగడ్డ కరిగినప్పుడు మురికి జారి నిర్మలంగా అగుపట్లు ఆకళ్ళలో బాధ, అమాయకత్వం గోచరించాయి.

"నాలాంటిది కూలి చేసుకున్నా. కూలి దానిలా బతకనిస్తారా పెద్దమనుష్యులు—" ఆమె వెక్కి వెక్కి ఏడిచింది.

"సమాజమే మమ్మల్ని సృష్టించి, తిరిగి శిక్షిస్తుంది! మంచిగా ఉండ మంటుంది. ఉండదలచుకున్న వాళ్ళకి మాత్రం అవకాశాలు ఇవ్వదు—"

నిజమే—అతనికి ఆశ్చర్య మేసింది. ఆమె తప్పేముంది పాపం? తనే అప్పుడు తెగించి పెళ్లి చేసుకుంటే కమలకీంలగతి పట్టేదా? ఆమె జీవితాన్ని చీల్చినవాళ్ళల్లో తనొకడు.

"నీకు నేను ఏం సహాయం చెయ్యగలనో చెప్పు..."

"చెయ్యవలసిన సమయంలో చెయ్యలేదు. ఇప్పుడేం చేస్తే ఏం లాభం—"

ఇరవై రూపాయలు తీసిఇచ్చాడు—ఆమె తీసుకుంది. "నీకుమళ్ళీ అవసరమైతే కనబడు. ఆ నీచపుబతుకు మాను—నీబతుకు తెరవు గూర్చి నే నేర్పాటు చేస్తాను"—ఆమె "అలాగే" నని వెళ్లి పోయింది.

మర్నాడు తను ఆస్పత్రికి బయలుదేరుతుండగా ఆఫీసు బంట్రోతు వచ్చి మేనేజరుగారు రమ్మన్నా రన్నాడు.

"ఇవాళ సెలవు దొరకలేదా?" అంటూ వీథిలో కొచ్చిన సుబ్బారావుగారి భార్య— "ఎలాగ పిల్లడికి, ఆపరేషను కూడా చేస్తానన్నాడు డాక్టరు—ఇదేం ఉద్యోగమండీ దిక్కుమాలిన ఉద్యోగం అంది".

సుబ్బారావు నిస్పృహగా చతికిల బడ్డాడు.

"నువ్వెళ్ళు ముందు—తీరుబాటు చేసుకుని నే వస్తాను—"

"బాగాఉంది. ముష్టినాకరీ"—అంటూ వెళ్ళింది ఆమె—ఈ వెధవ నౌఖరిలో నూరు రూపాయిలిచ్చి రెండువందలరూపాయల విలువగల పనిచేయిస్తారు—చెయ్యకపోతే హెడ్ గుమస్తా చంపుతాడు—తన జీతం జీవితం వాడి చేతుల్లో ఉంది—వాడేనా అంతే. వాడిని ఆఫీసరు తిడతాడు—ఆఫీసరు ప్రాణాలు మేనేజరుచేతిలో ఉంటాయి. అంతా అలాగే—కాని ఆ నమ్రతకి ఒక పరిమితిలేదు. పైవాడు తప్పుచేసినా కిందవాడు ఊరుకోవాలి. కిందవాడిం తప్పు చెయ్యమన్నా, అన్యాయం చెయ్యమన్నా చెయ్యాలి. మొన్న ఆఫీసులో పనిచేసుకుంటూంటే హఠాత్తుగా విదేశదిగుమతులు ఆగిపోయా యని వార్తవచ్చింది. వెంటనే మేనేజరు తన్ను పిలచి, సరుకు ఖరీదు రెండురెట్లుచేసి, చెప్పమన్నాడు.


"నిన్న ఇంగ్లాండునుంచి వచ్చిన మిషన్లమీద కంట్రోలు ధర ఉంది"

"నీముఖం—కంట్రోలుధర ఉంటే ఏం—కొంప మునిగిపోయిందా—మార్కెట్టుసంగతి ఆలోచించాలి—సరుకు బాహాటంగా అమ్మడం మానీ—"మేనేజరు ఇలా అనగానే, తన గుండెలో ఎవరో బల్లెంతో పొడిచినట్లైంది. ఎంతో నీచమైన పని తనచేతులతోనే చెయ్యాలి. ఈ లాభాలవల్ల వర్తకులు మేడలు కడతారు—అందుకు తనుకూడా సహాయపడతాడు. కారణం—ఈసమాజధర్మం ఒక సన్నని వంతెన-పక్కకి తప్పితే కాలు జారి ఎటు పడి పోతాడో తెలీదు. చీకటిపడింది. కానిదూరాన్న నీలికొండల వెనక ఎర్రటి ఆకాశం ఇంకా ఉంది. ఆ విశాలమైన మైదానపు పొలిమేరల్లో జీర్ణదేహాలతో జీవితంపై వెర్రి ఆశతో నల్లటి నీడల్లా నడచిపోతున్నారు కొందరు కూలివాళ్ళు. మానవత్వాన్నే అమ్ముకుంటేకాని బతకడానికి వీలు లేదు ఈ లోకంలో. ఆకలి, దారిద్ర్యం, అనే పదాలవెనక ఎంతో మానవత్వం అణగారి నిట్టూర్పు తీస్తోంది. కాని జీవితాన్ని, కష్టాలతోనూ, బాధలతోనూ ఉన్నపాళంగా అంగీకరించాడు. మానవనిర్మితసమాజాన్ని, దాని సమస్యలని చక్కగా అర్థంచేసుకుని, ఈ దారిద్ర్యపుపాతరలోంచి, నీచపు బతుకులోంచి బయటపడుతామనే, మానవుడు ఎప్పుడు తన నైతిక పోరాటాన్ని సాగిస్తూనే ఉంటాడు. ఆ అంతిమ విజయంమీద వాడికి నమ్మకం ఉంది. కాని, ఆ అమృతాన్ని అందుకొనే టప్పటికి కాలం చాలమందిని బలితీసుకుంటుంది—అలాగే తనుకూడా బలి అవుతున్నాడా? అయితే కమలను తను ఏమని వెక్కిరిస్తాడు? ఆమెకు ఎలాగైనా తను సహాయం చెయ్యాలి—

మర్నాడు తను ఆస్పత్రికి వెళుతూంటే దారిలో ఒకచోట చాల మంది ప్రజలు మూగేరు. ఏమిటని దగ్గరగా వెళ్ళి అడిగాడు: పోలీసు కాన్స్టేబుల్ గర్వంగా. "దొంగతనం చేసిందండీ—ఎక్కడికి పోగలదు తప్పించుకుని—" అన్నాడు.


తన గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కమల చేతికి సంకెళ్ళు వేసిఉన్నాయి.

ఆశ్చర్యంగా "కేసు రుజువయిందా? దొంగతనమా?" అన్నాడు. "రుజువవాలటండీ—ఇది కాకపోతే ఇంకెవ్వరు తీస్తారా ఇంట్లో— ఇలాంటివాళ్లు చాలా అసాధ్యులండోయ్, మీకు తెలీదు—"అన్నాడు పోలీసు తన అనుభవాన్ని వెల్లడిస్తూ—కమల అమాయకంగా తనవేపు చూసింది. పోలీసువాళ్లు ఆమెను తీసుకెళ్ళిపోయారు. బరువైన గుండెతో తను ఆస్పత్రికి వెళ్ళిపోయాడు.



మాంబళం శారదా విద్యాలయంవారు మాతా శారదా దేవి జన్మదినోత్సవం జరిపారు. ఉత్సవాలకు అధ్యక్షతవహించిన శ్రీమతి కమలాదేవి (పూలమాల చేతిలో నున్నవారు) ఆమె కుడివైపున శ్రీమతి అనసూయాబాయ్ కాళేగారలు ఈ చిత్రంలో కనిపిస్తున్నారు.

బర్మా స్వాత
మహోత్స







జనవరి 4వ తేదీన బర్మా స్వాతం త్ర్యోత్సవంలో పాల్గొనడానికివచ్చిన వారికి బర్మా హై కమీషనర్ స్వాగతం చెప్తున్నారు.

◉

ఢిల్లీ ప్రభుత్వభవనానికి చెందిన దర్బార్ హాలులో వివిధదేశాల రాజకీయ ప్రతినిధుల సమక్షాన, బర్మా కడపటిరాజు థీబా పీఠాన్ని బర్మాకు తిరిగి బహూకరిస్తున్న దృశ్యం. ఇప్పటివరకూ హైకమీషనర్ గావున్న విన్ భారతదేశంలో బర్మా రాయబారి హోదాను స్వీకరించాడు. పీఠం ముందు విన్ నిలుచునివున్నాడు.

◉


బర్మా హై కమీషనర్ విన్ తన భార్యను, కుమార్తెను మౌంట్‌బాటెనుకు ఎరుకపరుస్తున్న దృశ్యం.

◉

బర్మా గాయక నటబృందములు, తమ స్వాతంత్రదిన మహోత్సవ సందర్భమున న్యూఢిల్లీలో ఉత్సవ నృత్యలొనరిస్తున్న దృశ్యం.




నాగార్జునకొండ శిల్పముల
కె. వేణుగోపా






ఢిల్లీలో బర్మా హై
త్ర్యోత్సవాలకు భారతప్రధాని
తులు హాజరైనారు. (ప్రధాని
హోదావచ్చింది.) విన్‌తో క
నాట్య కళాకోవిదుడనీ, గాయక
నికిచెందిన ఇంకా 25 మంది నట

ంత్ర్య దిన
వ ము లు



గవర్నర్ జనరల్ దంపతులు దర్బార్ హాలులో పక్కన ఆసీనులై వుండగా, ప్రధాని నెహ్రూ, "బర్మా భారతదేశాల ప్రజలు ఇదివరకు వలెనే ఇకముందుకూడా సుఖదుఃఖాలలో సమానభాగస్వాములుగా ప్రవర్తిస్తారు" అని స్వతంత్రబర్మాకు ప్రత్యేక సందేశాన్ని ఇస్తున్నారు.



◉

యూ. పో. సీన్ నాట్యప్రదర్శనం జరుపుతుండగా చూసి ఆనందిస్తున్న మౌంట్‌బాటెన్ దంపతులు. తదితర ప్రేక్షకులు. బర్మా హైకమిషనర్ విన్, ఆయనసతికూడా ఆసీనులై వున్నారు.



◉

బర్మాప్రజలూ దుక్కి దున్నుకొని జీవించవలసిందే.




◉

వాళ్లదీ రైతు కూలీలదేశమే. ఇక ఈ రైతులే ఈ భూమిలో స్వతంత్రంగా పండించుకొంటారు.




...గోని గయావటవృక్షంక్రింది బోధిసత్త్వుడు
...క్ గారు కాపీ చేసిన రూపచిత్రం



... ...నివాసంలో జనవరి 4 వ తేదీన జరిగిన స్వాతం... ...హ్రూ, గవర్నర్ జనరల్ మౌంట్‌బాటెన్ ప్రభృ... ...గూ, బర్మా హైకమిషనర్ (ఇప్పుడు రాయబారి ...గ్గ)ని అభినందిస్తున్నాడు. బర్మాలో సుప్రసిద్ధ... ...పేరుగాంచిన యూ. పో. సీన్, ఆయన పరివారా... ...ప్రత్యేక నాట్యప్రదర్శనం జరిపారు.

పిల్లల నవల:



పెళ్లాడే బొమ్మ

శ్రీ సత్యనారాయణ శ్రీవాస్తవ

"నేను అస్తమానమూ పనీ పాటా, చదువూ సంధ్యా లేకుండా తిరుగు తాను"

"మంచి పిల్లవాళ్లు ఎపుడూ నిజం చెబుతారు"

"నేను ఎప్పుడూ అబద్ధాలే"

"మంచి పిల్లవాళ్లు తమంతతామే యిష్టంగా బడికి వెళ్లుతారు"

"బడికి వెళ్లడం అంటే నా ఒళ్లంతా నొప్పులు పట్టుకుంటాయి. ఈవేళనించి నా నడతంతా మార్చివేస్తాను."

"నిజమే? ఒట్టు వెయ్యి"

"ఒట్టే! నేను మంచిపిల్లవాడి నైపోతాను. ఐపోయి నాన్న కేమైనా సాయం చేస్తాను. పాపం, మా నాన్న ఎక్కడున్నాడో?"

"నాకు తెలియదు."

"నేను మళ్ళా ఎప్పటికైనా మా నాన్నని చూచి అతన్ని ముద్దుపెట్టు కుంటానా?"

"చూస్తావేమో! ఏమో ఏమిటిలే, తప్పకుండా చూస్తావు. అతన్ని ముద్దు పెట్టుకుంటావు"

ఈమాట వినగానే పినాకరావు సంతోషానికి మేర లేదు. వెంటనే ఆ సుందరిచేతులు పట్టుకొని గట్టిగా ముద్దు పెట్టేసుకొన్నాడు. ఆ ముద్దల్లో తన ఒళ్లే మరచిపోయాడు! ముఖం మార్చి ఆమెకేసి ప్రేమగా చూస్తూ—

"అమ్మా, మరి ఒక్క మాట చెప్పవూ? నువ్వు నిజంగా చచ్చిపోలే దన్నమాట"

"అన్నమాట"

"ఆ తులసికోటమీద 'యిక్కడ అని' వ్రాసిఉన్న అది చదువుతున్న ప్పుడు నే నెంత బాధపడ్డానో!"

"నాకు తెలుసు. అందుకే నిన్ను క్షమిస్తాను. నీ యేడ్పు విని, నీ మనస్సు మంచి దని తెలుసుకొన్నాను. పిల్లల మనస్సులు మంచివైతే, ఎంత చెడ్డ వాళ్లై చెడుగుణాలకి అలవాటు పడినా గాని ఎప్పటికైనా బాగుపడతారు. అందుకే నీకోసం యిక్కడికి వచ్చాను. నీ కింక నేను అమ్మగా ఉండి......"

"చాలా బాగుంది!" అని ఒక్క గంతు వేశాడు పినాకయ్య.

"అయితే, నే చెప్పిన ట్లా వినాలి సుమా!"

"తప్పకుండా నమ్మా! వింటాను, వింటాను, వింటాను.

"రేపే నువ్వు స్కూలుకి వెళ్లాలి" పినాకయ్యసంతోషం కొంచెం తగ్గింది.

"చదువు పూర్తిఅయిన తర్వాత, నీకు వచ్చిన పనో పాటో నువ్వు చూసుకొని నేర్చుకోవాలి"

పినాకయ్య ముఖం ఎఱ్ఱబారింది. జేవురించుకొన్నాడు.

"నీ పళ్లకింద ఏమిటి గొణుగు కొంటున్నావు—అపుడే వచ్చిందీ?" అని సుందరి కోపంతో అడిగింది.

"ఇపు డేమిటి — ఇన్నేళ్లు వచ్చి చదువుకోక మట్టికొట్టుకోనా యని, ఇంత ఆలస్యం అయినతర్వాత..."

"చదువుకీ నేర్చుకోవడానికీ వయస్సు ఏమిటి? ఎపుడు నేర్చుకొన్నా నేర్చుకోవచ్చు."

"నాకు పని నేర్చుకోవా లనిగాని వ్యాపారం చెయ్యా లనిగాని లేదు"

"ఏమీ?"

"పని చేస్తే మరి అలసిపోనూ?"

"ఇలాగ మాటలాడేవాళ్ల పని ఆసుపత్రిలోనో, జెయిలులోనో ఆఖ రవుతుంది. ఈ లోకంలో ఎవరైనా సరే పేదవాళ్లుకానీ, ధనవంతులుకానీ, బ్రతుకు తెరువుకోసం ఏదో యొక పని చేసితీరాలి. పనీ పాటా లేని సోమరి జీవితం జీవిస్తే అవస్థపాలవుతారు. సోమరితనం పెద్ద జబ్బు. అది చిన్నతనంలో పుట్టినవెంటనే నిర్మూలించాలికాని పెద్ద ఎదిగితే అసలే నిర్మూలించదు." ఈ మాటలు వినగానే పినాకయ్యకి నసాళం అంటింది. తల పైకెత్తి ఆ సుందరి కేసి చూచి అన్నాడు:

"అమ్మా! ఈ బొమ్మబ్రతుకు అంటే అసహ్యం వేసింది. ఇంక

౨ళ

"నీలాలతల సుందరిని నేను కాను తే" అని ఆ చల్లని తల్లిముందు చెప్పింది. కాని కనిపెట్టేశాడు అని తెలుసుకుంది. పైగా ఇంక అంతటితో ఆ తమాషా చాలిద్దాం అనుకుంది. తానే చెప్పేసింది:

"ఓరి చిట్టినాయనా! నీ కెలా తెలిసిందోయి నేను ఫలానా అమ్మాయి నని"

"నువ్వంటే నా కెంత ప్రేమ అనుకొన్నావు. ఆ ప్రేమవల్లనే నాకు తెలిసింది"

"నీకు జ్ఞాపకం ఉందా? నేను చిన్న పిల్లగా ఉన్నపుడు వదిలేసి పోయావు. మళ్లీ యిపుడు పెద్ద మనిషిలాగ కనిపిస్తున్నాను కాదూ? మీయమ్మఅంత పెద్దదాన నైపోయాను."

"బాగుంది. నిన్ను అక్కయ్య అన డానికిబదులు అమ్మ అని పిలుస్తాను. ఎన్నాళ్లనించో అందరి పిల్లల్లాగ నేను కూడా 'అమ్మా' యని పిలవాలని ఉంది. అవునుగాని నువ్వింత త్వరగా పెద్దదాన వెలా గయ్యా వమ్మా?"

"అది రహస్యం"

"అదేదో నాకూ చెప్పవూ? నేను పెరిగి పెద్దవాడ నవ్వా లని ఉంది. నే నెపుడు చూచినా పెళ్లాడే బొమ్మలాగ యింతే ఉంటాను."

"నువ్వు యింక ఎదగవు"

"ఎందుచేత?"

"బొమ్మలు ఎదగ లేవు కనక, బొమ్మలులాగే పుట్టతాయి, బొమ్మల్లాగే బ్రతుకుతాయి, బొమ్మలలాగే చస్తాయి"

"అబ్బ! యీ బొమ్మలాగ ఉండటం అంటే నాకు తలకాయ నొప్పిగా ఉంది. ఈపాటికి నేను మామూలు మనిషినై........"

"అవుతావు మనిషి వవుతావు; కాని తగిన యోగ్యత ముందు తెచ్చుకోవాలి"

"యోగ్యత రావడానికి ఏం చెయ్యాలి?"

"ఏంలేదు. చాల సులభం. మంచి పిల్లవాడుగా ఉండటం నేర్చుకోవడమే, అంతే."

"నేను మంచి వాడిని కానా?"

"ఎలా గవుతావు. నువ్వెప్పుడైనా చెప్పిన మాట వింటేనా? మంచి వాళ్లు చెప్పినట్టు వింటారు"

"నేను ఎన్నడూ చెప్పినమాట వినను"

"మంచి పిల్లవాళ్లు చదువుకొంటారు, పని చేసుకొంటారు, మరి నీవో!..."

పిల్లలు వ్రాసిన కథలు •

ఉప్పు గొప్ప

చిరంజీవి చాగంటి భీమశంకరరావు

అనగాఅనగా, ఒక వూళ్లో వొక రాజుగా రుండే వారు ఆయనికి మంచి అందమయిన నలుగురు కూతుళ్లుండేవారు. వాళ్లంతా హాయిగా వుంటూండేవారు.

ఒకనాడు రాజుగారు పెద్దఅమ్మాయిమేడలోకి వెళ్లి కాసేపు ఏవేవో మాట్లాడి "అమ్మాయీ, నే నెల్లాంటి వాడిని" అన్నారు. "నాన్నా, నువ్వేమోనేం యింతక్కు పంచదారపానకంలాంటివాడవు" అని రాజుగారి వొళ్లో కూర్చుని రొట్టలేస్తూ చెప్పింది.

రాజుగారు సంతోషిస్తూ రెండో కూతురుమేడలోకి పోయి వెనకటిలాగే అడిగారు. దానిమీద రెండో కూతురు "నాన్నా, నిన్ను చూస్తేనేం మరి షర్బత్తు తాగిన టుంటుంది" అని కళ్లు మిటకరిస్తూ చెప్పింది.

ఆఖరంగా రాజుగారు మూడో కూతురుదగ్గరికి పోయి అడిగారు. "నువ్వంటే తేనెలాంటివాడవు నాన్నా" అంది. అల్లాగే రాజుగారు నాలుగోకూతుర్ని ప్రశ్నించారు. అందుకు నాలుగోకూతురు "ఉప్పంత విలువగలవారు మీరు అంది మెల్లగా. మీరు లేనిది ఎవరి పనీ గడవదన్న అర్థంలో.

అది విని రాజుగారు ఉప్పంత తక్కువదానితో పోల్చిందని, కోపంతో ఆమాటలు అపార్థం చేసుకొని, అగ్నిమీద గుగ్గిలంలాగ మండిపోయి "అడవిలోకి పంపించేస్తా నుండు కుంకా! నీకు వుప్పుగా వున్నానేం" అని తిట్టిపోసి నౌఖర్లచేత అడవిలోకి పంపించేసేరు.

పాపం ఆ అడవిలోనే ఒంటిగా పండ్లు తింటూ భయంతోనే కొన్ని రోజులు గడిపింది. సింహాలూ, పెద్దపులు ఎక్కడో దూరంగా అరుస్తూంటే భయం తోటి వణికిపోయేది. తరవాత ఓరోజుని మధ్యాహ్నం గుర్రపుడెక్కల చప్పుడు వినిపించింది. భయమేసి ఒక చెట్టుతొర్రలో దాంకుంది. గుర్రంమీద పోయే ఓతు రాజుకూతుర్ని చూసి గుర్రం దిగి దగ్గిరికి పోయి భయంలేదని చెప్పి తను ఆ అడవిరాజుకొడుకు ననిచెప్పి తనఅడవి యింటికి తీసికొని పోయేడు.

కొన్నాళ్లకి వా రిద్దరు పెళ్లిచేసికొని ఆ అడవిలోనే వోచోట యిల్లు కట్టుకుని సుఖంగా కాపురం చేస్తూండేవారు. ఇల్లా కొన్నాళ్లు గడిచిపోయాయి.

ఒకనాడు మన రాజుగారు వేటకై గుర్రంమీద బయలుదేరి అడవికి పోయారు. ఆ అడవిరాజుగారి కూతు రున్న అడవి ఒకటే. తిరిగి తిరిగి వేటాడి రాజుగారు అలిసిపోయారు. అది మంచి వేసవి కాలం. పొద్దెక్కింది. ఎంత మండుకుపోతోంది. గాడుపు బాగా వేస్తోంది. ఆయనికి మంచి దాహం వేస్తోంది. చుట్టుపట్ల ఎక్కడా నీరు లేదు. ఒక చెట్టు ఎక్కి చూసారు. దూరంగా వొక యిల్లు కనిపించింది. (అది తనకూతురుదే) దూరా న్నుండగానే కూతురు తండ్రి నానవాలు పట్టింది. కూతుర్ని గుర్తుపట్టలేక పోయారు రాజు.

అరుగుమీద కూర్చుని దాహ మిమ్మని అడిగారు. కూతురికి గమ్మత్తు చేయా లని బుద్ధి పుట్టింది. రాజుగారిని లోపలికి తీసుకుపోయి ఒక మంచం మీద కూర్చోపెట్టి లోపలికి వెళ్లింది. ఒక గ్లాసునిండా పంచదారపానకము పోసి తెచ్చి యిచ్చింది. అసలే అలిసిపోయారు. దానిమీద గొంతుక ఆర్చుకుపోతోంది. అంచేత వద్దన్నారు. మళ్లీ వెళ్లి షర్బత్తు యిచ్చింది. అదీ వద్దన్నారు రాజుగారు. మళ్లీ ఈ సారి గ్లాసునిండా తేనే తీసుకువచ్చింది. రాజుగారు విసుగుతో వద్దని దాహ మిమ్మన్నారు. అప్పుడు పుల్లటి గంజిలో యింత వుప్పువేసి తెచ్చి యిచ్చింది. రాజుగారు పూర్తిగా తాగి హమ్మయ్య! అన్నారు.


"ఉప్పుగొప్ప యిప్పటికేనా తెలిసిందా?" అంది రాజుగారి కూతురు. రాజుగారు ఆ అమ్మాయిముఖం కేసి పరకాయించి చూసేరు.


కాస్సేపటిలో రాజుగారి చిన్నమ్మాయి తండ్రిగారి వొళ్లో వుంది. "నిజంగా అవసరం వచ్చేటప్పటికి పానకం, షర్బతు, తేనెల్లాగా వాళ్ల అక్కరకు రారమ్మా" అని వోదార్చేరు.

ఇంతట్లోకే వచ్చిన అల్లుడుతో తన కూతురు మంచితనం తన దుర్మార్గం అంతా చెప్పి రాజుగారు కూతురు అల్లుళ్లతో బయలుదేరి పట్టణం చేరుకున్నారు.

అప్పుడు రాజుగారు చిన్నకూతురికి అల్లుడుకి సగము రాజ్య మిచ్చి సుఖంగా ఉండమన్నారు.

ఈ సంగతంతా పెద్దకూతుళ్లు తెలుసుకున్నారు. చిన్నమ్మాయిని అడవికి పంపేటప్పుడు మా బాగా అయ్యింది శాస్తి అని చంక లెగరవేశారు కాని యిప్పుడు తెల్లమొగాలు వేశారు.





చదువుకొంటాను, బడిలోకి వెళ్తాను. నువ్వు చెప్పినట్టు చేస్తాను. ఏమైనా సరే మనిషిని అవ్వాలి. నన్ను మనిషిని చేస్తానన్నావు కాదమ్మా?"

"నేను అలాగే చెప్పాను. అయితే ఆ యోగ్యతనువ్వు చూపుకోవాలి మరి."

౨

మర్నాడు ఆ వూరిలో బడిలోకి వెళ్లాడు పినాకరావు. ఈ బొమ్మ బడిలోకి వచ్చేటప్పటికి అక్కడ కుఱ్ఱ పిల్లల గోల చెప్పాలి. వాళ్ల నవ్వుకి అంతు అనేది లేకుండా పగలబడి నవ్వారు. కొంటె పిల్లకాయలు ఎంతో అల్లరి చేశారు. ఒకడు టోపీ లాగాడు; ఇంకొకడు చొక్కా లాగాడు; మరొకడు ముక్కు కింద సిరాతో మీసాలు పెట్టాడు. మరో ఆగతాయి కాళ్లకి తాడుగట్టి గంతులు వేయించాలని చూశాడు.

కొంతసేపటిదాకా, పినాకరావు ఇవేమీ లెక్కచెయ్యలేదు. ఎలాగో కాలక్షేపం చేశాడు. కాని మరీ శ్రుతి మించేటప్పటికి తట్టుకోలేక పోయాడు. అల్లరి చేసేవాళ్లకేసి తిరిగి యిలాగన్నాడు:

"ఏయ్! మీకందరికీ నేను హాస్యగాడినీ గంధోళీగాడినీ అనుకొన్నారా, మీయిష్టం వచ్చినట్టు ఆడించడానికి? నేను మీకు మర్యాద చేస్తాను; మీరు నాకు మర్యాద ఇవ్వండి".

"చాల్లేవోయి! చెప్పావు కబుర్లు. పుస్తకంలాగ మాటలాడతావేమిటి?" అని ఆయల్లరి వెధవలు మరింత పిచ్చిగా నవ్వుతూ కూతలు కూశారు.

మరొక కొంటె వెధవాయి చెయ్యి చాపి పినాకయ్య ముక్కు పట్టుకొని లాగబోయాడు. ఇంతలో పినాకయ్య బల్లకింద నించి కాలు సాచి తీసిపెట్టి ఒక్క తన్ను తన్నాడు. దానితో వాడి మోకాలుచిప్ప ఎగిరిపోయింది.

"అబ్బా! ఇనపకాళ్లురా బాబు" అని దెబ్బ తగిలినచోట చేతులు రాసుకొన్నాడు.

"వాడి మోచేతులు మరీ బలంగా ఉన్నా"యని మరొకడు వాపోయాడు. వాడుకూడా ఏదో పట్టుకొని లాగపోతే మోచేతితో పినాకయ్య పొట్టమీద పొడిచేడేమో దెబ్బతో దేవేంద్రలోకం కనిపించింది. ఒక్క తన్నుతోటే, ఒక్కపోటుతోటే పినాకరావు శక్తి పిల్లలకి తెలిసొచ్చింది. దానితో అందరూ స్నేహం అయిపోయారు. పొగడటం ముదలు పెట్టారు. చదువులో కూడా శ్రద్ధ, తెలివితేటలు చూపడం వల్ల, మేష్టారుకూడా పొగడటం మొదలుపెట్టారు. స్కూలుకి వెళ్లడంలోకూడా అందరికంటె ముందు వచ్చి అందరికంటె ఆఖరున వెళ్లిపోయేవాడు.

అంతా బాగానే ఉంది కాని ఒక్క పొరపాటు చేశాడు. స్నేహాలు ఎక్కువయ్యాయి. అందులో తుంటరులు అల్లరి వెధవలు, చదువు అంటే ఇష్టంలేని వాళ్లు ఉన్నారు.

మేష్టారు, చెబుతూనే ఉండేవారు; ఆ సుందరికూడా చెప్పేది: "వాళ్ల స్నేహం చేస్తున్నావు, పినాకయ్యా! చదువంటే యిష్టం అంతా పోతుంది. చెడు స్నేహంవల్లా, చెడ్డ సావాసం వల్లా చెడిపోతావు. అష్టకష్టాలు పడతావు జాగ్రత్తసుమా!" అని ఎన్నో విధాల చెప్పేవారు. "ఆ భయం లేకులే" అని పినాకయ్య బదులుచెప్పి వెళ్లిపోయేవాడు.

ఒకనాడు పినాకయ్య స్కూలికి వెళ్తూవుంటే అతని జతగాళ్లు వచ్చి, "పినాకయ్యా, విన్నావుటోయ్, మన వూరిలో పెద్ద విచిత్రం!"అని చెప్పారు.

"ఏమి టది"

"మన వూరి సముద్రందగ్గరికి పెద్ద పర్వతంఅంత తిమింగిలం వచ్చిందట!"

"తిమింగిలమా? అయితే మా నాన్న నీటిలో మునిగిపోయినప్పుడు వచ్చిన తిమింగిలంలాంటిదేనా?"

"ఏమో మరి చూడాలి! మేం చూడటానికి సముద్రం దగ్గిరికి వెళ్తున్నాము. నువ్వుకూడా వస్తావా యేమిటి మాతోపాటు?"

"రాను. స్కూలుకి పోవాలి"

"స్కూలుకి రేపు పోవచ్చు. ఏం స్కూలు లెద్దూ. ఒక పాఠం ఎక్కువ వచ్చినా రాకపోయినా ఎప్పటికీ గాడిదలలాగే ఉంటున్నాం మనం"

"వెళ్లకపోతే మేష్టారు ఏమీ అనరూ?"

"మేష్టారు అంటూనే ఉంటారు. అలాగే ఆయన ప్రొద్దుటినించీ సాయంకాలంవరకూ వాగుతూ ఉండటానికే ఆయనకి జీతమిస్తారు"

"మాయమ్మ ఏమీ అనదూ?"

"అమ్మకేం తెలుసు పోనిస్తూ" అన్నారు వాళ్లు.

"నే నో పని చేస్తాను. ఇప్పుడు స్కూలుకి వెళ్లి అది పూర్తికాగానే వచ్చి, తర్వాత తిమింగిలాన్ని చూస్తాను" అన్నాడు పినాకయ్య.

"ఓరి వెఱ్ఱినాయనమ్మా! అటువంటి పెద్ద తిమింగిలం మనం వచ్చేవరకు కనిపెట్టుకొని కూచుంటుందా? అది అసలు ఎపుడనగా వచ్చిందో! ఈ పాటికి యీ పూరంటే విసువెక్కిపోతుంది. దీనితర్వాత యింకో చోటికి పోతుంది. నీవు వచ్చేవరకు ఆగుతుందనుకొన్నావా?" అన్నారు.

"అయితే ఇక్కడనించి సముద్రపొడ్డుకి వెళ్లడానికి ఎంతసేపు పడుతుంది?"

"వెళ్లి రావడానికి గంట చాలు"

"అయితే పదండి! ఎవళ్లైతే గబగబా పరుగెత్తుతారో" అని, పుస్తకాలూ, కాపీపుస్తకాలూ చంకలక్రింద పెట్టుకొని ఆ పొలాలకి అడ్డంపడి పిల్లలంతా ఒకటే పరుగు. వాళ్లందరిలోకీ పినాకరావు ముందున్నాడు. అతని కాళ్లకి రెక్కలు కట్టుకున్నట్టు ఎంత వేగం! తనతో పరుగుచ్చుకోలేక వెనకబడి దుమ్ముతో, నాలుక వెళ్లబెట్టుకొని వచ్చేవాళ్లని చూచి పగలబడి నవ్వుకొన్నాడు పినాకరావు. కాని ఆ వెఱ్ఱిబాగులవాడికి ముందుముందు ఎలాంటి కష్టాలు, ఘోరప్రమాదాలు ఎదురోకావాలో ఏం తెలుసు?

బాలగేయాలు

సంక్రాంతి ముచ్చట్లు

శ్రీ గం. వేం. ఆదిశేషనరసింహారావు



౧

పొగడ ఎన్నడు వాడిపోదోయి చెల్లి!
పొగడు: పూసరి దేవు బూజింపు మక్క

౨

పండు పొగడాలనే
నిండు రాసిగ బోసి
దండలనె అర్పింతువా? మంచువా
ముండిగమ్ముల వేతువా?

3

సిగ్గుతో గడపకడ
మొగ్గి తల వంచి తెలి
ముగ్గులనె చిత్రింతువా? సిగ్గతీ!
ఎగ్గులనె వెలయింతువా?

౪

తొలి సంజలో బుట్టి
మలి సంజలో గిట్టి
అలరించు చుక్కలవ్వే! బాల! జీబ్బిలెడు గొబ్బెమ్మలవ్వే!

౫

బొమ్మరిండ్లనె కట్టి
బొమ్మలకు పెండ్లిండ్ల
నెమ్మితో చేయింతువా? అమ్మరో!
మమ్ము విందుల బిల్తువా?

౬

తారాడి పారాడ
పోరాడి నడయాడ
గారాన ముద్దిడెదవా? వారినే
బీరాన గుద్దిడెదవా?

౭

మంచాన పవళించి
కంచాన భుజియించి
మించగా నగుపింతువా? పెంచకల
వంచనల వగపింతువా?

౮

పల్లకినె మీటెదము
పల్లకినె మోసెదము
తల్లి గొబ్బి నెత్తవే! చెల్లెలా!
పల్లె నూరేగింతుమే!

౯

పసుపు కాళ్లకు పూసి
నొసట కుంకుమ పెట్టి
పసి పేరటాండ్ర ఒడులల వానసా
కుసుమాల, పండ్ల, నిడవే!

౧౦

తల మున్గ నీటిలో
అలపు టీతల నోల
జలమాడి చలిది తిందాం! చిలిపి చేష్టల కౌగిలుల నందుదాం!

మన సరిహద్దులు :

శ్వేతజాతిపాలబడని ఏకైక ఆశియా రాజ్యం

ప్రపంచానికి నడిబొడ్డువంటిది టిబెట్ దేశం. ప్రపంచంలోకల్లా ఈ దేశం ఎత్తయినది కావటంవలన ఈ దేశాన్ని "ప్రపంచానికి పైకప్పు" అని పిలుస్తుంటారు. టిబెట్ దేశం సముద్రమట్టానికి సుమారు 16 వేల అడుగులు ఎత్తున వుంటుంది. (మూడు మైళ్ళకుమించి) హిమాలయపర్వతాల వెనకవున్న పర్వతకనుమలలో చదరంగావున్న భాగమంతా ఈ దేశమే. అన్నివైపులా ఎత్తయినకొండలు ఆవరించుకుని వుండటంవలన ఈ దేశపు విస్తీర్ణం కనుగొనటం చాల కష్టమైనపని. సముద్రమట్టానికి 15, 16 వేల అడుగులు పైకి వెళ్ళేసరికి భూమినిండా మంచు కురుస్తుంటుంది. పైగా హిమాలయపర్వతాలకు వెనకాలవున్న దేశం కావటంవలన ఈ దేశవాతావరణస్థితి చాల వింతగా వుంటుంది. సూర్యుడు ప్రకాశిస్తుండగా, చెట్టుక్రిందకుపోతే చలితో గడ్డకట్టుకుపోవటము, ఎండలోనికివస్తే బుర్ర మాడిపోవటము జరుగుతూంటుంది ఈ దేశంలో.

టిబెట్ జనాభా మొత్తం 3 లక్షలు వుండవచ్చును. ఎండకు, చలికి తట్టుకోవటం వీరికి పుట్టుకతోనే అలవాటై పోతుంది. ఇక్కడి ప్రజలు మనకన్నా కొంచెంపొట్టిగా వుంటారు. 5 అడుగుల 5 అంగుళాలు పొడుగు ఉండే వ్యక్తులు తక్కువగా కనిపిస్తారు. స్త్రీలు పురుషులకన్న పొట్టిగా ఉండటం సహజమే కదా. ఈ ప్రజలందరూ మంగోలియన్ జాతికి చెందినవారు. టిబెటన్ జాతి మూలపురుషుడు వానరావతారమెత్తిన అవలోకితేశ్వరునకు, ఒక రాక్షసాంగనకు జన్మించినాడని వీరు విశ్వసిస్తారు. టిబెట్ ప్రజలు తమ దేశాన్ని 'బోధ్' అని పిలుచుకుంటారు. ఈ బోధ్ అనే పేరు అనేక రూపాంతరాలు జెంది టిబెట్‌గా మారిపోయింది.

సాధారణంగా ఎప్పుడూ మంచుతోనే కప్పబడి వుండే రాతినేలపై ఏ పంటలు పండటానికీ అవకాశం లేదు. టిబెట్‌లో చాల ఎక్కువ ప్రాంతంలో అక్కడక్కడ పొదలు తప్ప మరే వృక్ష సంతతీ మనకు కనిపించదు. హిమాలయ పర్వతాల వెనుక కొంత ప్రాంతంలో కొద్ది అడవులు వున్నవి. చైనా సరిహద్దులలో బార్లీ పండుతుంది. టిబెట్ దేశంలో ముఖ్యమైన పంట బార్లీయే. యాక్, అడవి గాడిదలు, అడవిగొర్రెలు, అడవి దున్నలు మొదలైన జంతువులు ఈ దేశంలో వుంటాయి. వీటిలో ప్రజలకు ముఖ్యంగా ఉపకరించేది యాక్ అనే జడల బర్రె. ఈ జడల బర్రె పొలం దున్నటానికి బండ్లు లాగటానికి పనికివస్తుంది; పాలిస్తుంది; దీని మాంసంకూడా తినవచ్చును. టిబెట్ అతి శీతలదేశమై పంటలేమీ పండక పోవటంవలన ఇచ్చటి బౌద్ధ ప్రజలు మాంసం తినక తప్పలేదు. టిబెట్ దేశీయులు ఎక్కువగా వాడే పానీయం టీ. తేయాకు ఆదేశం పొలాలలో ఒక పొద. ఇనపగంగాళాలలో నీళ్ళు పోసి, ఈ ఆకు వేసి ఎప్పుడూ కాగబెడుతూంటారు. అవసరమైనప్పుడు తెడ్డుతో కొంచెం నీళ్ళు గ్లాసులో పోసుకుని యాక్ వెన్న, పాలు కలుపుకొని తాగుతారు. వీరు తయారుచేసే టీలో వెన్న వేసుకు కాగితే చాల హుషారుగా వుంటుంది. మన దేశంలో నవనాగరికులు కాఫీ, టీలు రోజుకు 4,5 సార్లు గుక్కెడు తాగుతారు. టిబెట్‌లో ప్రజలందరూ రోజుకు 40,50 గ్లాసులు టీ త్రాగి తీరవలసిందే! ప్రజల దుస్తులు దేశస్థితికి తగినట్లుగా వుంటవి. ప్రజలు ఎంతబీదవారైనా సరే మోకాళ్ళవరకు పొడుగుచేతుల చొక్కాలు తొడుక్కోవలసిందే. మతబోధకులు నేలమీద జీరాడేటంత పొడుగుచొక్కాలు తొడుక్కుంటారు. చలికాలంలో గొర్రెతోలుతో తయారుచేసిన గుడ్డలు కట్టుకుంటారు. ఇవి కొనుక్కోలేనివారు గొర్రెతోలు అంచుకైనా కుట్టించుకుంటారు. భాగ్యవంతులు సిల్కులు కూడా ధరిస్తుంటారు.



గత మార్చినెలలో ఢిల్లీలో జరిగిన ఆసియా రాజ్యాల మహాసభకు వచ్చిన టిబెట్ ప్రతినిధివర్గం

మత విశ్వాసం

టిబెట్ ప్రజలకు మత విశ్వాసం చాల ఎక్కువ. క్రీ. శ. 7 వ శతాబ్దంలో ఈ దేశంలోనికి బౌద్ధమతం ప్రవేశించి, క్రమేణా వ్యాప్తిజెందింది. ఈ ప్రజలందరు మహాయాన బౌద్ధులు. కొంతకాలానికి బౌద్ధమతము, స్థానిక మతాలతో కలసి సంకరమైపోయి జీర్ణావస్థలో వుండగా, 'పచ్చటోపీలవా'రనే ఒక కొత్త రకం వారు బయలుదేరి బౌద్ధాన్ని నిలబెట్టారు. ఈ 'పచ్చటోపీ'లకు నాయకుడు సన్‌కాపా. ఈయన నాయకత్వాన బౌద్ధం 1358 వ సం.లో తిరిగి నెలకొల్పబడింది. ఇంతకుపూర్వం బౌద్ధమతాధికారులు వివాహాలు చేసుకుంటూండేవారు. ఈయన ఏర్పరచిన నూతన బౌద్ధమతం ప్రకారం మతాధికారులెవ్వరూ వివాహ మాట తలపెట్టనే కూడదు. ఆమ్‌కాపా తరువాత గ్రాండెన్ తుప్ప ఈ మతాధికారం వహించి ఒక పెద్ద బౌద్ధసంఘ ఆరామం కట్టించాడు. ఇప్పుడు తుషీలామా ఆ ఆరామంలోనే వుంటాడు. ఈ తుపప్ప 1474 వ సం.లో నిర్వాణం జెందాడు. కాని ఈయనే, రెండేండ్లయినతరువాత మరల ఒక చిన్నబాలుడుగా జన్మించాడని భావించి, ఆ బాలుని తెచ్చి మతాధికారిని చేశారు. అప్పటినుంచి ఈ విధానం ఆచారంగా పరిణమించి అనుశ్రుతంగా వస్తున్నది. దలైలామా (మతాధికారి, రాజుకూడా ఈయనే) చచ్చిపోయిన తరువాత కొంతకాలానికి ఎక్కడనో పునర్జన్మ నొందుతాడని ప్రజల విశ్వాసం. దేశంలోని మూడు ముఖ్యసంఘారామాలు. సుప్రసిద్ధజ్యోతిష్కులూ కలిసి ఆలోచించి, దలైలామా ఎక్కడ పునర్జన్మ ఎత్తాడో నిర్ణయించి, ఆ బాలుడిని తెచ్చి కొత్త దలైలామాగా పట్టం కడతారు. దలైలామా పెరిగి పెద్దవాడయ్యేవరకు మతాధికారము, రాజ్యాధికారముకూడా కొందరు 'పెద్దలు' వహిస్తారు. దలైలామా పునర్జన్మ సామాన్యంగా బీదజనుల యిండ్లలోనే జరుగుతున్నది. ఈ దలైలామాకు టిబెట్‌లోనేగాక మంగోలియా, చైనా మొదలగు బౌద్ధదేశాలలో కూడా ఎక్కువ పలుకుబడి వుంటుంది. దలైలామాగా పనిచేసిన వ్యక్తి నిర్యాణానికి అర్హుడై వుండికూడా, ప్రజలను రక్షించటం కోసం పునర్జన్మ ఎత్తటానికి అంగీకరించాడని బౌద్ధులు విశ్వసించి, ఆ త్యాగానికి ఆయనను ఆరాధిస్తారు. ఈ దలైలామా టిబెట్ ముఖ్యపట్టణమైన లాసాలో వుంటాడు. దలైలామా తరువాత హోదాగలవ్యక్తి తాషీలామా. ఈయన షిగత్సే పట్టణంలో వుంటాడు. టిబెట్ ప్రజలలో పురుషులలో దాదాపు నాలుగవవంతు సన్యాసం స్వీకరిస్తారు. మిగిలిన వారికి కూడా మతమంటే

టిబెట్ ప్రజలు: వారి సాంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు

ఎక్కువ విశ్వాసం. పుణ్యస్థలాలకు యాత్రలంటే బహుశః మనదేశంలోకన్న, ప్రపంచంలో అన్ని ఇతర దేశాలలోను ఎక్కువ భక్తి శ్రద్ధలు చూపిస్తారు. టిబెట్‌లో ప్రతి వ్యక్తీ యాత్రాపరుడే. కొత్తగా టిబెట్ వెళ్ళినవారు యాత్రీకులను తేలికగా పోల్చుకోవచ్చును. ఇంటిదగ్గర బయలుదేరినప్పటి నుండీ, యాత్రాస్థలం చేరే వరకు యాత్రికుడు అడుగడుగునా ప్రాణాచారం పడుతూంటాడు. అందువలన యాత్రాస్థలం ఎంత తక్కువదూరంలో వున్నా, యాత్ర వెళ్ళిరావటం 4, 5 ఏండ్లు పడుతుంది. బౌద్ధసన్యాసులకు ప్రత్యేక ఆరామాలుంటవి. వీటిలో కొన్నింటిలో వెయ్యమంది సన్యాసులు ఉండటానికి కూడా అవకాశం వుంది.

ప్రజలు: తరగతులు

టిబెట్ ప్రజలను నాలుగు విభాగాలుగా విభజించవచ్చును : రాజులు, వర్తకులు, వ్యవసాయదారులు, గొఱ్ఱెల కాపరులు. గొఱ్ఱెలకాపరులు సాధారణంగా ఒక చోటినుండి ఇంకొక చోటికి తిరుగుతుంటారు. వీరు యాక్‌బొచ్చుతో తయారుచేయబడిన కంబళ్ళతో గుడారాలు వేసుకొని వానిలో నివసిస్తారు. చైనా సరిహద్దు ప్రాంతాలలో, సముద్రమట్టానికి 14 వేల అడుగులకన్న తక్కువవున్న ప్రాంతాలలో కొన్ని పంటలు పండుతవి. అక్కడ వ్యవసాయానికి యాక్ జడల బర్రెల నుపయోగిస్తారు. బార్లీ ముఖ్యమైన పంట. కూరగాయలు, కొన్నిరకాల పండ్లుకూడ పండుతవి. ధనవంతులు వర్తకం కూడా చేస్తుంటారు. బజార్లలో కొట్లల స్త్రీలు తప్ప పురుషులు కనపడనే కనపడరు. బౌద్ధసంఘ ఆరామాలన్నీ వర్తకం చేస్తుంటవి; ఇందుకొరకు ఆరామాలలో ప్రత్యేక ఉద్యోగులను కూడా నియమిస్తారు. ఒక వ్యక్తి పుట్టుకతోనైనా రాజు కావచ్చును. దేశానికి చేసిన సేవవల్ల 'రాజ'త్వం పొందనైనా పొందవచ్చును. దలైలామా పునర్జన్మ పొందినప్పుడు, ఆవంశం వారందరూ రాజులైపోతారు ఒక్కసారిగా! రాజులందరు సామాన్యంగా లహాసాలోనే ఉంటారు. వీరికి సాధారణంగా పని ఏమీ ఉండదనే చెప్పాలి. పొలం ఏమైనా ఉంటే అది కూలీలే వ్యవసాయం చేస్తుంటారు. టిబెట్‌లో ఈ కూలీల వ్యవస్థ చాలా తమాషాగా ఉంటుంది.

పురుషులు చాలమంది సన్యాసం పుచ్చుకోవటంవలన భూమి గున్నవారు చాల తక్కువమంది వున్నారు. కూలీలు దొరకటమే కష్టం. ఒకవేళ ఒక కూలీ దొరికాడంటే ఇక వాడిని వదిలించుకోవటం అసాధ్యమే. ఒక యజమాని దగ్గర పనిచేస్తున్న కూలీ వెళ్ళిపోవాలంటే అతడు 'విడాకుల'కు దరఖాస్తు పెట్టుకోవాలి. ఆ దరఖాస్తుతోపాటు ఒక పెద్దమొత్తం డబ్బు లంచంకూడా యివ్వాలి. ఈ లంచం పుచ్చుకుని యజమాని కూలీని వదిలిపెట్టటానికి నిరాకరిస్తాడు. అంతే, ఆ కూలి ఇక పనిలో వుండిపోవాలిసిందే! టిబెట్‌లో బానిసలు చాల తక్కువ. కాని బానిసలకు కూలీలకన్న ఎక్కువగౌరవముహోదా వుంది.

స్త్రీలు

టిబెట్ సామాజికవ్యవస్థలో స్త్రీలకు చాల ప్రముఖస్థానమున్నది. ప్రపంచంలో ఏ దేశంలో కూడా స్త్రీలకు అంత హోదా లేదనే చెప్పాలి. సామాన్య గృహవిషయాలలోనేగాక, రాజకీయ వ్యవహారాలలో కూడా, ఉద్యోగులు, మంత్రులు అందరూ తమ భార్యల ఆజ్ఞలను పాలించవలసిందే! టిబెట్ లామాల అధికారంక్రిందకు రాకపూర్వం, అనేక తెగలుగా వుండి, ఒక్కొక్క తెగను ఒక్కొక్క నాయకుడు పరిపాలిస్తుండేవాడు. ఆ నాయకులందరు స్త్రీలేనట! తండ్రికి మగసంతానం వుంటే, కూతురుకు ఆస్తిలో కొద్దిభాగం మాత్రమే యిస్తారు. కాని తండ్రికి మగసంతానం లేకపోతే ఆస్తిఅంతా ఇతర వారసులకు పోకుండా కూతురుకే వస్తుంది. చిత్రమేమంటే,

[20 వ పేజీ చూడుడు]

పరిషన్నిర్వాహకులకు నిర్మాణాత్మక కృషి, దీక్ష అవసరం

ఆంధ్ర నాటకకళా పరిషత్తు కార్యకలాపాల సమీక్ష

శ్రీ మద్దాలి సత్యనారాయణశర్మ



పుస్సూర్యారు కుమారరాజు

ఆంధ్రనాటకకళాపరిషత్తు 14-వ వార్షిక మహాసభలు రేపటినుంచీ బెజవాడలో జరుగనున్నవి.

స్థాపితమై 20 సంవత్సరాలు పూర్తికావస్తూన్న 14-వ వార్షికోత్సవం జరుపుకొంటున్న ఈ పరిషత్తు ఎందుకు ఏర్పడిందో, ఇంతవరకూ ఏమి చేసిందో, ఇకముందు ఏమిచేయాలో ఇప్పుడొకసారి సమాలోచన చేసుకొనడం అప్రస్తుతం కాదు.

పార్సీ నాటక కంపెనీల ఆంధ్రదేశ పర్యటన ప్రభావంవల్ల కట్టుదిట్టాలతో ఏర్పడిన 'ఆంధ్ర నాటకరంగం' ఆదిలో కొంతకాలం సక్రమంగా నడిచినా రాను రాను 'కిరాయినాటకాల' 'బూటకరంగం'గా పరిణమించి ఆదర్శ ఆశయ విహీనమైపోతూండగా కొందరు అభిజ్ఞులు, రసజ్ఞులు ఉద్ధరణావశ్యకతను గ్రహించి, అందుకు పూనుకోవడంవల్ల ఈ పరిషత్తు ఏర్పడింది.

పరిషత్తు మహాసభలకు అధ్యక్షత వహించిన కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు, తాడిపత్రి రాఘవాచార్య, గోవిందరాజుల వెంకటసుబ్బారావు, యడవల్లి సూర్యనారాయణ, బెజవాడ రామచంద్రారెడ్డి, దేవరకొండ వెంకటసుబ్బారావుగార్లు మొదలైన వారు ఆయా సందర్భాలలో చేసిన ప్రసంగాలూ, ఆయా సభలలో చేసిన తీర్మానాలూ చూస్తే పరిషత్తు లక్ష్యం, ఆంధ్రదేశంలో ఆదర్శ నాట్యరంగం నిర్మించడమూ, ఉత్తమ, ఆధునిక నాటకరచనను ప్రోత్సహించడమూ, నాట్యవిద్య శిక్షణాభ్యాసాలకు అవకాశాలు కల్పించడముద్వారా ఆంధ్ర నాటక కళోద్ధరణ అని స్పష్టపడుతుంది.

తెనాలిలో జరిగిన ప్రథమ మహాసభనుంచి ఇంతవరకూ జరిగిన మహాసభ లన్నిటిలోనూ ఈ లక్ష్యసాధన నిమిత్తం ఎంతోమంది కళాభిజ్ఞులనూ అభిమానులనూ కూడగట్టుకొంటూ, అందుకు అనుగుణమైన తీర్మానాలు చేస్తూవచ్చినా కూడా చాలావరకూ లక్ష్యం లక్ష్యంగానే ఉండిపోయిందనడానికి సందేహించ నక్కరలేదు. ఈ నాటి వరకూ ఆదర్శనాట్యరంగం ఏర్పడ లేదు. శిక్షణాభ్యాసాల అవకాశాలున్నూ ఏర్పడలేదు. కాకే, సుమారు రెండు సంవత్సరాల క్రితం గుడివాడలో జరిగిన మహాసభలో ఒక కొత్త నాటకానికి బహుమతి ఇవ్వడం జరిగింది.

ఇంతకు మించి పరిషత్తు ఏమీ చేయలేకపోయిందనే అనవచ్చు. ఆంధ్రనాటకరంగం ఈనాడు కూడా 'కిరాయి నటకుల' 'బూటక రంగం' గానే వుంది. పుష్కరం కిందట ఏ నటకులు ఏవిధంగా ఏనాటకాలు ప్రదర్శిస్తూండేవారో ఆ నాటకాలనే దాదాపు అనటులే అంతకన్నా అధ్వాన్నంగా నేడు ప్రదర్శిస్తున్నారు. ప్రజలు మామూలు 'వేలంవెర్రి'తో ఆ నాటకాలనే చూస్తూ తోచిన విధంగా కాలక్షేపం చేస్తున్నా, పై విన్యాసం, వివరణా ఎక్కువగా వుండే వివిధభాషల సినిమాలపై ఎక్కువ మోజు చూపుతున్నారు. వారి అభిరుచులలో మార్పు కనపడడంలేదు. ఏ కొంతైనా కనపడితే అది ఇంకా అధోగతిలోనేవుంది కాని ఉన్నత మార్గాన లేదు. నటకులు కళాపరిషత్తు తమ స్వంత సంస్థ అనీ, తమ అభ్యున్నతి కోసం, సౌభాగ్యం కోసం కృషి



గా॥ శ్రీ గోపాలరెడ్డి



ఆదర్శ నాటకశాలకోసం-కలవరిస్తూ కన్ను మూసిన కళా ప్రపూర్ణ రాఘవ

చేసే సంస్థ అనీ ఈనాడుకూడా భావించుకోలేక పోతున్నారనడంలోకూడా అసత్యంలేదు. అసలు సంవత్సరానికి ఒకటిరెండు తడవలు 'ఆంధ్రనాటక కళాపరిషత్తు ఫలానావారి అధ్యక్షతను, ఫలానావూళ్లో సమావేశమై ఈ దిగువ తీర్మానాలు చేసింది... ఈ దిగువవారికి సన్మానాలు చేసింది.' మొదలైన వార్తలు పత్రికలలో పడినప్పుడు తప్ప మిగతా అప్పుడు పరిషత్తు అంటూ ఒకటున్నదనీ, అది ఫలానాఅందుకు కృషి చేస్తున్నదనీ అన్న భావం ప్రజలలోనే స్పష్టంగా కనిపిస్తోంది. ఈవిధంగా పరిషత్తూ, దానిలక్ష్యమూ, 'ఎక్కడున్నావే గొంగడీఅంటే వేసినచోటే వున్నా'ననే స్థితిలో వున్నాయి.

ఇందుకు కారణం? ప్రధానమైనది—నిర్మాణాత్మక కృషి విషయంలో నిర్వాహకుల దీక్షాలోపం అనవచ్చు. దీక్ష వుంటే ప్రధానలక్ష్యసాధనకు అంగాలుగా నిర్ణయించుకొన్న అంశాలలో ఏది ముందు ఏది తర్వాత అన్నది నిర్ధారించుకొని, ఒకటితర్వాత ఒకటిగా సాధించడానికి ఒక చక్కని ప్రణాళిక ఏర్పరుచుకొని అవసరమైన వారి సహాయ సహకారాలు పొందుతూ కృషిచేయడం జరిగేది. ఆరీత్యా లక్ష్యానికి ఎంతో కొంతైనా చేరువ అయేవారు.

అసలు ఈ కార్యక్రమం అంతా అటుంచి, ఇప్పుడున్న నాటకాలనే, ఇప్పటి నటులే కొంచెం శ్రద్ధ, ఆసక్తి, అభిరుచి చూపి మేలితరంగా ప్రదర్శించేటట్లున్నూ, ఆవిధంగా ప్రేక్షకుల అభిరుచులు అభివృద్ధి అయేటట్లున్నూ సులభంగా చేయవచ్చు. ఇందుకు కావలసింది దేశంలోని నటులనందరినీ కాకపోయినా ముఖ్యులు పలుకుబడి కలవారు అయిన కొందరినైనా కూడగట్టుకోవడం మాత్రమే. ఇదైనా సాధించలేకపోతే ఇంతకుమించినవాటికోసం ప్రయత్నించడం పరిహాసాస్పదమేమో.

ఇదికాక, పరిషత్తు ఒక నాటక సమాజం ఏర్పాటుచేసి ఉన్నవాటిల్లోనే సాలుకొక మంచి నాటకం తీసికొని అవకాశమున్నంతలో ఆదర్శ ప్రదర్శనాల ద్వారా నటకుల, ప్రేక్షకుల దృక్పథాలు, అభిరుచులలో మార్పుతేవడం ద్వారా ప్రధాన లక్ష్యసాధనకు కృషిచేయవచ్చు. ఇది అసాధ్యం కాదు సరేకదా, పరిషత్తు సమాజం కంటె మంచి ప్రదర్శనాలు ఇచ్చేందుకు మిగతా నటులను ప్రోత్సాహపరిచి, మళ్ళీ కట్టుదిట్టమైన సమాజాలు ఏర్పడేందుకూ, ప్రదర్శనాలు బాగుపడేందుకూ దోహద మవుతుంది.

ఇటువంటి ప్రాథమిక ప్రయత్నాల వలన ప్రధాన లక్ష్యమైన ఆంధ్రనాటక కళోద్ధరణ సులువుగా జరిగి తీరుతుంది. సందేహం అక్కరలేదు. పరిషత్తువారు ఈ సంవత్సరపు మహాసభలోనైనా, పైన వివరించిన సూచనలను గమనించి, నిర్మాణాత్మక కృషికి పూనుకొని, వెంటనే ఆచరణసాధ్యమైన సంస్కరణలు ప్రారంభించి, ప్రధానలక్ష్యాన్ని నిదానంగా నైనా సుష్ఠుగా సాధించడానికి ఉపక్రమిస్తారని ఆశిస్తాను.

ఈ యేడాది మహాసభల సందర్భంలో ఆదర్శ నాటకమందిరానికి శంకుస్థాపన జరుగుతుందని తెలసింది. ఏది చేపట్టినా అది పూర్తి అయే వరకూ వేరొకదానివైపుకు పోకుండడమే కార్యశూరత్వానికి నిదర్శనంగా వుంటుంది. పరిషన్నిర్వాహకులు ఇది మనసులో వుంచుకొన కోరుతాను.



శ్రీ కొత్తపల్లి లక్ష్మయ్య



శ్రీ శాంతారాం



చెన్నరాష్ట్ర ముస్లిములు

అయ్యా,

1947 ఆగస్టు 15 వ తేదీ మనకు స్వరాజ్యం లభించిన పుణ్యదినము. ఆనాడు నుండి మనం ప్రపంచంలో ఒక నూతన మానవజాతిగ పరిగణింప బడుచున్నాము. అదికాలముననే పాకిస్తాను రూపములో రెండుగచీలిపోయింది భారత దేశము. ఆ మరుక్షణమే మతబధిరత్వము పెనుభూత రూపము దాల్చి హత్యాకాండ ప్రారంభమైనది. అది యేనాటికీ సమసిపోయే విధానము కనబడడంలేదు. ఈ సందిగ్ధసమయములో మైనార్టీల ప్రాణాలు నిరాశలో పడిపోయాయి. ముస్లింలీగ్ను పేరుతో మహమ్మదీయులు విడిపోవడము, తాము మైనార్టీలుగ యున్న రాష్ట్రాలలోని ముసల్మానులు చాలా పట్టుదలగ కృషిసాధించుటయు దీనికి ముఖ్య కారణములు. ఏదైతే పాకిస్తానుగ విడిపోయినదో ఆస్థానమున తీసుకు వ్యతిరేకముగ ప్రత్యక్ష ముసల్మానులు జరుపుకొనిన సంగతి మన కందరికి తెలిసినదే. వారు సంబంధించిన చెన్నరాష్ట్రములో నూటికి 8 గురు గల ముసల్మానులు అతి బలీయమైన ప్రచారము చేసి ముస్లిం లీగుకు 29 స్థానాలు జయించామన్న సంతసమే గాని ముసల్మానులు ఏనాడూ ప్రధాన మంత్రిత్వమునకు నోచుకోలేవనే పరిజ్ఞానము లేక పోయింది.

ఈనాడు చెన్నరాష్ట్రములోని ముసల్మానులు అతీతమైన ప్రమాదస్థితిలోయున్నారు. దీనికి పాకిస్తాను చేరువుగలేదు. మహమ్మదీయ పరిపాలనా సంస్థానమైన హైదరాబాదు చుట్టూ ఇండియన్ ప్రభుత్వం ఆవరించియున్నదదొకటే కాక సంస్థానములోని హిందూ ప్రజాసంఖ్య నూటికి ఎనభయి వంతునయున్నది. కాలము మారినది. ప్రజారాజ్య స్థాపనకు జనులు తమ ప్రాణాలను లెక్కచేయని కాలమిది. ఇట్టికాలాన ఆ సంస్థాన భావి పరిస్థితి ఏతీరునుండునో తెలియదు. ఇలాంటి దేశ కాలపరిస్థితిలో లియాఖత్ అలీఖాన్ ఇండియన్ యూనియన్లో ఇస్మాయిల్ అధిపత్యమున లీగు స్థాపించుననడం శోచనీయం. భారతయూనియన్ నాయకులు అజాదు ప్రాతినిధ్యమున జాతీయ ముస్లిముల సంస్థ నియమించమనడం దినపత్రికలలో చూస్తూనేయున్నాము. ఒకనాడు ఏకకంఠముతో పాకిస్తాను కోరి ప్రత్యర్థులుగ నిలచి నిగ్రహించిన ముస్లిములు తమ విధానమును మార్చుకొన్నగాని ప్రతికక్షిగ యున్న ప్రజలలో అంకురించిన అనుమానసంశయములు తుడిచివేయ సాధ్యముగాదు. గాన నా రాష్ట్ర ముస్లిం ప్రజలకు నామాటగ చెప్పునది మన ప్రభుత్వము పట్ల మాపే సానుభూతి విశ్వాసము ద్వారా నానాటికి మనపైనున్న దురభిప్రాయము సమసిపోవలయును. అది మనకు సుసాధ్యము యావద్భారత భూమిలో ప్రతి రాష్ట్రము మతకల్లోలములకు పాల్పడినదే. ఒక చెన్నరాష్ట్రమే అటువంటి దురవస్థకు గురికాలేదు. పార్టీలు ఏ రూపాలు పొందినా, ప్రజా సామరస్యము, ఐక్యత మన రాష్ట్రంలో నశించలేదు. చెన్నరాష్ట్ర ముసల్మానులందరు ప్రభుత్వముపట్ల సానుభూతి ఆదర్శమైన తోడ్పాటూ చూపుట విధియై యున్నది.

రానున్న రాజ్యాంగ విధానము సోషలిజం గాన ఆ విధానము పూర్తిగ అవగాహన చేసుకొని, పండిత జవహర్లాల్ నెహ్రూను ఏకైక నాయకుడుగా బలపరుస్తూ, దేశం ఐక్యతకు కృషిచేసి ఈ ఆశ యిూడేరేవరకు ముస్లిం లీగున కిచ్చిన ప్రాధాన్య మన సోషలిస్టుసంస్థకిస్తూ శక్తివంచన లేకుండా పాటుపడవలసిన విధి చెన్నరాష్ట్ర ముసల్మానులదై యున్నది. ఇంతకన్న గత్యంతరములేదు.

హుస్సేన్ షా

సరిహద్దునిరూపణసంఘంవారి కర్తవ్యము

అర్యా, మద్రాసూ, తత్పరిసరప్రాంతాలూ ఆంధ్రులకే చెందియున్నవని నిరూపణ చేయుటకు సరిహద్దు నిరూపణసంఘం ప్రముఖులతో కూడి పని ప్రారంభించుట విని ఆనందించని ఆంధ్రుడుండడు. ఈ సంఘం ఒక్క జనాబా లెక్కలు సేకరించుటతో పనిపూర్తి అయినట్లుగా భావింపరాదు. నగరంలోని కళాశాలలలోనూ, హైస్కూళ్ళలోనూ, విద్యార్థు లెందరు? వీరిలో ఆంధ్రు లెందరు? నగరం వ్యాపారంలో ఆంధ్ర జిల్లాలతో వ్యాపారం ఎంత? తమిళ జిల్లాలతో ఎంత? ఎన్ని ధర్మసంస్థలు గలవు? ఇందులో తమిళు లెన్ని, ఆంధ్రు లెన్ని నడుపుచున్నారు. స్కూళ్ళలో స్కాలర్ షిప్పులు, సత్రములు, దేవాలయములు మొదలగునవి ఎన్ని గలవు. నగరాన్నిగూర్చి శాసనాలు ఎన్ని గలవు? తమిళంలో, తెలుగులో ఎన్ని గలవు? ఈ వివరాలన్నీ సేకరించాలి.

1812 ప్రాంతములో మెకంజీ దొరచేత వ్రాయించబడ్డ వ్రాతప్రతులు నగరంలోని ఓరియంటల్ గ్రంథాలయములో గలవు. రాష్ట్రంలో వివిధభాగాల్లో ఏ ఏ ఆచారపద్ధతులు, భాషలు గలవో అవన్నీ అందులో వ్రాయించాడు మెకంజీ. ఇట్లు వ్రాయించబడిన ప్రతులు 62 గలవు. అందులో 40 ప్రతులు సైన ఆంధ్రములోనూ, 12 అరవభాషలోనూ 4 కన్నడభాషలోనూ, 10 మిగిలిన భాషల్లోనూ ఉన్నాయి. వీటిలో గంజాంజిల్లాలో నిరుపితుల్యనదలగాయతు చంగల్పట్టు జిల్లాలో దక్షిణ ప్రదేశమువరకు తెలుగువారిది అని గలదు. గ్లిన్ గార్లో అను ఆంగ్లేయపరిశోధకుడు "మద్రాసులో తొలుదొల్త నివాస మేర్పర్చుకున్నవారు ఆంధ్రులు గాని అరవలు గాదు" అని వ్రాశాడు. అధినివేశ ప్రభుత్వంవారిచే నియమింపబడబోవు సరిహద్దు నిర్ణయసంఘం ఏర్పడునాటికి ఈ వివరాలన్నీ సేకరించి మద్రాసు, పరిసర ప్రాంతాలూ తెలుగువారికే చెంది ఉన్నవని రుజువు పరచుటకు తోడ్పడ కార్యకర్తలకు విన్నవించుచున్నాను.

డా. ముక్తేవి శ్రీరంగాచార్యులు,
తెనాలి.

* * *

గ్రామోద్యోగులు: స్థానికసంస్థలు

ఆర్యా,

గ్రామోద్యోగులు తమ జీతములను పెంచవలసినదని చేయుచున్న ఆందోళనను ప్రభుత్వము పెడచెవిని పెట్టుచున్నది. వీరిపని ఇతర ప్రభుత్వోద్యోగుల పనికంటె కష్టతరమైనదని ప్రభుత్వము గ్రహించుటలేదు. వీరి ఉద్యోగములు బ్రాంచి పోస్టు మాష్టర్లు, గ్రాంటు స్కూలు ఉపాధ్యాయుల ఉద్యోగముల లాంటివి. వారు స్థానిక సంస్థలలోను, గ్రామసంఘాలలోను చేరవచ్చును. కాని గ్రామోద్యోగు లట్లు చేయుటకు వీలులేదు. పూర్వపు గ్రామోద్యోగి పదవి గౌరవముగా నుండెడిది. ఇప్పుడు చాల హేయమైన పనిగా మారినది. గ్రామ మునసబులు సెలవు పెట్టి స్థానిక సంస్థలలో పనిచేయుటకు ప్రభుత్వము అవకాశము కల్పించింది. కాని గ్రామకరణములకు మాత్రము అటువంటి అవకాశములేదు. వీరి కీయబడు జీతము ఒక మానవుని జీవనమునకు సరిపడకున్నను, వారసత్వముచే వీరు ఉద్యోగములు చేయుచున్నారు. కొందరు అధికార్లు వీరిని నౌకరులుగా చూచుచున్నారు. గ్రామకరణములు గూడ స్థానిక సంస్థలలోను, గ్రామసంఘాలలోను పాల్గొనుటకు ఉత్తరువు లీయవలసినదిగ ప్రభుత్వమును కోరుచున్నాను.

గాదిరాజు సింహాద్రిరావు,
నెల్లూరుజిల్లా గ్రామోద్యోగుల సంఘ కార్యదర్శి.

నిర్బంధ విద్యావిధానము

ఆర్యా,

ఈ సంవత్సరం కర్నూలు జిల్లాలోగూడ నిర్బంధప్రాథమిక విద్య ప్రవేశపెట్టబడెను. కాని తగిన కట్టుదిట్టములు లేకపోవుటవలన విద్యావిధానము సరిగా పనిచేయుటలేదు. బడికి వెళ్లు వయస్సుగల పిల్లలను బడులకు పంపవలెనని ప్రభుత్వము ఉత్తరువు చేసింది. కాని ఎవరూ తమ పిల్లలను బడులకు పంపుటలేరు. ప్రభుత్వము అట్టివారిమీద తగు చర్య తీసికొనుటలేదు. కాబట్టి, పిల్లలను బడులకు పంపనివారిపై కఠిన చర్య తీసుకొనెదమని ఉత్తరువుచేసి విద్యావిధానము జయప్రదముగ అమలు జరుపవలెనని ప్రభుత్వమును కోరుచున్నాను.

గుర్రం వెంకటరెడ్డి.

* * * *

సింగిల్ టీచరు పాఠశాలలు

ఆర్యా,

ఉపాధ్యాయుల పాలిట, నేటి సింగిల్ టీచరు పాఠశాలలు, జైళ్ళుగా పరిణమించినవి. ప్రస్తుత ప్రభుత్వపు ఉత్తరువుప్రకారం సింగిల్ టీచర్లు పనిచేయుటకు వీలులేకుండా ఉన్నది. వీరు ఎంతో కష్టపడి పనిచేయాలి. క్యాజువల్ లీవులు వాడుకొనుటకు వీలులేదు. ఒకవేళ వాడుకున్నను మరల ఆ దినములు పనిచేసి భర్తీ చేయవలెను. ఇంత కష్టపడి పనిచేసినప్పటికీ వీరి జీతము బహుతక్కువ. విద్యాభివృద్ధి చేయాలని ప్రభుత్వము ప్రయత్నిస్తోంది కనుక వీలైనచోట్ల యిద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. వీలు లేనిచోట్ల ఉపాధ్యాయుడికి వేతన మతగినంత యివ్వాలి.

బొడ్డుపల్లి గోపాలరాజు.

సంకీర్తన కవులు

ఆర్యా,

తంజావూరు సరస్వతీ మహలు భాండాగారములో కృష్ణమాచార్యులుగారిచే రచింపబడిన "విష్ణునామ సంకీర్తన" మను గ్రంథము ఉన్నది. అందులో పొదకమూరి భాగవతులు అహోబళ స్వామిని తెరవెనుక భాగవత మాడించినట్లు, ఆ సమయమున ఒక బాలకుడు వచ్చి శ్రీ కృష్ణమాచార్యులవారి ఒడిలో కూర్చొని యున్నట్లు తెలుపబడి యున్నది. ఈ కుర్రవానిగూర్చి శ్రీ కృష్ణమాచార్యులవారును, పొదకమూరి భాగవతులును వారితాలూకు అని వీరు, వీరి తాలూకు అని వారు భ్రమపడినారని, చివరకు ప్రసాద స్వీకరణ సమయములో కుర్రవాని ప్రశంస వచ్చి, స్వామియే బాలకుని రూపమున దర్శనమిచ్చుట తేల్చుకొనబడెనని, అది పొదకమూరి భాగవతుల ప్రభావమని కృష్ణమాచార్యులు, శ్రీవారిప్రభావమని పొదకమూరి భాగవతులు ఒకరిమొదల ఒకరు ప్రశంసాదరాభిమానములు వెలిబుచ్చుకొన్నట్లు వివరింపబడి యున్నది.

ఈ సందర్భములో "వెంకటేశ్వర విన్నపములు" అని యొక గ్రంథమునుగూర్చి ముచ్చటించవలసివచ్చుచున్నది. ఈ "వెంకటేశ్వర విన్నపములు" కర్త ఎవ్వరో తెలియదుగాని వచన రచనలో యీశైలి నిరుపమానము. నవనాగరికత పద్ధతిలో నున్నది. విష్ణునామ సంకీర్తనలోను, వెంకటేశ్వర విన్నపములోను "ఇంద్రజిత్తు తల గుండుగండ" "మాయా మారీచ మృగ వేటకాడ" యను పదజాలములు దొర్లుటబట్టి. యీ వెంకటేశ్వర విన్నపములే యొకవేళ కృష్ణమాచార్యులచే లిఖింపబడి యుండునాయని సందేహము పొడముచున్నది. వెంకటేశ్వర విన్నపముల గ్రంథకర్త యెవ్వరో పత్రికాముఖమున ప్రకటింప ప్రార్థితులు. శ్రీ బాలకృష్ణయ్యగారు గావించిన సంకీర్తన కవికాలనిర్ణయమునకి "విష్ణునామ సంకీర్తన" అంతగా తోడ్పడదుగాని, గ్రంథము కృష్ణమాచార్యులవారిచే రచింపబడినట్లు స్పష్టముగా నున్నది. ఈ విషయమై సింహాచల ప్రాంతీయులు యెక్కువగా తోడ్పడగలరని, యిట్టి సాహిత్యసేవకు పూనుకొనెదరని ఆశిస్తున్నాను.

తంజావూరు, } పి. వి. సుబ్బారావు

గొప్పవారితో గుసగుసలు

కుమ్మరి మొల్ల

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[ఒక చెరువుప్రక్క గలవృక్షాలు పూలమొక్కలు ఉన్న తోటలో నొక కాలువగట్టున కూర్చున్న నన్ను సమీపిస్తూ కుమ్మరిమొల్ల—]

మొల్ల : (నమస్కరిస్తూ) ఏం నాయనా, నన్నాహ్వానించారు?

నే : తమరు నమస్కారం మానేసి, యేకవచనాన్ని ప్రయోగిస్తేగాని నేనేమీ మాట్లాడను.

మొ : అదేమిటి మీరు బ్రాహ్మణులు; మేము కుమ్మర్లం.

నే : అయితే నేమమ్మా? నాకంటే పెద్దలు అన్నివిధాలా.

మొ : ఐతేమటుకు కుల మెక్కడికిపోతుంది? మీరు దణ్ణాలు పెడితే అందుకోవడం, పేర్ల చివర రావు ల్దగిలించుకోవడం, మీచేత బహువచన ప్రయోగా లందుకోవడం అవన్నీ మా కాలపువాండ్లకే తగిపోయింది. మే మేదో పాతకాలపువాండ్లం, మూర్ఖప్రపంచ సంబంధీకులం, మా వ్యక్తిత్వా న్నట్లా నడవనీండి.

నే : తమ వినయం నాకు ముచ్చటగా వుంది. కాని, ఐనా నా పట్ల నేను కోరిన చనువును జూపించండి.

మొ : సరే, నీకంత పట్టుదలెందుకు, అల్లాగే కాని, నన్ను పిల్చిన కారణమేం నాయనా?

నే తమ రాంధ్రంలో కవిత్వం జెప్పారు కాదూ?

మొ నన్నా నా కవిత్వాన్నే చెప్పు నాయనా! ఆంధ్రంలో కవిత్వం చెప్పి నలుగురి మెప్పు పొందుదామని ఆశపడ్డ మొదటి స్త్రీవ్యక్తిని నేనే ననుకుంటా. అదీ నాకేం పాండిత్య పటిమగాని, కవితాధోరణిగాని వుండి పడ్డ ఆశ కాదు. చిన్నప్పుడు నా కెంతసేపూ చదువుకుందా మని వుండేది. మా వృత్తిలో త్రిప్పడం కోసం మా అమ్మ కుండలిస్తే రెండుమూడుసార్లు నా చేతుల్లో పగిలిపోయాయ్. అది చూచి మా అమ్మ తిడ్తూంటే, మా వూళ్లో నొక బ్రాహ్మణ పండితుడు కనిపెట్టి నాకు చదువు చెప్తా రమ్మని, కొంతకాలంలో పంచకావ్యాలు పట్టించారు. ఆయనగారికి ఆంధ్రంలో భారత భాగవతాలంటే ప్రాణం. వారు రోజూ చదువుతుంటే వినేదాన్ని. కొంతకాలానికి శ్రీ సరస్వతీ కటాక్షం వల్ల నాకు పద్యా ల్రాయడ మలవడ్డది. అప్పట్నుంచీ యే కథ వ్రాద్దామా అనుకుని, రామకథమీదికి మనస్సు ప్రాకితే దాన్ని వ్రాయడ మారంభించి పూర్తిచేసా. అదే నాయనా నే వ్రాసిన గ్రంథం. అట్టే గొప్పదేంగాదు.

నే· చిత్తం. తమరా గ్రంథం విషయంలో పడ్డ ఆశ నెరవేరలేదా?

మొ నెరవేరకేం?

నే. అంటే నాకర్థంగాలా!

మొ : అర్థం కావడానికేముంది నాయనా! నే నాడదాన్ని, నా కవిత్వమంత పటుత్వమైంది కాదు.

నే : అదేమిటండీ, ఆడవారు చెప్పిన కవిత్వమని తప్పక మెచ్చుకోవాలే?

మొ : ఆడది కుండ ల్తోముకోక కవిత్వం చెప్పడ మేమిటి యీ మాత్రం పద్యాలు చెప్పకపోతే భాషకేం లోపమవుతుందాని మా కాలంలో నోరుగలవాండ్ల ఊహ. నీవన్న భావం మీ కాలంలో ప్రబలినంత మాకాలంలో ప్రబలలా.

నే : అదేం మాటండీ? నాయకురాలి వీరత్వం పొగడ్తకెక్కలా?

మొ : నాయనా, ఇది కవిత్వంగా. నాయకురాలి ధైర్యస్థైర్యాల్లాగ నా కవిత్వం మగాళ్లను ముల్గూర్చోపెట్టేది కాదుగా.

నే : పోరబాటున నాయకురాలి సంగతి కదిపా. స్త్రీ కవనాన్ని సున్నితమైన విషయముగా నెంచకపోవడం పౌరుషలోపం.

మొ : ఈ భావాల్నే టివిగాని, నాటివి కావు.

నే : అంచేత తమకో ర్కెడేర లేదన్నమాట!

మొ : ఈ డేరకే? నే ననుకున్న మాదిరిగా నీడేరలా. పామరుల్లో డొక్క శుద్ధియైన వాండ్లంతా అభిమానించి మొల్లమ్మ గారు చక్కని కవనం జెప్తా రని పొగిడేవారు. ఆ పొగడ్త నాకు రుచిస్తుందా నాయనా: ఎవడైనా పండిత కవి అనేదాకా?

నే : ఓహో! (కొంచెముండి) నా కిప్పు డర్థమౌతూంది. అదా తమకు నొప్పి గలిగించింది! కొన్ని శతాబ్దాలైనా యింకా మరపు పుట్టించంది! చిత్తం, దాన్ని మరిచి యింత సేపు తరచినందుకు నన్ను క్షమించండి.

మొ: అయితే నేం చివర కాశల్య మూడ్చారనుకోండి. నేటికి స్వర్గంలో కనుపించినపుడలా యెందరున్నా "మొల్లా: నే నెంత తొందరబడి నిన్నట్లాగంటిని!" అని నొచ్చుకుంటా రనుకోండి ఏం లాభం! ఆవాళ నలుగుర్లో తలవంపులైంది కదా?

నే : పోనీండమ్మా! ఎవరో ఒక రనక పోతే మునిగిపోయిందా, ఆంధ్రలోకమంతా ఏకగ్రీవంగా. మొల్ల రామాయణం బాగుంటుందంటూంటే?

మొ : ఔననుకోండి! ఆ సభలో నసభ్యవాక్యం బుట్టిందా, లేదా?

నే: అనకూడదనుకోండి. అయినా మర్నాడు...

మొ : ఆఁ, ప్రొద్దున్నే వచ్చారు: కూర్చున్నారు: చదువమన్నారు. అన్నపానాదులు మరచి సాయంత్రం దాకా కూర్చుని విన్నారు. ఏమైనా ఆడదాన్నని అంత నిరసన చేసారు దా అని.

నే : పోనీండి. ఆయన్తో నేమైంది. మా కాలంలో దేశంలో జాజ్జట్టిందిగాని ఎందరో పురుషు లుంటే, ప్రపంచంమరమ్మకుకోసమేర్పడ్డ సభలో నా విజయలక్ష్మీ పండిట్ అనే స్త్రీరత్నమే భరతఖండం తరఫున వాదప్రతివాదాలు నడిపి పేరొందింది! కాప్టెన్ లక్ష్మి అనే యామే ఝాన్సీ సైన్యాని కధ్యక్షురాలై పేర్గాంచింది! ఆడవాండ్ల నట్లా నిరసించినందుకు మగాళ్ళ కిప్పుడు సిగ్గొచ్చింది.

మొ : సిగ్గు గావడ మేమిటి కానీండి. మీ కాలంలో మావాళ్ళు మగాళ్లకు మల్లే సర్వవిషయాల్లో శక్తిమంతుల మని నిరూపించారు. అంత పని మేమూ చేయలేకపోలా—కాలానికి మా కమరినసంఘస్థానానికి కట్టుబడ్డాంకాని. అప్పటికీ మాలో కొందరు శ్రీ రుద్రమాదేవి ఝాన్సీలక్ష్మీభాయంటివారు కొంత సాహసించారు.

నే : తమరేదో రెండు పేర్లు మాత్రమే చెప్పారు. ప్రపంచచరిత్ర పరిశీలిస్తే పేరొందిన కాంతామణులు కొన్ని వేలుండుటారేమో? ! అంతవరకెందుకు? తెల్లాళ్ళ సిద్ధాంతాల్నిజమైతే మానవసంఘంలో నొం ప్రథమంలో సర్వాధికారమాడవాండ్లదేమో! తమరుస్వర్గంలో నుంటారుకదా! వారిలో సర్వజ్ఞు లుంటారంటారు వాళ్లో నే పెద్దనైనా అడిక్కనుక్కోకపొయ్యారా?

మొ : మీ కీవాం ఛుండడం సహజమే కాని ఆ దీడేరడానికొక్క అభ్యంతరముంది. వారంతా సర్వజ్ఞులేగాని వాళ్లో నెవరైనా పలకరించే వీలుందా? అట్లాటిదేదైనా వాళ్లో నెవరినైనా కదిలించడంతోటే చిరు నవ్వు నవ్వి మరొక విషయ మెత్తుతారు. నా రెంతసేపటికీమానవులు తమకు భగవంతుడు కటాక్షించిన శక్తిసామర్థ్యాలతో సకలము దెలుసుకొన ప్రయత్నించాలని వుంటుం దనుకుంటా. అట్లా లేకుంటే మనకున్న యే కొద్దిపాటు పనులో పూర్తైం తర్వాత మనకు కాలక్షేపమెటాగా అని ఊహిస్తారనుకుంటా. అట్లాటివిషయాలు మా కవరికైనా తెలిపితే మే మీలోకానికి రాకపోకలేసేవాండ్లం గాబట్టి వాటిని మే మిక్కడ బైటబెడ్తే తమ యుద్దేశం చెడుతుందని అమానిస్తా రనుకుంటా. కాబట్టి మీ రన్నటువంటి రహస్యాలు మీ ఊహాపోహల్తో కనుక్కోవలసినట్లే తోస్తుంది. మీరు పైనన్న విషయం పాశ్చాత్యు లొకమాదిరిగా నను కుంటారు; ప్రాచ్యులింకొక మాదిరిగా ననుకుంటారు. అది సంప్రదాయా న్ననుసరించి వుంటుంది. అంతా పౌరుషేయమని వారు అపౌరుషేయమని మనము అనుకుంటూంటాం.

(ఆకాశంనుండి) మొల్లా, శచీదేవిగారి ఆజ్ఞ!

మొ : (ఆతురంతో లేచి) నాయనా వెళ్ళొస్తా. (నిష్క్రమణ.)

నే : అరే! మిగతా వారంతా కొంత తనివితీర మాట్లాడివెళ్లా రీమెగారు హఠాత్తుగా వెళ్లారు. పోనీ, ఐనా మన మడగాల్సిన విశేషమున్నాయీమెను? పాప మేదో కవిత్వం జెప్పారుకాని తా మెన్నడు నే విషయంలోనూ ఘనుల మనుకోలా. సరే, యింకా కవులలో నెవరు మిగిలున్నారు. మిగులకేం? చాలామందున్నారు కాని, పైవారి పంథల నడిచినవారేగాని వారిలో స్వతంత్రు లెవరూ కాన్పించరు. మనకాలంలో వారిని కదిలిద్దామంటే లాభంలేదు; పైనబడి కరుస్తారు; కొడ్తారు గూడాను—లేకపోతే పాకిస్థాన్‌వారి లక్షణాన్ని గ్రహించి పొడిచ్చంపినా చంపుతారు వీరు మనల్ను ఏదిబడితే అదడిగేమాత్రంవాడా అని. అదొక తేనెతెట్టెను కదలించినట్లవుతుందితేనె దొరకదన్న మాటగాని. సరే ఇకచక్రవర్తుల నాహ్వానిద్దాం. ఇంతతో ఆగుదాం.


ఇంకోసారి ఎప్పుడైనా?

ప్రథమభాగం సంపూర్ణం

(ప్రస్తుతానికి గుసగుసలు ఇంతతో ఆపుతున్నాం)

—సంపాదకుడు.

సాహిత్య మీమాంస:



రసగుళిక

శ్రీ పిల్లలమర్రి హనుమంతరావు

"జలజాతాసన వాసవాదిసురపూ
జాభాజనంబై తన
ర్చు లతాంతాయుధు కన్నతండ్రి శిర మ
చ్చో వామపాదంబునం
దొలగం ద్రోచెలతాంగి; యట్లయగు; నా
థుల్నేరము ల్సేయఁబేర
లుకం జెందిన యట్టి కాంతలుచిత
వ్యాపారము ల్నేర్తురే!"

ఇది ముక్కుతిమ్మన వ్రాసిన పారిజాతాపహరణములోని పద్యం. పారిజాతాపహరణం స్వతంత్రాంధ్రప్రబంధాలలో పేరెన్నికగన్నది. ఈ ప్రబంధంలో ప్రథమాశ్వాసంసహృదయహృదయరంజకంగా ఉంటుంది. ఇలా అన్నంతమాత్రాన మిగిలిన కావ్యాన్ని అధఃకరించినట్లు భావించరాదు—ప్రధానంగా ప్రథమాశ్వాసం మనోహరమైందని ఉద్దేశం.

పై పద్యం ప్రథమాశ్వాసాని కంతటికీ కేంద్రంలాంటిది. అందుచేత ప్రధానమైనది. ఈ పద్యం, పూర్వోత్తర కథల్ని తెలుసుకోడానికి ప్రేరణ కల్గిస్తుంది. అంతేకాక ఈ పద్యంలో ప్రస్ఫుటంగా ప్రత్యేకశిల్పం పొడకట్టుతుంది.

'శ్రీ కృష్ణమూర్తియొక్క శిరస్సు ఎడమకాలుతో సత్యభామ తన్నింది'—అనే భావాన్ని అందిస్తుందీ పద్యం. ఇది ఒక్క వాక్యంలో చెప్పదగింది. ఇల్లా కృష్ణుడి శిరస్సును తన్నింది అని చెప్పడంలో కవిత్వమేముంటుంది గనుక? అందుచేత ఈ వాక్యానికే పోకులు దిద్దాడు కవి. నగిషీలు చెక్కాడు అదేరాతికి. నగిషీ చెక్కకముందు ఉత్త రాయి ఆకర్షించదు. చెక్కినతర్వాత దానికో జీవం వస్తుంది.

అల్లాగే భావాన్ని పొందించడంలో ఉంటుంది కవిప్రతిభ. 'కృష్ణుడి శిరస్సును తన్నింది' అని చెప్పే యీ పద్యం కథాంశాన్ని ప్రస్తావిస్తున్నది. కథాకథనం ఇతిహాసాల్లో ప్రాధాన్యాన్ని వహిస్తుంది. ప్రబంధంలో కూడా కథ చెప్పడం అంటూ ఉండక పోదు. కాని, ఆ కథ చెప్పే సందర్భాలలో ప్రతిచోట ఆగి ప్రబంధకవి సూక్ష్మాంశాన్ని కూడా వర్ణించి, చిత్రించి, దానికొక రూపం కట్టి మనకందించడానికి పూనుకుంటాడు. ప్రస్తుత పద్యంలో ఇలాంటి పూనిక అగుపిస్తుంది.

అతన్నినటువంటి శిరస్సు ఎలాంటిదో, ఒక పెద్ద విశేషణాన్ని పొందించి, తెలిపాడు కవి. 'జలజాతాసన వాసవాదిసురపూజాభాజనంబై తనర్చులతాంతాయుధుకన్నతండ్రి శిరము' అది! మామూలు తలకాయకాదు. బ్రహ్మ-ఇంద్రుడు మొదలగాగల దేవతలయొక్క పూజకు ఆస్పదమైనటువంటిది ఆ శిరస్సు! లతాంతాయుధుడైన మన్మథునికి కన్నతండ్రి శిరస్సు అది! బ్రహ్మాది దేవతలంటే సామాన్యులు కారుగదా! అల్లాంటి వాళ్ళు పూజించే యోగ్యతకల వస్తువు కుండే మహాత్మ్యమెంతటిదో కదా! పైగా మన్మథుని తండ్రి అంటే లోకాని కెంత పూజనీయుడో గమనించండి. అంతటి మహనీయమైన శ్రీకృష్ణుడి శిరస్సు సుమా అని కవి రూపించే నిమిత్తం ఒకటిన్నరపాదం వాడుకున్నాడంటే అందులో ఔచిత్యాన్ని పరికించండి.

అసలు అవయవాలన్నిటిలో ఉత్తమమైన అంగం శిరస్సు. ఉత్తమాంగానికున్న గౌరవం ఇంతా అంతా కాదు. ఇది ఇల్లాగుండగా అంతటి వాని ఉత్తమాంగాని కెంతటి గౌరవముంటుందో వివేచించుకోవాలి. అంత ఘనత కల్గిన ఆ శిరస్సును 'లతాంగి వామ పాదంబునం దొలగం ద్రోచినది'. ఎంతటి అపచారం! ఇంతకన్నా తప్పిదమంటూ ఉంటుందా? అనే భావం వెంటనే చదువరులకు కలుగకమానదు. ఎంతగా తనకు వశ్యుడైనా శ్రీ కృష్ణమూర్తిని సత్యభామ అంత చుల్కనగా చూస్తుందా? చూడడంకాదే? తన్నుతుందా? నా మొగుణ్ణి నేను తన్నుకున్నానంటే ఊరుకుంటుందా లోకం? సత్యకొక్కదానికేకాదు నాథుడు; లోకనాథుడాయన! లోకానికేం సమాధానం చెప్తుంది మరి? దీన్ని కవి చక్కగా భావించాడు. నేనన్నా లేవమ్మా లోకానికి చెప్పడానికి, అని తిమ్మకవి చెప్పాడు. సత్యభామ ఉచితానుచితజ్ఞానం లేనటువంటి దని దూషించే వాళ్ళనోళ్లను కట్టివేశాడు చూడండి: "నాథుల్నేరము ల్సేయఁ బేరలుకం జెందినయట్టి కాంతలుచితవ్యాపారము ల్నేర్తురే" అన్నాడు.

ముందు నేరంచేసినవాడు నాథుడు. అది కారణంగా కాంత పేరలుక చెందింది. ఇలాంటి సమయంలో ఉచితవ్యాపారం గమనించలేదంటే అది అసమంజసం కాదంటాడుకవి. అసలు నాథుడెందుకు నేరం ఆచరించాలి? పారిజాత కుసుమాన్ని రుక్మిణికే ఎందుకియ్యాలి? ఇస్తే ఇచ్చాడు. ఆ సందర్భాన 'ఆ మతకరివేలుపుందపసి (నారదుడు) సత్యనెందుకు స్మరించాలి? మగడు చనవిచ్చిపుచ్చుకోడం ఏటివ్యాయం? ప్రాణసదృశబంధువైన పతియే "కడుమేరదప్పిన" కులకాంతకు గతి వేరే ఉన్నదామరి?— ఇవన్నీ సత్యభామ మనసులో రేకెత్తినభావాలు. పేరలుక తెప్పించినవి ఇవే. సత్యమనసు కని

రసగుళిక

(19-వ పేజీ తరువాయి)

పెట్టిన తిమ్మకవి కావ్యంలో ఈ భావాల్ని వెలువరించాడు. కవి సత్యభామ పక్షాన్ని వహించి 'నాథు త్నేరముత్నేయ......సేరుకే' అని అర్థాంతరన్యాసంతో సమర్థించాడు సత్య చర్యను.

ఇలాంటి ప్రణయకలహం శ్రీకృష్ణదేవరాయలకూ ఆయన భార్యకూ జరిగిందనీ ఆ సంఘటనే దేవేరి ప్రీతి కిమిత్తం ఇలా కవి పారిజాతాపహరణకావ్యంలో పొందించాడనీ ఒక పుక్కిటి పురాణముంది. ఏది ఎట్లాగయినా, ఈ పద్యం మాత్రం అద్భుతమైంది. సత్య ఉచితానుచితాల్ని తెలియనిది కాదని ఇందులో నిరూపించి పాత్రపోషణ నెరపినాడు; బాగా కోపం వచ్చినపుడెంతటి అనుచితకార్యాన్నైనా స్త్రీలు చేస్తారని చెప్పడంతో సత్య అనుచితకార్యాన్నే చేసిందని తెలిపాడు; అకాచిత్యం అంతకన్నా ఉండబోదని తెలపడానికే ఎడమకాలుతో అంతటి మాహాత్మ్యం కల్గిన శిరస్సును తన్నిందని విశేషణాలను పొందించాడు!

ఇలా విశేషణాలచేత పద్యభావానికి దీప్తి కల్గించాడు కవి. వామపాద మెంత నోము నోచుకుందో అందరికీ తెలిసిందే కదా? అంతటి గౌరవం కల శిరస్సును ఇంతటి లాఘవంగల పాదంతోనా తన్నడం? అనే తారతమ్య పరిశీలన పాఠకుడి హృదయాన్ని హత్తుకోవాలి. లేకపోతే ఈ పద్యంలో ఉన్న చిత్రణం నిష్ప్రయోజనకారి అవుతుంది. ఇది తెలుసుకుంటేనే కవి శిల్పచాతురి తెలుసుకున్నట్లు!

ఇంకా పద్యంలో రెండు పదాల్ని వదలిపెట్టాం. వాటి సొగసు కూడా గమనించాలి. 'లతాంగి'—'తొలగంద్రోచె' అనే పదాలవి. ఈ పదాలు తోణికిసలాడే సౌందర్యాన్ని ప్రసాదిస్తున్నాయి. నిజానికి సత్య కృష్ణుడి శిరస్సును తన్నలేదు. తొలగం ద్రోసినది!—ఇలా అనడంలో 'తన్నింది' అన్నపుడు మనకు కలిగే వేధ కల్గదు. "తన్నింది" అంటే తత్పరిణామంగా కలిగే బాధ 'తొలగంద్రోచె' అంటే కల్గదు. ఆ శిరస్సును తొలగునట్లుగా త్రోసింది. అంతే! నెమ్మదిగా—పాదముతో ప్రక్కకు నెట్టింది—అని మాత్రం అవగతమౌతుంది.

'లతాంగి' అనే పదాన్ని వాడడంలో చక్కని ఔచిత్యం ఉంది. ఎన్ని లేవు స్త్రీ పర్యాయపదాలు? సింహమధ్య-గజయాన-కంబుకంఠి-నితంబిని-రంభోరు-కాంత-ఇలా--ఎన్నైనా ఉన్నాయి. ఇవన్నీ స్త్రీ శబ్దవాచకాలైనప్పటికీ ప్రత్యేకంగా ఒక్కొక్కపదం ఇచ్చే అర్థాన్ని బట్టి భిన్నిస్తున్నాయి. సింహం-గజం మొదలైన భావాలను గనుక స్ఫురింపజేసే పదమేదైనా పై పద్యంలో ఉపయోగించినట్లయితే రసభంగమయ్యేది. 'లతాంగి' అనే పదమే తగి పోయిం దీ భావాన్ని పొందించేందుకు. లతలాంటి అవయవాలు కనుకనే బాధ కల్గించకుండా మెల్లగా తొలగునట్లుగా ప్రక్కకు నెట్టిందా శిరస్సును. మరోపదమైనట్లయితే ఈ లాలిత్యం పొసగదు. 'లతాంగి వామపాదం'—మృదుత్వాన్నీ, సౌకుమార్యాన్నీ ప్రసాదిస్తున్నది. 'తొలగంద్రోచె'—లాలిత్యాన్నీ, నిదానాన్నీ అందిస్తున్నది. ఇలా ఈ రెండు పదాలూ విశిష్టమైన ఔచితి కలిగినటువంటివి.

ఈ విధంగా పై పద్యం చక్కని శిల్పం కలిగినటువంటిది. ప్రబంధశాముద్ర పద్యంలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. పాత్రచిత్రణం, విశేషణాలపొందిక, భావస్ఫోరకత్వం ఒండొంటికి మెరుగులు దిద్దుతూన్నాయి ఈ పద్యంలో. ఇది ఒక రసగుళిక!

టిబెట్ చరిత్ర

(16వ పేజీ తరువాయి)

ఆమె భర్తవచ్చి ఆమె యింట్లోనే కాపురం చెయ్యాలి. ఆమె పేరే పెట్టుకోవాలి. ఆమె చెప్పినట్లే నడుచుకోవాలి. పురుషుడు ఎంతమంది స్త్రీలనైనా పెళ్లి చేసుకోవచ్చును. అట్లాగే స్త్రీకూడా, ఎంతమంది భర్తలనైనా పెళ్లిచేసుకోవచ్చును. అయితే వారందరూ జన్మతః సోదరులై వుండాలి. ఒక అన్నగారిని పెండ్లిచేసుకున్న స్త్రీ, తమ్ములనందరినీ కూడా పెండ్లిచేసుకున్నట్లే భావిస్తారు. పురుషులలో నాలుగోవంతుమంది సన్యాసం పుచ్చుకునేది బౌద్ధమతంలో విశ్వాసం వుండా, లేక స్త్రీలతో పడలేకనా అని సందేహం వస్తున్నది. టిబెట్ స్త్రీలకు మన స్త్రీలకు వలెనే నగలంటే చాల ప్రీతి. అయితే వారు మన స్త్రీలకన్నా రెండాకులు ఎక్కువే చదివారు. టిబెట్ స్త్రీలకు అందమైన తలపాగాలంటే చాల మోజు. మెడలో వేసుకునే హారాలూ అవీ గాక ఒక 'తాయిత్తుపెట్టె' కూడా కట్టుకుంటారు. ఈ పెట్టెలోని తాయిత్తు వారికి శుభాలను ప్రసాదిస్తుందని వారి నమ్మకం.

చరిత్ర

చాలకాలంవరకు టిబెట్ స్వతంత్రదేశంగానే వుంది. కాని 19-వ శతాబ్దంలో కొంతకాలం నామమాత్రంగా చైనా సామ్రాజ్యంలో టిబెట్ అంతర్భాగంగా వుంది. రాజ్యపాలన దలైలామా నిర్వహిస్తాడు. ఈయనకు సహాయం చెయ్యటానికి ఒక శాసనసభ వుంటుంది; మంత్రులుంటారు. ప్రభుత్వోద్యోగులందరు రాజుల కుటుంబాలకు చెందినవారే. 1788-వ సం.లో నేపాల్‌లో రాజ్యాధికారం వహిస్తున్న గూర్ఖాలు టిబెట్‌పై దండెత్తివెళ్లారు. కాని, టిబెటనులు, చైనావారు కలసి వీరిని 1792-వ సం.లో ఖాట్మండూసమీపంలో పూర్తిగా ఓడించారు. చైనాకు, భారతదేశానికి జరిగినయుద్ధం ఇది ఒక్కటేనేమో! ఒకప్పుడు టిబెట్ రాజొకడు భారతదేశంలో నేపాల్‌గుండా ప్రవేశించి, బెంగాల్ ఆక్రమించుకుని, బంగాళాఖాతానికి టిబెటన్ సముద్రమని పేరుపెట్టాడట! ఈ కథకు భారతదేశ చరిత్రలో ఆధారాలేమీ లేవు. 1841-వ సం. కాశ్మీర్‌నుంచి డోగ్రాలు టిబెట్‌పై దండెత్తివెళ్ళి, ఓడిపోయివచ్చారు. ఇట్లాగే చైనాకూడా చాలమార్లు టిబెట్‌పై దండెత్తటము, లాసా వశపరచుకొని, తన ప్రతినిధులను నియమించుటయు జరిగింది. కాని ఆసార్వభౌమత్వం ఎంతోకాలం నిలువలేదు. 1904-వ సం.లో బ్రిటిష్‌వారు భారతదేశంనుండి టిబెట్‌పైకి దండెత్తివెళ్లి, బలవంతంగా ఒక సంధి చేసుకున్నారు. కాని 1907-వ సం.లో రష్యన్‌లకు, బ్రిటిష్‌వారికి జరిగిన ఒడంబడిక ప్రకారం టిబెట్ స్వాతంత్ర్యం కాపాడటానికి ఉభయులు అంగీకరించారు. 1912-వ సం.లో చైనాసార్వభౌమత్వంకూడా అంతరించిపోయింది.

సహజసంపద

టిబెట్‌పై గూర్ఖాలు దండెత్తినప్పటినుండి టిబెటన్‌లకు విదేశస్థులంటే చాల అనుమానంగా వుండేది. అందువలన తమదేశానికి, ముఖ్యంగా లాసాకు విదేశస్థుల నెవ్వరినీ రానిచ్చేవారు కాదు. అయితే, టిబెట్‌లో బంగారం ఎక్కువగా దొరుకుతుందని పూర్వకాలం నుంచీ వదంతి. హెరిడోటస్ అనే గ్రీక్ రచయిత, టిబెట్‌లో చీమలు కన్నాలు తవ్వుతుంటూ పైకి తోసివేసే మట్టి బంగారమేనని వ్రాశాడు. 13, 14 శతాబ్దాలలో చైనానుండిగాని, నేపాల్‌నుండిగాని కాశ్మీర్‌నుండిగాని టిబెట్ వెళ్ళిన యాత్రికులు కూడా అక్కడ ఎక్కువ బంగారం దొరుకుతుందనే చెప్పారు. అందువలన ఆ దేశం సంగతి బాగా తెలుసుకోవాలని బ్రిటిష్ వారు కుతూహలపడి, భారతీయులను యాత్రికులుగా పంపటం మొదలుపెట్టారు. వీరు దేశమంతా తిరుగుతూ, ఎంతదూరం వెళ్లిందీ రుద్రాక్షమాలల సహాయంతో అడుగులు లెక్కపెట్టుకుంటూ వెళ్ళేవారట. 1774 వ సం. లో వారెన్ హేస్టింగ్స్ తన ప్రతినిధిని టిబెట్ పంపాడు. అప్పటినుంచి ఇంగ్లీషువారు అక్కడికి పోతూవస్తూనే వున్నారు, క్రమేణా టిబెటన్‌లకు చైనాయెడల వైముఖ్యం ఏర్పడి బ్రిటిష్ వారిపై నమ్మకం కుదిరింది. 1904 వ సం. ఒడంబడిక తరువాత టిబెట్ భారతదేశాలమధ్య వర్తకంకూడా భారీగానే జరుగుచున్నది. ఇప్పుడు భారతదేశం నుంచి లాసాకు తంతి వార్తలు కూడా నడుస్తున్నవి. ఇనుము, రాగి, బంగారము మొదలైన లోహాలు టిబెట్‌లో విరివిగా దొరుకునని కనిపెట్టారు. యుద్ధకాలంలో ఇండియా, చైనాలకు టిబెట్ ద్వారా రోడ్డు వేయాలనికూడా ఆలోచించారు. ఆ రోడ్డు వేస్తే, టిబెట్ మనకు ఇంకా సన్నిహితమౌతుంది.

ప్రయాణాలు

భారతదేశంనుండి టిబెట్ పోవటానికి విమానంలోనైనా పోవచ్చును, లేక హిమాలయపర్వతాలు దాటి నడిచి వెళ్ళవచ్చును. టిబెట్ చూడదలచుకున్నవారందరూ హిమాలయాలు దాటి నడిచేవెడతారు. ఈ ప్రయాణం చాల కష్టమైనదేకాని అది పూర్తిచేసుకుని తిరిగివచ్చిన తరువాత ఆ స్మృతులు ఎంతైనా మధురంగా వుంటవి. టిబెట్ వెళ్ళదలచుకున్నవారు ముందు ఆ ప్రభుత్వపు అనుమతి పొందాలి. ఇది చాల కష్టసాధ్యమైనదే. దేశం చూడటానికి వెళ్ళే యాత్రికులు కొన్ని నెలలకు కావలసిన సామగ్రి అంతా తీసుకువెళ్లాలి. ఇందుకు 4, 5 గుర్రాలు, దారి చూపించటానికి ఒకరిద్దరూ, ఇతర పనులకు మరి యిద్దరూ మొత్తం 4, 5 గురుపరిచారలులుండాలి. టిబెట్ పెద్దలను మీరు చూడటానికి వెళ్లినప్పుడు యివ్వటానికి కొన్ని కానుకలు ఏరి వుంచుకోవాలి. చక్కటి చేతికర్రలు, బొమ్మలు లాంటి చౌకవస్తువులు అక్కడ దొరకవుకాబట్టి వాటిని ఎంతో సంతోషంతో పుచ్చుకుంటారు. కలకత్తానుండి బయలుదేరేవారు అల్మోరా, ఘర్‌వాల్ జిల్లాల సరిహద్దులలో కొండలెక్కటం ప్రారంభిస్తారు. కొన్ని రోజులు కష్టపడి దాదాపు 13 వేల అడుగులు ఎత్తు ఎక్కితే, అక్కడనుండి టిబెట్ సరిహద్దులు ఒక్క రోజులో చేరవచ్చును. ఈ త్రోవలోనే మానససరోవరం కూడా కనపడుతుంది. యాత్రికులు చేరే మొదటి టిబెట్ గ్రామం తక్లకోట. యాత్రికుల సౌకర్యంకొరకు కొన్ని మైళ్ళకొకటి చొప్పున రహదారిబంగళాలు కట్టబడినవి. ఈ బంగళాలలో మకాములు చేస్తూ, లాసా చేరుకోవచ్చు. సముద్రంమీద ప్రయాణం చేసేటప్పుడు కొత్తవారికి వచ్చే జబ్బువంటి జబ్బు ఇంత ఎత్తున ప్రయాణంచేసేటప్పుడు కూడా వస్తుంటుంది. ఇది కొండ చలిజ్వరమని చెప్పవచ్చు. ఆ వ్యాధి నిమ్మళించేవరకు ఒక మకాములో వుండి తరువాత ప్రయాణం సాగిస్తుంటారు యాత్రికులు. దారిలో దొంగల బాధ జాస్తిగా వుంటంవలన యాత్రికులతోపాటు టిబెట్ సైనికులు తోడువస్తుంటారు. హిమాలయ పర్వతాలమీదుగా, భారతదేశంనుంచి టిబెట్, చైనాలకు రోడ్డు వేస్తే, ఈ ప్రయాణం చాల వరకు తేలికగానే జరుగవచ్చును.

"సీతంరాజు"

నేటి ప్రపంచం

(5 వ పేజీ తరువాయి)

ప్రపంచం ఈనాడు అతిప్రమాదకరమైన క్లిష్టపరిస్థితిలో పడిపోయింది. మొన్నటి ప్రపంచ యుద్ధంలో జరిగిన సంఘర్షణలను తలదన్నే భయానకసంఘర్షణలు ప్రస్తుతం జరుగుతున్నవి" అని అమెరికా విదేశమంత్రి జార్జి మార్షల్ సెనేట్ విదేశవ్యవహారాల సంఘ సమావేశంలో ప్రపంచ క్లిష్టపరిస్థితిని సమీక్షచేస్తూ జనవరి 8వ తేదీన హెచ్చరికచేశాడు.

పాలస్తీనాలో యూదు అరబ్‌జాతుల ఘోర సంఘర్షణ, చైనాలో కమ్యూనిస్టు సేనలకు, ప్రభుత్వసేనలకు మధ్య సాగుతున్న భయంకర యుద్ధం, గ్రీసులో మిన్నుముట్టి సాగుతున్న అంతర్యుద్ధం, యూరప్‌ఖండంలో అగ్రరాజ్యవిభేదాల కారణంగా అతివాదమితవాద పక్షాలమధ్య సాగుతున్న ప్రబల సంఘర్షణ, ఇండోచైనా, ఇండొనీషియాలలో ఫ్రెంచి డచ్చి సామ్రాజ్యవాదాలను ధిక్కరిస్తూ సాగిస్తున్న స్వాతంత్ర్య సమరాలు జార్జిమార్షల్ చేసిన హెచ్చరికకు స్పష్టమైన నిదర్శనలు.

గ్రీసులో జనరల్ మార్కోస్ ఆధ్వర్యం క్రింద కమ్యూనిస్టు ప్రాబల్యం గల గొరిల్లాదళాల ప్రత్యేక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడి పరిస్థితి కృతిమించి రాగాన పడుతున్నది. కోనిట్జ్ నగరాన్ని పట్టుకొని అక్కడ తను ప్రభుత్వ రాజధానిని ఏర్పాటు చేసుకోడానికి గ్రీక్ గొరిల్లాలు సాగించిన పోరాటం విఫలమైంది. అయినప్పటికీ గొరిల్లా దళాలు పట్టు విడవకుండా ప్రతిఘటన సాగిస్తూ ఏథెన్సులో వున్న గ్రీక్ ప్రభుత్వాన్ని చిరాకు పరుస్తూ విపరీతమైన నష్టాలు కలిగిస్తూనేవున్నవి. ఇప్పటికరకూ గ్రీసుకు తాము పంపిన ఆర్థిక, మిలిటరీ సహాయమంతా విఫలమైపోతున్నందుకు అమెరికన్ ప్రభుత్వ వర్గాలు విచారపడి నూత్న కార్యక్రమానికి ఉపక్రమిస్తున్నవి. గ్రీక్ ప్రభుత్వాన్ని బాహాటంగా బ్రిటన్ అమెరికాలు, గొరిల్లా ప్రభుత్వాన్ని రష్యాప్రభుత్వం బలపరుస్తున్నవి. తూర్పు యూరప్‌లో కమ్యూనిస్టు ఆధిపత్యంక్రింద నడుస్తున్న రాజ్యాలు, సోవియట్ రష్యా గ్రీక్ గొరిల్లా ప్రభుత్వాన్ని గుర్తించే, బాహాటంగా ముగ్గులోకి దిగే అవకాశం లేకపోలేదు. గొరిల్లా దళాలను అణచివేయడానికి కావలసిన ఆయుధ పరికరాలను సప్లయిచేస్తామని గ్రీస్‌కు వెళ్ళిన ప్రత్యేక అమెరికన్ రాయబారవర్గం మాట ఇచ్చినది. మార్కోస్ ప్రభుత్వాన్ని గుర్తించి, రష్యాకూడా ఇదేవిధంగా గొరిల్లాలకు సహాయపడవచ్చు.

తూర్పు మెడిటరేనియన్ రంగంలో అమెరికన్ నౌకాబలాలు శిక్షణవిన్యాసాలను జరుపుతున్నవనీ, త్వరలోనే 1,000 మంది అమెరికన్ నావికులు టాంకులతో, ఫిరంగులతో, జీపులతో, తదితర ఆగ్నేయాస్త్రాలతోవచ్చి ఈ విన్యాసాలలో పాల్గొనబోతున్నారనీ వార్తలు వస్తున్నవి. గ్రీక్ గొరిల్లా ప్రభుత్వాన్ని ఇరుగుపొరుగున వున్న కమ్యూనిస్టు ప్రాబల్యదేశాలు గుర్తించకుండా భయపెట్టడానికే ఈ అమెరికన్ విన్యాసాలు జరుగుతున్నవట. అమెరికా ఇంత బాహాటంగా గ్రీసుకు సహాయపడుతుంటే, రష్యా చూస్తూ వూరుకోదు. ఐక్యరాజ్యసమితి సభ్యత్వాన్ని వదులుకోడానికికూడా రష్యా సిద్ధపడి వున్నట్లు తెలుస్తున్నది. రష్యాతోపాటు మిగతా తూర్పు యూరప్‌రాజ్యాలు కూడా సమితినుంచి తప్పుకోవడం జరుగుతుంది. దీని ఫలితం అగ్రరాజ్యాలమధ్య బాహాటసంఘర్షణే. గ్రీసుకు ఏర్పడిన ప్రమాదపరిస్థితిని పరిశీలించడానికి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం అవసరంగా జరగాలని సమితి నియమించిన బాల్కన్ విచారణసంఘం సిఫార్సుచేస్తున్నది.

అగ్రరాజ్యాలు బాహాటంగా పాల్గొనడంతో గ్రీసు సమస్య 1936 లో ఏర్పడిన స్పెయిన్ అంతర్యుద్ధ సమస్యమాదిరిగా పరిణమించవచ్చు. స్పెయిన్ అంతర్యుద్ధం ద్వితీయ ప్రపంచసంగ్రామానికి నాందిలాంటిదని తెలిసిన సంగతే.

పాతిక సంవత్సరాల వ్యవధిలో రెండు భయంకర సంగ్రామాలకు గురిఅయిన ప్రపంచం లవలేశమైనా శాంతికి నోచుకోలేదా అనిపిస్తున్నది. ఏది ఏమైనప్పటికీ నేటి ప్రపంచ రాజకీయ పరిస్థితి అతిక్లిష్టపరిణతికి వచ్చింది. రాజకీయాలలో విభేదాలు ఏర్పడడం సహజమే. విభేదాలు లేకపోతే అవి రాజకీయాలే అనిపించుకోని మాట వాస్తవం. వాటిని సవ్యమైన అంతర్జాతీయ ధర్మసమ్మతమైన పద్ధతిలో పరిష్కరించుకోడానికి వివిధపక్షాలూ సుముఖంగా వుండాలి. నీచమైన స్వార్థకాంక్ష కారణంగా ఇట్టి పరిష్కారం అగ్రరాజ్యాలకు సాధ్యపడడంలేదు. అగ్రరాజ్య విభేదాలవల్లనే చిన్న రాజ్యాల పరిస్థితీ, యుద్ధంలో చితికిపోయిన రాజ్యాల పరిస్థితీ మరీ అధ్వాన్నంగా, త్రిశంకుస్వర్గంగా పరిణమిస్తున్నది.

నేడు ప్రపంచాన్ని ఆవరించిన ప్రబల అశాంతికీ, యుద్ధమేఘాలకూ ఈ అగ్రరాజ్య విభేదాలే స్పష్టమైన కారణం.

నాగార్జునాచార్యుడు

శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు యం. ఏ.

సుప్రసిద్ధ చిత్రకారులు శ్రీ అంకాల వెంకట సుబ్బారావుగారు ఆర్య నాగార్జున దేవుని అద్వితవాంధ్రకళాజగత్తులో రేఖావరణమున ప్రదర్శించారు. ఆ చిత్రపటం ఇప్పుడు లండను మహానగరంలో రాయల్ అకాడెమీ ఆధ్వర్య మున వెలసిన చిత్రకళా ప్రదర్శనములో ప్రద ర్శిత మౌతున్నది.

బౌద్ధమత ప్రపంచంలో మాధ్యమికవాదం ప్రతిపాదించిన తత్వవేత్త నాగార్జునుడు. కృష్ణా నదీ తీరాన నేటి గుంటూరు మండలంలో శ్రీ పర్వత పరంపరల మధ్య 'నాగార్జునకొండ' పై ఒకనాడు విలసిల్లిన బౌద్ధసంఘారామమున నివ సించాడు నాగార్జునుడు. నేటికిని నాగార్జున కొండలోయలోని శిల్పశిథిలావశేషాలు ప్రాచీ నాంధ్రౌన్నత్యమును స్వయంవ్యక్తం చేస్తు న్నాయి.

ఒకనాడు ఆ పర్వత పరంపరల మధ్య ఒక విశ్వవిఖ్యాతమైన మహా విశ్వవిద్యాలయం భాసించింది. దానికి నాగార్జునుడు కులపతి. దేశదేశాంతరములనుండి జిజ్ఞాసువులు ఆనాడు కృష్ణా తీరమునకు తరలి వచ్చేవారు. చులకమ్మ గిరిపై గల సింహళవిహారము బోధిశ్రీ సింహళ బౌద్ధభిక్షువుల ప్రత్యేకావాసముగా నిర్మించినది. చీనా, జపాను, స్యామరుద్ధ (సయాము), చంప (ఇండోచీనా), కళింగద్వీపము (జావా), ఇత్యాది దేశాలనుండి యాత్రికులు వచ్చేవారు. నాగా ర్జునకొండ లోయలో రోమకనాణాలు దొరి కాయి. అచ్చటి కంటకశిల విశ్వ వ్యాపార కేం ద్రం. దానినే క్రీ. శ. ప్రథమశతాబ్దిలో గ్రీకు భూగోళజ్ఞుడు టోలిమీ కృష్ణానదీ తీరాన ముఖ్య వ్యాపార కేంద్రము (కంటకోసిల) అని పేర్కొ న్నాడు.

నాగార్జునుడు రసాయనిక వేత్త. ఖనిజశాస్త్ర నిష్ణాతుడు. నాగార్జునకొండ విశ్వవిద్యాలయ మున రసాయనిక పరిశోధనలు సుప్రసిద్ధాలు. ప్రప్రథమమున 'అన్నభేది' (Iron Sulphate) మునిర్మించినది నాగార్జునుడు. అతని 'రసరత్నా కరము' విశ్వవిఖ్యాతిని గడించింది. సుశ్రుత మును పునరుద్ధరించాడు. కక్షపుటతంత్రమును రచించాడు. విషవైద్యములో నాగార్జుని చికి త్సను బాణుడు ప్రశంసించాడు. చీనాదేశంలో శిలాశాసనములపై నాగార్జునుని చికిత్సలు చెక్కించారు. ప్రాచీన వైద్యగ్రంథాలు నాగా ర్జునుని సేవను స్తుతిస్తున్నాయి. నాగార్జునుడు రసవాదములో సిద్ధహస్తుడని ఐతిహ్యంలో కమ్మని కథలు కలవు. మొన్న మొన్నటివరకు 'రసవాదవిద్య' మిథ్య అని పాశ్చాత్యశాస్త్ర జ్ఞులు తలచారు. ఈ దృశ్యమానజగత్తుఅంతా 86 మూలపదార్థాల సంయోగ వియోగ విపరి ణామంవల్ల ఏర్పడిన దని వారి వాదం. ఆ 86 మూలపదార్థాలలో పాదరసం ఒకటి బంగారం ఒకటి. పాదరసం బంగారంగా మార్చటానికి ఎన్నటికీ వీలులేదు. ఇది వారి పూర్వవాదం. కాని నేటి పాశ్చాత్యవైజ్ఞానికులు వారి వాదం ఉపసంహరించుకున్నారు. సిద్ధాంతరూపమున, పాదరసం బంగారం కావచ్చునని 'ఆటము పరి శోధనల'వల్ల అంగీకరించారు. ఐతిహ్యం ముక్త కంఠంతో నాగార్జునుడు స్వర్ణయోగం సాధించా డని ఘోషిస్తున్నది. ఇంతవరకు ప్రపంచ వైజ్ఞానికులు సాధింపలేకపోయిన స్వర్ణయోగం ఏనాడో కృష్ణానదీతీరాన సాధించిన విజ్ఞాని ఆర్య నాగార్జునుడు.

నాగార్జునుని సమకాలికుడైన శాలివాహన చక్రవర్తి నాగార్జున కొండపై సంఘారామం నిర్మించటానికి ఆరంభించాడు. అతని కోశా గారం అంతా వెచ్చించాడుకాని నిర్మాణం పూర్తికాలేదు. అప్పుడు నాగార్జునుడు తన రస వాదవిద్యామహిమచే బంగారం కల్పించి నిర్మా ణాలను నిర్విశేషంగా సాగించాడని కథ. ఈ కథలోని సత్యాసత్యాలను నిరూపించటం ఈనాడు సాధ్యంగాదు. నాగార్జునుడు శాలి వాహనచక్రవర్తికి వ్రాసిన 'సుహృల్లేఖ'ను క్రీ. శ. 7వ శతాబ్దిలో చీనా యాత్రికుడు 'ఇట్సింగ్' సింహళద్వీపంలో చీనాభాష లోనికి అనువదించాడు.

నాగార్జునుడు తర్కవేత్త. అతడు ఎన్నో గ్రంథాలు వ్రాశాడు. అవి నేడు భారతదేశంలో ఉపలభ్యమానాలు కావు. కాని చీనాభాషలో అనువాదరూపంలో నిల్చిన నాగార్జున గ్రంథాలు ప్రజ్ఞాపారమిత శాస్త్రం, ప్రజ్ఞామూల శాస్త్రటీక, ప్రజ్ఞాప్రదీపశాస్త్ర కారికలు, మూల మాధ్యమికశాస్త్రం, శూన్యసప్తాధి, మధ్యాం తానుగమశాస్త్రం, దశభూమివిభాషా శాస్త్రం, ద్వాదశనికాయ శాస్త్రం, వివాద సమానశాస్త్రం, ప్రమాణవిహీతనం, ఉపాయ కౌశల్యహృదయశాస్త్రం, విగ్రహవ్యావర్తిని కారిక—ఇత్యాదులు.

చీనావాఙ్మయచరిత్రలో నాగార్జునుని 'ప్రజ్ఞామూలశాస్త్రం' క్రీ. శ. 196-221 సంవత్స రాలమధ్య హ్యూకంగ్ పరివర్తించినట్లు కలదు. నాగార్జునిని శిష్యుడు ఆర్యదేవుడు సింహళరాజ వంశచరిత్రయైన 'మహావంశ'ము క్రీ. శ. 3 వ శతాబ్దిలో పరిపాలించిన విహారతిష్యునికి సమ కాలీనుడని నిర్వచించుచున్నది. కాబట్టి నాగార్జునుడు క్రీ. శకం ద్వితీయశతాబ్దిలో జీవించి ఉంటా డని నిర్వచింపవచ్చును. క్రీ. శ. 401 సంవత్స రంలో కుమారవిజయుడు చీనాభాషలోనికి నాగార్జునుని గ్రంథాలు అనువదించాడు.

నాగార్జునుడు శూన్యవాదవేదాంతి. "ఈ జగత్తు కేవలము మిథ్యగాదు; కేవలం తథ్యం గాదు. ఇది ఒక పరిమితసత్యం. ఏ పదార్థానికీ నిరపేక్షమైన అస్తిత్వంలేదు. ఈ జగచ్చక్రం సదా ఈ సత్యం కేంద్రంగా పరిభ్రమిస్తుంది. సృష్టిలయాలు, అస్తిత్వ నాస్తిత్వ సంబంధాలు సర్వం మిథ్య కాబట్టి అవి మన భ్రమలకు అద్య ప్రకృతులు అవుతున్నాయి. అశాంతి దుఃఖా లకు ఆలవాలమైన ఈ భ్రమలను మానవులు వీడ లేనంతకాలం సుఖదుఃఖానుభవలోలాక్రీలితమైన ఐహిక, జీవితంనుండి విముక్తి లేదు. పరిమితత్వ మున్నచోట సత్యం ఉండదు. సత్యాన్ని చేర టానికి పరిమితత్వంనుండి విముక్తి కల్గాలి. అప్పుడు సత్యం శూన్యరూపంలో సాక్షాత్కరి స్తుంది. శూన్యం లేదా నిర్వాణం వైరుధ్యాలన్నీ అదృశ్యమైన నిర్వికల్పమైన అపరిమితత్వం" ఇదీ నాగార్జునుని వేదాంతం. ఇతని శూన్య శూన్యవాదం, మిథ్యాతత్వం శంకరాచార్యుల మాయావాదానికి ప్రాతిపదిక. నాగార్జునుడు శంకరాచార్యునికి పూర్వరంగప్రవర్తకుడు.

నాగార్జునుని ఖనిజ రసాయనిక ప్రయోగ శాల, శ్రీ పర్వతబౌద్ధసంఘారామం, శూన్యవాద విశ్వవిద్యాలయం కాలగర్భంలో జీర్ణించి పోయాయి. అమృతయోగాన్ని అందుకొన్న నాగార్జున యోగి కూడ రాజకుమారుని ప్రార్థనచే స్వచ్ఛందంగా భౌతిక దేహం చాలించి నిర్వాణం చెందినట్లు ఐతిహ్య కథనం. ప్రపంచ చరిత్ర నాగార్జునినివంటి పూర్ణ పురుషుని ప్రసాదించటం క్వాచిత్కం. ఆంధ్ర భూమిపై నిలిచి విశ్వవిజ్ఞానజ్యోతిని వెల యించిన ఆర్యనాగార్జునుని అమృతమూర్తిని శ్రీ అంకాల సుబ్బారావుగారు చిత్రించి ప్రద ర్శించారు.

ఆ మహోజ్వల చిత్రం లండను ప్రదర్శనానికి పంపటానికి పూర్వమే నేను దర్శించాను. ఏనాడో కాలపురుషునిలో లీనమైపోయిన ఆర్య నాగార్జునుని భౌతికమూర్తిని ఈనాడు ఎవరు చూడగలరు? సామాన్యజనుల చర్మచక్షువులు చూడలేని అమరమూర్తిని విప్పారిన దివ్యచక్షు వుతో చిత్రకారుడు దర్శింపగలడు. దర్శించిన ఆ అమృతమూర్తిని తిరిగి అంకాల సుబ్బారావు గారు ప్రదర్శించటంలో చూపిన ఉత్తమప్రతిభ నన్ను ఆనందరసపరవశుణ్ణి చేసింది. అఖిలభారత చిత్రకళా ప్రదర్శనాలలో నటరాజ సంధ్యా తాండవం వారికి అగ్రతాంబూలం అందిం చింది. కళాతపస్వియై సౌందర్యద్రష్ట కాగలగ టమే కాకుండా సౌందర్యస్రష్టయై సిద్ధిపొందటం అంకాల సుబ్బారావుగారిలో విశేషం; ఆంధ్రుల అదృష్టం. భీమవరంలో అంకాల సుబ్బారావు గారు చిత్రకళా సౌందర్యాలు సృష్టిస్తూవున్న గృహాభ్యంతరం ఆంధ్రులకు ఏదో మారుమూల ప్రదేశమైనను, కళాపిపాసువులకు రసరాజధాని కాగలదని నా విశ్వాసం.

ఆర్యనాగార్జునుని చిత్రం ఒక సుందర శిల్ప సృష్టి. స్వర్ణవర్ణరంజితమైన భిత్తికపై ఆర్య నాగార్జునదేవుని మూర్తి ప్రత్యక్షమైంది. అతడు కవిగా, రసాయనిక విద్యా నిష్ణాతుడుగా, తర్క శాస్త్ర పండితుడుగా, ఖనిజశాస్త్రజ్ఞుడుగా స్వయం వ్యక్తంచేసే చిహ్నాలను అందంగా చిత్ర ములో ఇమిడ్చారు శ్రీ సుబ్బారావుగారు. పుం ఖాను పుంఖంగా వాటిని ప్రస్తరించటం సౌం దర్య స్ఫూర్తి కోసం గులాబీపువ్వును రేకులు రేకులుగా విడదీయటం. అనుభవైకవేద్యమైన ఆనందాన్ని మాటలలో ప్రతిపాదించటం కష్టం. చిత్ర వర్ణ సమ్మేళనంలో వెలుగు నీడలు చూపించే అందాన్ని లేఖిని లిఖించలేదు. పర తత్వజిజ్ఞాసువులైన శిష్యులకు అమృతయోగం ఉపదేశిస్తూవున్న ఆ అభయముద్ర—ఆ అంగుళీ విన్యాసంలో ఆధ్యాత్మిక ప్రభా విలసితమైన భ్రూలతాభంగాలు—అర్ధనిమీలితమైన కను రెప్పలు—ఈషత్ చలనోన్ముఖమైన అధరా లలో అనుచ్చారితమై ఏ అమృతయోగం భాసి స్తోందో!

అంతర్జాతీయ కళాక్షేత్రాలలో అంకాల సుబ్బారావుగారి 'నాగార్జునుడు' ప్రాచీన చరి త్రలో సంపాదించిన స్థిరకీర్తిని ఆర్జించుగాక— ఇది ఆంధ్రుల ఆకాంక్ష.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు :

'స్పెక్యులేషన్ విధానము రద్దు'

ధనికవాద దేశాలన్నింటిలోను పరిశ్రమలు, వర్తకము మొదలైన కార్యకలాపమంతా ఈనాడు పెద్ద పెద్ద 'జాయింట్ స్టాక్ కంపె నీలు' నిర్వహిస్తున్నవి. ఈ కంపెనీలు మూల ధనాన్ని వాటాలుగా విభజిస్తారు. ఈవాటా లను కొనుక్కున్నవారు కంపెనీకి యజమానులవు తారు. ఈ వాటాలు ఒకరినుండి మరొకరికి మార్చుకొనటానికి మంచి సౌకర్యములు ఏర్పాటు చేయబడివుండటచేత, ఇవి బజారులో ఎక్కు వగా అమ్మకము జరుగుతూవుంటవి. ఒక కంపెనీ వాటాలకన్న వేరొక కంపెనీవాటాలు లాభ దాయకంగా వున్నప్పుడు ఆ రెండవ కంపెనీ వాటాలు కొనుక్కోవాలని అందరూ ప్రయత్ని సుండటం సహజమేకదా. కంపెనీవాటాల అమ్మ కము, కొనుగోలు ఎక్కువైన తరువాత, ప్రత్యేకం వాటాలలో వ్యాపారానికి ఒక మార్కెట్ ఏర్పాటుచేయటం పరిపాటి అయి పోయింది. ఈ మార్కెట్‌నే 'స్టాక్ ఎక్స్ఛేంజి' అని 'స్టాక్ మార్కెట్' అని అంటారు. ఈ స్టాక్ మార్కెట్ వ్యాపారంలో రెండు ప్రత్యేక, విచిత్రపద్ధతులున్నవి: ఒకటి, భవిష్య త్కాలమునకు సంబంధించిన కొనుబడి, అమ్మ కము ఇప్పుడే జరుపుట; రెండు, బేరము నిర్ణ యమంటు పోయినను, పరిష్కారమును మాత్రము వాయిదా వేసి కొనుచుండుట. ఈరెండు విధా నములు స్టాక్ మార్కెట్‌లోనే ప్రారంభమైనా ఇతరవస్తువుల మార్కెట్లకుకూడా వ్యాపించినవి. ఇప్పుడు నిర్ణయించుకున్న ధరకు ఇప్పుడు నిర్ణయించుకున్న ఒక తేదీ నాటికి, నిర్ణయించబడిన వస్తువులు, లేక వాటాలను అమ్మటకొకరు, కొనుటకొకరు అంగీకరించుట భవిష్య త్కాలమునకు సంబంధించిన వర్తక మని చెప్ప వచ్చును. ఉదా : 1948వ సం. మార్చి 15వ తేదీన 100 వాటాలను వాటా 10 రూ.ల చొప్పున మీకు నేనమ్ముటకు ఈనాడు మన మిద్దరము ఒక బేరము ఫైసలు చేసుకొన్నచో దానిని భవిష్య త్కాలమునకు సంబంధించిన వర్తకమందురు. ఆగడువు తేదీనాటికి ఆ వాటాల ధర 10 రూ.ల కన్న ఎక్కువైన వుండవచ్చును, తక్కువైన వుండవచ్చును. ధర 10 రూ.లకన్న ఎక్కువ వున్న మీకు లాభము; తక్కువవున్న నాకు లాభము. ఆవాయిదారోజున వాటాల నిచ్చి పుచ్చుకొనకుండ లాభనష్టములు మాత్రమే ముదరా పుచ్చుకొనుట యీవర్తకములో పరి పాటి. కాబట్టి ఇట్టి వ్యాపారమును 'స్పెక్యు లేషన్' అంటారు.

భవిష్యత్కాలమునకు సంబంధించిన వర్త కముగాక, అప్పటికప్పుడే పరిష్కారము చేసు కొనవలసిన బేరములలోకూడ, డబ్బుచెల్లించి, వాటాలుగాని వస్తువులుగాని పుచ్చుకొనుటకు అన్ని మార్కెట్‌లలోను కొంత 'గడువు' యిస్తారు. ఈగడువు 3,5,10,15 రోజులకూడా వుంటుంది. ఆ గడువునాడు పరిష్కారము చేసుకొనుట యిష్టము లేకపోయినచో, రెండవ పక్షమునకు కొంత పరిహార మిచ్చి, పరిష్కారము మరుసటి 'గడువు' తేదీవరకు వాయిదా వేయించుకొన వచ్చును. ఈ సౌకర్యములవలన, బేరము లాభ సాటిగా వున్నదని భావించినప్పుడు డబ్బు లేని వారుకూడ కొనివేయుటకు సరకు లేనివారు కూడ సరకును అమ్ముటకు అవకాశము కలుగుచున్నది. ఇందువలన స్పెక్యులేషన్ మరింత వృద్ధి చెందు చున్నది. ఈ రెండు రకముల స్పెక్యులేషన్ భారతదేశములో రద్దుచేయుటకు భారత ప్రభుత్వం నిర్ణయించినది. ఈస్పెక్యులేషన్‌వలన వాటాలయొక్కయు, వస్తువులయొక్కయు ధరలు ఆశావాదులు అనవసరముగా పెంచి వేయు చున్నారు. కొందరు దివాలా తీయుటను, కొం దరు భాగ్యవంతులవటయు తటస్థిస్తున్నది. అందు వలననే ఈ పద్ధతుల వ్యాపారము బ్రిటన్‌లో కూడ ఈ మధ్యననే రద్దుచేయబడినది.

నారాయణ భట్టు

(6 వ పేజీ తిరువాయి)

కగు సైన్యములకు కొన్ని మాసములు పట్టెను. భ్రమరకోట్యము చక్రకోట్యాధిపతికి సామంతుడగు మధురాంతకదేవునిది.

మధురాంతకదేవుడు అంతర్యమున రాజరాజ నరేంద్రుని భక్తుడు. మధురాంతకుని రాజగురువగు వేడిపాత్రుడు నన్నయభట్టారకునకును నారాయణ భట్టునకును వజ్జియ కుమారునికిని కాంచీపురమున సహాధ్యాయుడు. మధురాంతకదేవు డెన్నటికైనను స్వతంత్రుడు కావలెనని తలంచుచు తన దృష్టియంతయు చక్రకోట్యాధిపత్యముపై నుంచుకొని రాజరాజు బలములపై నాధారపడుచుండెను.

మధురాంతకదేవుడు దుర్గమును రక్షించు ప్రయత్నములో నున్నట్లు నటించెను. కాని యాకస్మికముగా వేంగీసైన్యములు ముట్టడించినందున విధిలేక లొంగిపోయినట్లు లొంగిపోయెను. ...చే నాంతరంగికులకు దప్ప నెవ్వరికి నీరహస్యము తెలియదు. వేంగీసైన్యములు యువరాజు నాయకత్వమున మహావిజయము పొందెనని పొంగిపోయెను. ద్రావిడ దేశమున యువరాజభ్యసించిన రణవిద్య అద్వితీయమని యా చుట్టుప్రక్కల కీర్తి వ్యాపించెను. భ్రమరకోట్యపతనముచే యువరాజునకు చక్రకోట్య దండయాత్ర సులభసాధ్య మయ్యెను. భ్రమరకోట్యము చైత్ర బహుళ అమావాస్య బుధవారమునాడే స్వాధీనపడెను.

యువరాజు మధురాంతకదేవుని మహాసభాముఖమున సామంతునిగా నొనర్చుకొని బహుమానములు గ్రహించి మన్నించి యాతనియొద్ద ననేక నావలు యాత్రార్థము పుచ్చుకొనెను. అచ్చట విజయోత్సవములు రెండు దినములు నడిపించి వైశాఖశుద్ధవిదియ శుక్రవారము వృషభసంక్రాంతినాడు అభిజిల్లగ్నమున ప్రయాణభేరి వేయించెను. ముందు ఇంద్రావతీనదిపై నావలతో సైన్యమును తీసికొనిపోవనెంచి యందుగల నావలన్నియు గ్రహించెనుగాని చివరిక్షణమున నేలయి దనే ప్రయాణము నిశ్చయించెను.

భ్రమరకోట్యము వేంగీసేనలు ముట్టడించుటకు దండయాత్ర వచ్చుచున్నదనియే చక్రకోట్యాధిపతియగు ధారావర్ష మహారాజెరుగడు. చైత్రమాసాంతముననే కుంతలచాళుక్య ప్రభువు ఆహవమల్ల సోమేశ్వరుని సైన్యములు వేంగీమండలముపై దండెత్తునని యతనికి తెలిసియేయున్నది. మరియు దాను ఎందరో చారులను వేంగీమండలమున కంపి యెన్నియో కేంద్రస్థలములలో అలజడులు జరిపించుటకు ప్రయత్నములు చేసియుండెను. రాజమహేంద్రవరములో రాజబంధువులలో కుమారపట్టము వాదసంఘారామముల సహాయముతో రాజద్రోహమునకు పెద్దయెత్తున చేయుచున్న ప్రయత్నములు నిరాటంకముగా సాగిపోవుచున్నవని యతనికి వార్తలు వచ్చుచుండెను. మరియు దాను రాజరాజనరేంద్రుని మహాసభకు కప్పముగాని ప్రతినిధినిగాని పంపకున్నను రాజసభలో బహిరంగముగా నెట్టి రోషప్రదర్శనము జరిగియుండలేదు. అప్పటికి రాజరాజు అసమర్థతవలననే యట్లు చేసెనని నిశ్చయించెను. తాను అందరు చారులను వేంగీ మండలమునకు పంపినప్పుడు వేంగీ ప్రభువుకూడ రహస్యముగా దనపైకి మహాసైన్యములు పంపునని మాత్ర మూహింపలేకపోయెను.

ఆహవమల్లసోమేశ్వరుడుగూడ ధారావర్షుని మోసగింపలేదు. చైత్ర పూర్ణిమకే వేంగీమండలము పశ్చిమపు సరిహద్దునకు చాముండరాయ డను దండనాథుని యధీనమున మహాసేన యొకటి పంపెను. ఆ సేన దండెత్తుటకు నెపముకై నిరీక్షించుచు నింతలో యాత్రాసన్నాహములు పూర్తిచేసికొనుచుండెను. ఇంతలో సోమరాజపుత్రుడు తన్ను శిక్షించుచు రాజరాజనరేంద్రు డిచ్చిన తీర్పుపై కుంతలేశ్వరులకు మనవిచేసికొనుట కవకాశ మీయవలెనని యర్థించెననియు, రాజరాజది నిర్లక్ష్యము చేసెననియు వార్త కుంతలేశ్వరులకు చేరెను. అందుపై నాహవమల్లసోమేశ్వరుడు రాజరాజనరేంద్రునకు అట్లు చేసినందుకు వెంటనే సమాధాన మీయవలెననియు, లేనిచో శిక్షింపవలసి వచ్చుననియు రాయబార మంపెను. అది విని రాజరాజ నరేంద్రుడు ముఖము బొమముడి వేసెను. మరల మనస్సు నిలువరించుకొని పరిచారకునిచే రాజమందిరాంగణమునుండి యొక్క తృణకణము తెప్పించి యది రాయబారి చేతి కిమ్మనెను. అట్లు చేసిన పిమ్మట "మా ప్రభువుకు మా ప్రత్యుత్తర మది యని యిమ్ము." అని యా రాయబారిని తృణహస్తముతో పంపివేసెను. ఆ రాయబారి వేంగీభూమి పశ్చిమపు సరిహద్దులు దాటిన వెంటనే చాముండరాయని సైన్యములు ఒక్కసారిగా ఆరుగడి దుర్గములపై బడెను. అందులో ఉత్తరమున నున్న రెండు దుర్గములును దక్షిణమున నున్న రెండుదుర్గములును చాముండరాయని వశమయ్యెను మధ్యనున్న రెండు దుర్గములు మాత్రము సాహసముతో నెదిరించుచుండెను. స్వాధీనమైన రెండు ప్రక్కలనుండియు చాముండరాయని సైన్యము లా రెండు మధ్య దుర్గముల మీదికిని మహోర్భాటముతో ద్రుంగివేయుటకు నడచుచుండెను. ఇది యంతయు చైత్రబహుళ అమావాస్యకే జరిగిపోయెను. ఈ శుభవార్త లింకను ధారావర్షునికి చేరలేదు.

ఇంతలో భ్రమరకోట్యమును వేంగీసేనలు ముట్టడించెనని వార్త వచ్చెను. అది ధారావర్షుని నాశ్చర్యచకితుని జేసెను. అయినను భ్రమరకోట్యము మిక్కిలి బలిష్ఠమగు దుర్గము. అది బహుకాలము నిలువరించుకొనగలదని ధైర్యము తెచ్చుకొని శీఘ్రముగా చక్రకోట్యదుర్గమును మరింత బలపరుపసాగెను. శిథిలమైన స్థలములు శిల్పులచే రాత్రింబవళ్లు పనిచేయించి పునర్నిర్మాణము చేయించెను. ఖనకులు పరిఖ లోతు చేసిరి. దండనాయకులు సేనలను ఉచితరీతిగా విన్యసించి యాయుధములు విరివిగా సైనికుల యధీనమొనర్చిరి. వర్తకులు కోటలో నందరకు సంవత్సరమునకు సరిపోవు నాహారపదార్థములను అశ్వాదులకు గ్రాసమును పదిలపరచిరి. దూరమున నొక కొండపై గల సరోవరమునుండి రహస్యమార్గమున నా దుర్గమధ్యమున వింధ్యవాసినీదేవి యాలయమందలి వాపిలోనికి జలము వచ్చును. వింధ్యవాసినీదేవి చక్రకోట్యాధిపతుల కులదేవత ఆ వాపిలో స్వయంభూజలలింగము కల దని ప్రతీతి కలదు. ఆ వాపిలో జల మెంత తోడినను తరుగదు. అదియే దుర్గమందలి సమస్త జీవులకును జీవనాధారము. ఆ వాపీజలమూలము దుర్గరహస్యములలో నొకటి. దండయాత్రలు వచ్చినప్పుడు దుర్గములో నున్న కొన్ని యితర కూపములు బాగు చేయించుట పూర్వాచారము. ఇప్పుడును సూత్రధారు లట్లే చేయించిరి. అన్ని ప్రయత్నములను ధారావర్షుడును, అతని ఏకైకపుత్రిక వింధ్యవాసినియు స్వయముగా పరీక్ష చేయుచుండిరి.

కాని రెండుదినములలోననె భ్రమరకోట్యము లొంగిపోయె నను వార్త రాగానే ధారావర్షునికి భయ మావేశించెను. ఐనను ధైర్యము వహించి భ్రమరకోట్యమునుండి చక్రకోట్యమునకు సేనలు సామాన్యముగా వచ్చు మార్గము లన్నియు సేనాప్రస్థానమున కయోగ్యములుగా జేయ నుత్తరువు లిచ్చెను. విశాలమార్గములలో వృక్షతక్షకులు మహావృక్షములు పడవేసి మార్గము నిరోధించిరి. సంగ్రహించిన ధాన్యములు దూరభూములకు శీఘ్రయానముల జేర్చిరి. పెద్దపెద్ద తటాకముల కట్టలు త్రెంపి యా ప్రదేశము నిర్జలము చేయ జూచిరి.

ఇదియంతయు రాజేంద్రదేవు డంతకుమున్న జరుగునని శంకించి యందుకు సిద్ధపడి యుండెను. ముందు ధారావర్షు డూహించిన మార్గములో యాత్ర చేయుచున్నవానివలె ప్రకటించెను. కాని మార్చుకొని వెనుదిరిగి పోవుచున్నవానివలె కొంత దూరము తూర్పుకు నడచి చుట్టు మార్గమున మూడుదినములలో చక్రకోట దుర్గము సమీపించెను. వైశాఖశుద్ధపంచమి శ్రీ విద్యాశంకరజయంతి ఆదివారమే యయ్యెను. ఆ జయంత్యుత్సవము మార్గమధ్యముననే భక్తిలోపము లేకుండ లఘుకలాపముతో సైన్యములు నిర్వర్తించెను. సోమవారమునాడు చక్రకోట్యము తూర్పువైపునకు సైన్యము లట్టహాసముతో చేరెను.

ధారావర్షునికి భయ మినుమడించెను. దుర్గరక్షణ కార్యము లింకను జరుగుచునేయుండెను. దుర్గరక్షణకు గొప్పసైన్యమును వింధ్యవాసిని యధీనమునందుంచి కతిపయ సేనలతో ధారావర్షుడు స్వయముగా రాజేంద్రదేవుని సైన్యముల బయలున నెదుర్కొనెను. ధారావర్షుని సేనలో ననేకగజములు కలవు. చక్రకోట్యమండలమును దానికి సమీపమున గల వాయిరానగర మను నామాంతరముగల వజ్రపుర ప్రాంతమును గజములకును వజ్రములకును జన్మస్థానములు.

రాజేంద్రదేవునికి గజబలము తక్కువ, అశ్వబల మెక్కువ. అశ్వబలములను వామదక్షిణపక్షములనుంచియున్న గజబలమును మధ్య మంచెను. కాని యా గజబలమునకు ముందుకు నడవకుండ నొక యున్నతప్రదేశమున నిలిచి యుండునట్లుత్తరువులు చేసెను. అశ్వికులు మాత్రము విశ్వవేగముతో ధారావర్షుని సైన్యపక్షములను తాకిరి. ఆ తాకునకు చక్రకోట్యసైన్య పక్షములు విచ్చిపోయెను. అందుచే బలమగు సైన్యశిరస్సగు గజబలము వృథ యయ్యెను. ప్రక్కలనుండియు కొంత వెనుకభాగమునుండియు పైబడిన వేంగీహయదళములు ఆ గజబలమును చీకాకుపరచెను. అప్పుడు సమయము చూచి కరుణాకర తొండమానుడు వేంగీగజబలముతో ముందుకు నడచెను. క్రమశిక్షణ నొందిన వేంగీ ధానుష్కులు చక్రకోట్య గజపాలకులను పలువుర శరవిహతులజేసిరి. ధారావర్షుడు లాభము లేదని యా మధ్యాహ్నమునకే నిశ్చయించుకొనెను. అంతట సాధ్యమైనంతవరకు సేనను కూర్చుకొని విచ్చిపోని గజబలముల వెనుక నడ్డుగా నుపయోగించుకొని సాయంకాలము లోపల కోటలో ప్రవేశించెను. ధారావర్షుని గజములలో నేబది గజములు వేంగీయువరాజు వశమయ్యెను.

వేంగీయువరాజా రాత్రి తన సేనలకు విజయోత్సవములు చేసికొనుట నిషేధించెను. దుర్గము స్వాధీనమైయందు వరాహలాంఛనము నెత్తించిననాడు కాని విజయోత్సవము విషయముగూడ ప్రస్తావింపరాదని యాతని కఠిన శాసనము! ఆ రాత్రి యువరాజునకును, చోళమిత్రులకును, చంద్రాదిత్యునకును, నారాయణ భట్టునకును నిద్దుర లేదు. వారు చక్రకోట్య దుర్గనిరోధమునకు అనుకూలించు ప్రదేశములన్నియు నిర్దేశించుకొని యన్నియెడల తిలబలములు సంస్థాపించిరి తెల్లవారు సరికి చక్రకోట్యదుర్గము ముట్టడి పూర్తియయ్యెను. చక్రకోట్యదుర్గమునకు వచ్చు మార్గములన్నియు నిరోధించిరి. సమీపములో నున్నతప్రదేశములందెల్ల స్కంధావారకేంద్రములు నిర్మించి వాని సంరక్షణకు నేర్పాటు చేసిరి. పల్లపు ప్రదేశములలో సేనకాహారసౌకర్యములు చేయ నియోగించిరి. అందు మిక్కిలి పల్లముగా నున్న యొక ప్రదేశమును చంద్రాదిత్యుడు సూక్ష్మదృష్టిచే కనుగొని యచ్చటికింద్రావతీ నదీజలము మరలించిన సరోవరము గానగునని యుపలక్షించి సూచింపగా ఖనకులు మరునాటి కది సిద్ధము చేసిరి. స్కంధావారమునకన్ని దిక్కుల రాత్రింబవళ్ళు జాగరూకులగు సైనికుల గావుండ నియోగించిరి.

క్షతగాత్రులకు చికిత్సచేయుటకు శతాధికులగు వైద్యశిఖామణులు సేన వెంట నుండిరి. సేనల వెంట తరచుగా వచ్చు నటులను గాయకులను విదూషకులను మరి యితర వినోదకరులను రాకుండ యువరాజు కఠినముగా నిషేధించెను. సురాపానము సేనలకు నిషేధించెనుగాని ప్రతిదినమును స్కంధావారమున కమితముగా సుర వచ్చునట్లు గౌడజనుల నియోగించెను. ఆ సురగజములకును యుద్ధములోనికి దిగుచున్న భట సంఘములకు మాత్రము యుద్ధాత్పూర్వమును యథావాంఛితముగా నిచ్చుటకను జ్ఞ యిచ్చెను. యుద్ధకాలమున వీరుల కనుమతమగు నీ సురాపానమునకు వీరపాన మను సంకేతనామముకలదు.

ఇట్లు సమస్తసన్నాహములను చేయుచు రాజేంద్రదేవుడు సేనల కొక్కనాడు పోరు లేకుండ విశ్రాంతి యిచ్చెను. ఎదుట దుర్గములో మహాసేన యుండగా ముట్టడించిన సేనలకు విశ్రాంతి యుండునా? ఒడలు మరచి నిద్రించుట కవకాశముండునా? విశ్రాంతి పొందుట యనగా తాముగా కయ్యమునకు తలపడకుండుట! ఈ విశ్రాంతిచే సైన్యములకు మరునాటికి నూతన శక్తి వచ్చును. తాను కష్టనిష్ఠురములు పరీక్షించి యాలోచించుకొనుట కవకాశ మేర్పడును.

చక్రకోట్యదుర్గము ఇంద్రావతీనది తూర్పునుండి దక్షిణముగా తిరిగిన మలుపులో నున్నది. అందుచే నుత్తరమునను పశ్చిమమునను దానికి త్రవ్వని యగడ్తగా నానది ప్రవహించుచున్నది. ఆ వైపుల కోటగోడల కానుకొని యా నది యే కాల మగాధముగా నుండునట్లు కృత్రిమముగా నిర్మాణము చేసిరి. అటు కోటగోడలును మిక్కిలి యున్నతములు. నావలు వేసికొని వచ్చువారును అటునుండి కోటగోడను ప్రాకుట దుస్సాధ్యము. ఆ రెండువైపుల గోపురద్వారములును లేవు.

ఇక తూర్పునను దక్షిణమునను బలిష్ఠములగు సింహద్వారములు గలవు. ఆ రెండు గవనులకు రెండురెండు దిడ్డు గలవు. నియమితదూరములలో ననేకములగు బురుజులును మసంఖ్యాకములగు కొమ్మలును గలవు. నిరంతరము గవనకొక్కక్కదానికి ఐదువందలమంది సాయుధభటులును, దిడ్డి కొక్కక్కదానికి నూర్గురును, బురుజులకు ఏబదిమందియు, కొమ్మకిద్దరు చొప్పున నుండుట సర్వసామాన్యము! అట్లే చక్రకోట్యమును నిరంతరము సాయుధభటులు రక్షించుచుండిరి.


తన స్కంధావారము బాణపాతనమార్గమును దాటి రాజేంద్రదేవుడు నిర్మించెను. అది నిర్ధారణ చేసికొనుటకు పలుతావులకు బోయి బాణప్రయోగము చేయించి చూచి యా పిమ్మట ధృవపరచుకొనెను. అశ్వము లెక్కి యాతడును, మిత్రులును, నారాయణభట్టును, దండనాథులును స్వయముగా నిరంతరము సర్వవిషయములు కనిపెట్టుచుండిరి.


★ వార్త చిత్రాలు ★


(1) ఈమధ్య ఢిల్లీలో జరిగిన అఖిలభారత పారిశ్రామిక వేత్తల సమావేశంలో ప్రధాని పండిట్ నెహ్రూ ఉపన్యసిస్తున్న దృశ్యం. భారతప్రభుత్వ మంత్రులు షణ్ముఖం చెట్టి, జగజీవన్ రాం, శ్యాంప్రసాద ముఖర్జీ, సర్దార్ బలదేవ్ సింగ్, గోపాలస్వామయ్యంగారలు వెనుక వరసలో ఆసీనులై వున్నారు.


(2) అఖిలభారత వాణిజ్యప్రముఖుల సమావేశం ఈమధ్య లక్నోలో జరిగినప్పుడు ఈ చిత్రం తీయబడినది. ఆచార్య నరేంద్రదేవ్ స్వాగతోపన్యాసం చదువుతున్నారు. మధ్య కూర్చున్నవారు అధ్యక్షత వహించిన సర్ పద్మపంత్ సింఘానియాగారు. చివర కూర్చున్నవారు యు. పి. ప్రధాని పంత్ గారు.

(3) పరిటాల జాగీరు గ్రామాల కేంద్రపంచాయితీ రాజ్యాధ్యక్షుడు శ్రీ మాదిరాజు దేవరాజు (మధ్య నిలబడినవారు); పరిటాల పంచాయితీ కార్యదర్శి శ్రీ చింతలపాటి విశ్వనాథం (కుడిప్రక్కన నిలబడినవారు); కొండపేట పంచాయితీ కార్యదర్శి బండి వెంకయ్య (ఎడమప్రక్కన నిలబడినవారు.)









పండరిపూర్ వద్దనున్న మహూద్ లో ఈ మధ్య జరిగిన పశుప్రదర్శనమును పునర్నిర్మాణశాఖ మంత్రి పాటిల్ గారు ప్రారంభించారు. ఆ ప్రదర్శనంలో ప్రదర్శింపబడిన గొర్రెలు ఈ చిత్రంలో కనిపిస్తున్నవి.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G T. Madras.

Q. H. M. S. No. 857—10,000 Copies.